www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




సంపుటి 08, సంచిక: 315 | గురువారం | 16-10-2025 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఇపిఎఫ్‌లో అమానుష నిబంధనలు

# తక్షణం రద్దు

**కేంద్ర కార్మికమంత్రికి ప్రతిపక్షాల డిమాండ్**

**న్యూఢిల్లీ:** ఇపిఎఫ్ఓ (ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ) నిబంధనలలో కొత్త మార్పులను కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. తక్షణం వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. ఈ కొత్త నిబంధనలు దిగ్భ్రాంతికరంగా హాస్యాస్పదంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ఆర్థిక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తప్పుదారి పట్టించడంవల్ల వేతన జీవులు శిక్షలు అనుభవిస్తున్నారని విమర్శించాయి. ఉద్యోగ భవిష్యనిధిలో అమానుషమైన నిబంధనలను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ ఎంపి మాణిక్కంటాగోర్ కేంద్ర కార్మిక,ఉపాధిశాఖామంత్రి మన్సుఖ్ మాండవీయను డిమాండ్ చేశారు. కార్మికమంత్రి తీసుకున్న నిర్ణయం భవిష్యనిధిపై ఆధారపడే పెన్షనర్ల జీవితాలను అంతం చేసేలా ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులు చేసుకున్న తమ సొంత పొదుపు నుండి ధనాన్ని తీసుకోవడం వారికి శిక్షగా మారిందని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బుధవారం ఆయన పోస్టింగ్ పెట్టారు. ''మోదీజీ, తమ పొదుపు నుండి అవసరమైనప్పుడు ధనం తీసుకోవడం పెన్షనర్లకు, ఉద్యోగాలు పోయిన వారికి ఒక పెద్ద శిక్షగా మారింది, మీరు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించండి, మీరు జోక్యం చేసుకునే పరిస్థితి వచ్చింది, మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారు, ఇపిఎఫ్ఓ నిబంధనల ప్రకారం గతంలో ఎవరైనా ఉద్యోగి నిరుద్యోగిగా మారితే రెండునెలల్లోనే తన పొదుపు మొత్తాన్ని తీసుకునే అవకాశం ఉండేది, కానీ ఇప్పుడు నిరుద్యోగిగా

తరువాయి 2లో



మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తి

విజయలక్ష్మి కి పలువురి ఘననివాళి

03

**ధాన్యం కొనుగోలు వివరాలు నమోదైన**

# 48 గంటల్లో చెల్లింపులు

- మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని చర్యలూ తీసుకోవాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- ధాన్యం దిగుబడిలో తెలంగాణ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిందని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు వివరాలు నమోదైన 48 గంటల వ్యవధిలోనే చెల్లింపులు ఉంటాయని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్‌ను అందిస్తామని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కొనుగోలుకు సంబంధించిన అన్ని పరికరాలనూ అమర్చు కోవాలని ఆదేశించారు. ఇప్పటికే కామారెడ్డి, నిజమాబాద్, మెదక్, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలో 1205 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. 'వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అంశంపైన జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు,వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, రవాణాశాఖ కమిషనర్ రఘునందన్ రావు,

తరువాయి 2లో

మొక్కజొన్న కొనుగోలుకు

# కేంద్రం విముఖత

- రైతు ప్రయోజనాల దృష్ట్యా నేటినుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం
- మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్

మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని, అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గురువారం నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఆరంభిస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, హాకా, ఆర్ఐసి సంస్థల ఎండిలతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.వివిధ పంటల కోతలు ప్రారంభమైన సందర్భంగా వాటి సేకరణ,మార్కెటింగ్ డిపార్ట్ మెంట్ ద్వారా వరిధాన్య సేకరణలో అవసరమయ్యే

తరువాయి 12లో

మరణశిక్ష పడిన ఖైదీకి

# ఆప్షన్ ఇవ్వలేం

సుప్రీంకోర్టు అసహనం!



**న్యూఢిల్లీ :** మరణశిక్ష పడిన ఖైదీలకు ప్రస్తుతం అనుసరిస్తున్న ఉరితీత విధానాన్ని తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. అయితే మరణశిక్ష అమలులో ఉరితీత విధానాన్ని మార్చే ఉద్దేశం లేదని కేంద్రం కోర్టుకు తెలిపింది. దాంతో ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. కాలానుగుణంగా మార్పులను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ సమస్య అని వ్యాఖ్యానించింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా ఈ పిటిషన్ దాఖలు చేశారు. మరణశిక్ష పడిన ఖైదీకి కనీసం ఉరితీతా? లేదంటే ప్రాణాంతక ఇంజెక్షనా? అనే ఆప్షన్ ఎంచుకునే అవకాశమైనా ఇవ్వాలని పిటిషనర్ తన పిటిషన్‌లో కోరారు. అమెరికాలోని 49 రాష్ట్రాలు మరణశిక్ష అమలులో ప్రాణాంతక ఇంజెక్షన్ విధానాన్ని అనుసరిస్తున్నాయని, దానివల్ల మరణ సమయంలో శిక్షపడ్డ నేరస్థుడికి తక్కువ వేదన ఉంటుందని ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలిందని పిటిషనర్ పేర్కొన్నారు. దాంతో సుప్రీం ధర్మాసనం.. పిటిషనర్ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, దాన్ని పరిగణించేలా చూడాలని ప్రభుత్వ తరపు న్యాయవాదికి సూచించారు. అయితే

తరువాయి 2లో

జూబ్లీహిల్స్ నియోజకవర్గ

# బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పేరును పార్టీ జాతీయ నాయకత్వం ఖరారు చేసింది. ఆయన 2023 ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచే పోటీ చేసి ఓడిపోయారు. మరోసారి బిజెపి అధిష్ఠానం ఆయనకే టికెట్ ఖరారు చేసింది. ఈ స్థానం నుంచి టికెట్ కోసం జూటూరి కీర్తి రెడ్డి, వీరపనేని పద్మ, లంకల దీపక్ రెడ్డి పేర్లను జాతీయ నాయ కత్వానికి పంపించగా దీపక్ రెడ్డి పేరును ఖరారు చేశారు. దీపక్ రెడ్డి ప్రస్తుతం బిజెపి హైదరాబాద్ సెంట్రల్

తరువాయి 2లో




నామినేషన్ దాఖలు చేసిన బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత



2040 నాటికి చంద్రుడిమీద

# భారత్ టూరిజం!

- డిసెంబరులో గగనయాన్ 'వ్యోమమిత్ర'
- 2027లో మానవ సహిత గగనయాన్
- ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడి

**రాంచీ:** మానవ రహిత గగనయాన్ ప్రయోగాలలో భాగంగా ఈ ఏడాది డిసెంబరులో 'వ్యోమమిత్ర' (హాఫ్–హ్యూమనోయిడ్ రోబో)ను పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ చెప్పారు. మానవ సహిత గగనయాన్‌కు ముందుగా మూడు మానవ రహిత గగనయాన్ ప్రయోగాలు చేస్తామని, ఇందులో భాగంగా మొదటి విడత 'వ్యోమ్మిత్ర'ను ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మిగిలిన రెండు మానవ రహిత గగనయాన్ ప్రయోగాలను 2026లో పూర్తిచేస్తామన్నారు. ఇస్రోకు ప్రధానమంత్రి నిర్వచించిన బృహత్తర ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమాలన్ని వరుసగా జరుగుతాయని,

తరువాయి 2లో

దివిస్ కోసం పేద రైతుల

# పొట్టగొడతారా?

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ధ్వజం

భూమికి భూమి ఇవ్వాల్సిందే

అమరావతి కంటే మిన్నగా చౌటుప్పల్ రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్

03






**42% రిజర్వేషన్ అమలయ్యేదాకా పోరాటం**

స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒపైన హైకోర్టు స్టే విధించడాన్ని ఖండిస్తూ బుధవారం 'బిసి హక్కుల సాధన సమితి' ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాలలో రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పాల్గొన్నారు.

09

ఆయుధాలు వదలకపోతే

# హింసతో లొంగదీస్తాం

హమాస్‌కు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్ :** ఇజ్రాయెల్ సైన్యం నిర్దేశిత ప్రదేశం నుండి వెనక్కు వెళ్ళిపోయిన తర్వాత గాజాలో అధికారంపై పూర్తి పట్టు సాధించేందుకు హింసాత్మక దాడులతో హమాస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. గాజాలో యుద్ధ విరమణ శాంతి ఒప్పందం ప్రకారం సహేతుకమైన సమయంలోపు హమాస్ ఆయుధాలు వదిలిపెట్టాలని హెచ్చరించారు. తమ దళాలు నిరాయుధీకరణ పాటిస్తాయంటూ హమాస్ అగ్రనాయకులు చర్చల్లో తమకు వాగ్దానం చేశారని గుర్తుచేశారు. ఆయుధాలు వదిలేయకపోతే తామే హమాస్‌ను హింసాత్మక పద్ధతులలో లొంగదీస్తామని హెచ్చరించారు. ''మీరు ఆయుధాలు వదిలేస్తున్నారు...సరేనా? అని అడిగాం, ఎస్ సర్, మేం ఆయుధాలు వదిలేస్తాం అని వాళ్ళు చెప్పారు, ఇదే చర్చల్లో జరిగిన విషయం'' అని అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్‌ను ఉటంకిస్తూ వైట్‌హౌస్‌లో పాత్రికేయులకు ట్రంప్ చెప్పారు. షర్మ్–ఎల్–షేక్‌లో మధ్యవర్తుల సమక్షంలో జరిగిన చర్చల్లో విట్‌కాఫ్‌తోపాటు ట్రంప్ అల్లుడు కుష్నెర్ కూడా ప్రతినిధిగా పాల్గొన్నారు. గాజాలో హమాస్ యోధులు తమ ప్రత్యర్థులకు బహిరంగంగా ఉరిశిక్షలు అమలు చేయడం,

తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## భారత్‌లో చికిత్స పొందుతూ కెన్యా మాజీ ప్రధాని ఒడింగా మృతి

**నైరోబీ:** తూర్పు ఆఫ్రికాదేశం కెన్యా మాజీ ప్రధానమంత్రి రైలా ఒడింగా భారత్‌లోని కేరళ కూత్తాట్టుకుళం దేవమాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. ఆయన వయసు 80 సంవత్సరాలు. కుటుంబ సభ్యులతో కలిసి నడుస్తూ వెళుతుండగా ఆకస్మికంగా ఆయన కుప్పకూలి పోయారని, వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించారని వైద్యులు ధృవీకరించినట్లు భారత్ పోలీసులు ప్రకటించినట్లు అంతర్జాతీయ మీడియా ప్రకటించింది. రైలా ఒడింగా రెండుసార్లు కెన్యా ప్రధానమంత్రిగా పనిచేశారు. 2008–2013 వరకూ ఒకసారి, 2018 అక్టోబరు నుండి 2023 ఫిబ్రవరి వరకూ మరోసారి ఆయన ప్రధానమంత్రి పదవిలో ఉన్నారు. ఐతే దేశాధ్యక్ష పదవి చేజిక్కించుకోవాలని ఆయన ఎంతో తాపత్రయపడ్డారు. ఐదుసార్లు అధ్యక్ష పదవికోసం ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రతిసారీ ఆయన ఓటమి చెందారు. కానీ ఆయన తన ఓటమి అంగీకరించలేదు. ప్రత్యర్థులు తన విజయాన్ని లాగేసుకున్నారని ఆయన ప్రతిసారీ వాదించారు.

# సైన్యం స్వాధీనంలోకి మడగాస్కర్ పాలన

### అధ్యక్షుడు రాజోలినా అభిశంసన



**అంటనానరివో:** ఆఫ్రికా ఆగ్నేయ తీరప్రాంత దేశం మడగాస్కర్‌లో అధికారాన్ని సైన్యం స్వాధీనం చేసుకుంది. దేశాన్ని స్వాధీనం చేసుకుంటామని ముందు ప్రకటించినవిధంగానే అధికారం చేజిక్కించుకుంది. మరోవైపు దేశంనుండి పారిపోయి గుర్తుతెలియని ప్రాంతంలో తలదాచుకున్న అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా (51)ను పార్లమెంటు సభ్యులు అభిశంసించారు. 163 మంది ఎంపీలున్న జాతీయ చట్టసభలో 130 మంది అభిశంసనకు మద్దతు తెలిజేయగా రాజోలినా మాత్రం సోషల్ మీడియా ద్వారా దీనిని తిరస్కరించారు. అధ్యక్ష పదవి నుండి వైదొలగేందుకు తిరస్కరించారు. శిక్షలనుండి తప్పించుకోవడంకోసంఆయన రెండు రోజులక్రితమే పార్లమెంటు (నేషనల్ అసెంబ్లీ)ను రద్దుచేశారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నందువల్ల దేశం వదిలి సురక్షితమైన ప్రదేశానికి వెళ్ళిపోయినట్లు ప్రకటించారు. జాతీయ చట్టసభను రద్దుచేసినట్లు రాజోలినా జారీ చేసిన డిక్రీ చెల్లుబాటు కాదని ప్రతిపక్షాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. రాజోలినా మంగళవారం ఎక్స్ వేదికగా విడిగా మరో పోస్టింగ్ పెడుతూ, దేశంలో తిరిగి కొత్త పార్లమెంటును ఎన్నికల ద్వారా ఏర్పాటు చేసేందుకు చట్టసభను రద్దుచేస్తూ తాను నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు. రెండేళ్ళక్రితం ఎన్నికల్లో ఆయన గెలుపు తీవ్ర వివాదాస్పదంగా మారడంతో దేశంలో యువకుల ఉద్యమం మొదలైంది. కానీ విద్యుత్ సరఫరాలో కోతలు, నీటి సరఫరా లేకపోవడం వంటి సమస్యలతో యువకులలో మొదలైన అసంతృప్తి గడచిన 20 రోజులుగా ఉధృతరూపం దాల్చి హింసాత్మక నిరసనలస్థాయికి చేరుకుంది. 2009లో కుట్రద్వారా రాజోలినాను సైన్యం అధికారంలో కూర్చోబెట్టింది. ఇప్పుడు ఆయనకు ఎదురుతిరిగింది. 2023లో రాజోలినా ఎన్నిక వివాదాస్పదమైనప్పటినుండీ దేశంలో ప్రజాందోళన చెలరేగింది.

**ఫ్రెంచ్ అధ్యక్షుడి సహాయంతో పరారైన రాజోలినా**

మడగాస్కర్ దేశాధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సహాయంతో దేశం వదిలి సురక్షిత ప్రాంతానికి వెళ్ళిపోయారు. ఫ్రెంచ్ యుద్ధ విమానంలో రాజోలినా గడచిన ఆదివారం (అక్టోబరు 12) దేశం వదిలిపారిపోయారు! మేక్రాన్‌తో ఈ మేరకు ఆయన ఒప్పందం చేసుకున్నారని ఫ్రాన్స్ ఆర్‌ఎఫ్ఐ (రేడియో ఫ్రాన్స్ ఇంటర్నేషనల్) ధృవీకరించింది. బంగ్లాదేశ్, నేపాల్ తరహాలో మడగాస్కర్‌లో కూడా యువకులు తిరుగుబాటు చేసి అనేక వారాలుగా ఆందోళన కొనసాగిస్తున్న తరుణంలో తన ప్రభుత్వాన్ని కూల్చివేస్తారని, తనకు ప్రాణాపాయం ఉందని ముందుగానే గుర్తించిన ఆండ్రీ రాజోలినా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఆయనను ఫ్రెంచ్ యుద్ధ విమానంలో సురక్షిత ప్రాంతానికి మేక్రాన్ తరలించారు. ఐతే మడగాస్కర్‌లో తలెత్తిన అంతర్గత సంక్షోభంలో తాము జోక్యం చేసుకోలేదని ఫ్రెంచ్ ఉన్నతస్థాయి అధికారులు బుధవారం వివరణ ఇచ్చారు. మడగాస్కర్‌లో సంక్షోభం ముదిరి పాకాన పడి గతనెల అంటే సెప్టెంబరు 25 నుండి ప్రపంచదేశాల దృష్టికి వచ్చింది.

# గుర్తుతెలియని మృతదేహం అప్పగించిన హమాస్

### ఇజ్రాయెల్ మండిపాటు



గడచిన 48 గంటల్లో (అక్టోబరు 13,14) హమాస్ సంస్థ అప్పగించిన ఎనిమిది మంది బందీల మృతదేహాల్లో ఒక మృతదేహం తమ దేశ బాధిత కుటుంబీకులకు చెందినది కాదని, ఎవరో గుర్తు తెలియని మృతదేహాన్ని తెచ్చి తమకు అప్పగించారని ఇజ్రాయెల్ ప్రభుత్వం మండిపడింది. అందువల్ల కేవలం ఏడుగురు బందీలను మృతదేహాలను హమాస్ తమకు అప్పగించిందని తెలియజేసింది. ఈ ఏడుగురు మృతదేహాలను కూడా వారి బంధువులు గుర్తించారు. ఎనిమిదో మృతదేహం ఇజ్రాయెల్‌కు సంబంధంలేదని ఇజ్రాయెల్ సైనిక దళం (ఐడిఎఫ్) తెలియజేసింది. "మేం రాజీపడే ప్రశ్నేలేదు, నిర్దిష్టమైన చివరి బందీ (మొత్తం 28 మంది నిర్జీవులు) ఇజ్రాయెల్ చేరేవరకూ మేం విశ్రమించేదిలేదు, మా కృషిని కొనసాగిస్తాం, కుంటి సాకులు చెప్పకుండా హమాస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేల్సిందే, ట్రంప్ ప్రతిపాదించిన ఒప్పందం ప్రకారం వాళ్ళు నిరాయుధీకరణ కూడా పాటించాల్సిందే" అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ బుధవారం ఉదయం ఉద్ఘాటించి చెప్పారు.

**రఫా క్రాస్ తెరిచిన ఐడిఎఫ్**

వివాదాలమధ్య రఫా క్రాసింగ్‌ను ఇజ్రాయెల్ సైన్యం రాకపోకల నిమిత్తం తెరిచింది. మొదట నాలుగు మృతదేహాలను హమాస్ స్వాధీనం చేసింది. హమాస్ వాగ్దానం మరిచిందని, 24 మృతదేహాలను ఇంకా స్వాధీనం చేయలేదని, అందువల్ల రఫా క్రాసింగ్‌ను రాకపోకలకు తెరచేది లేదని, మానవతా సహాయాన్ని గాజాలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ హెచ్చరించింది. దీంతో హమాస్ వెంటనే స్పందించి మంగళవారం రాత్రి పొద్దు పోయిన తర్వాత మరో నలుగురు బందీల మృతదేహాలను రెడ్‌క్రాస్‌కు స్వాధీనం చేసింది. కానీ ఇందులో ఒక మృతదేహం తమదికాదని ఇజ్రాయెల్ గుర్తించి వివాదాన్ని ప్రారంభించింది. ఐనప్పటికీ బుధవారం ఉదయం రఫా క్రాసింగ్‌ను ఐడిఎఫ్ తెరిచింది. దీంతో 600 లారీలు గాజాలోకి ప్రవేశించాయి. ఈ లారీలలో మానవతాసాయాన్ని తీసుకువచ్చారు. కానీ ఇక ప్రతిరోజూ కేవలం 300 లారీలను మాత్రమే గాజాలోకి అనుమతిస్తామని ఇజ్రాయెల్ షరతు విధించింది.

# పాక్–అఫ్గాన్ సరిహద్దుల్లో ఆగని ఘర్షణలు

### 40 మంది తాలిబన్లు మృతి
### 48 గంటలు కాల్పుల విరమణకు అంగీకారం



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్–అఫ్ఘానిస్తాన్ సరిహద్దుల్లో సైన్యం ఘర్షణలు ఆగడంలేదు. కొద్దిరోజుల ప్రశాంతత తర్వాత ఖుర్రం సెక్టర్‌లో మళ్ళీ మంగళవారం అర్ధరాత్రి దాటాక ఘర్షణ చెలరేగింది. వేరువేరుచోట్ల ఘర్షణల్లో 40 మంది తాలిబన్‌లను చంపినట్లు పాకిస్తాన్ ఆర్మీ బుధవారం ప్రకటించింది. ఐతే అనంతరం జరిగిన పరిణామాల్లో ఈ ఉద్రిక్తతలను చల్లార్చుకోవడంలో భాగంగా 48 గంటలు కాల్పులు విరమణ పాటించాలని రెండు దేశాలు అంగీకరించాయి. సమస్యను పరిష్కరించుకోవడానికి చర్చల మార్గం అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు బుధవారం సాయంత్రం పాకిస్తాన్ విదేశాంగమంత్రిత్వశాఖ ప్రకటించింది. పాకిస్తాన్ ఆక్రమిత బలూచిస్తాన్ రాష్ట్రం స్పిన్‌బోల్డక్‌లోని నాలుగు ప్రాంతాలలో అఫ్ఘానిస్థాన్ తాలిబన్లు చేసిన దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టి వారిని కాల్చి చంపినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. నిషేధిత తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) ఉగ్రవాదులను తాలిబన్ ప్రభుత్వ సైన్యం మద్దతుతో తమ భూభాగంలోకి దాడులు చేస్తున్నారని తెలిపింది. "దాడులను తిప్పికొట్టాం, దాదాపు 20 మంది తాలిబన్లు కాల్పుల్లో మరణించారు, అనేకమంది గాయపడ్డారు" అని పాక్ ఆర్మీ చెప్పింది. ఫిత్నా, అల్ ఖ్వారిజ్, అఫ్గాన్ తాలిబన్‌లు ఈ దాడులకు పొంచి ఉన్నారని తెలిపింది. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల నుండి దాడులు చేస్తున్న నిషేధిత తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) ఉగ్రవాదులను ఉద్దేశించి ఫిత్నా అల్–ఖ్వారిజ్ అనే పదాన్ని పాకిస్తాన్ సైనికులు ఉపయోగిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో రెండువైపులా గ్రామస్థులు విడిపోయి దాడులు చేస్తున్నారు. పౌరులు మరణిస్తుంటే తాలిబన్లు ఏ మాత్రం పశ్చాత్తాపం చెందడంలేదని పాకిస్తాన్ ఆర్మీ పేర్కొంది. "తమ సరిహద్దులపై ఉన్న పాక్–అఫ్ఘానిస్తాన్ ఫ్రెండ్‌షిప్ గేట్‌ను కూడా అఫ్ఘానిస్తాన్ తాలిబన్లు ధ్వంసం చేశారని తెలిపింది. ఖైబర్‌ఫఖ్తూన్ఖ్వా రాష్ట్రంలోని ఖుర్రం సెక్టర్‌లో ఉన్న పాకిస్తాన్ బోర్డర్ పోస్టులపై అఫ్గాన్ తాలిబన్–ఫిత్నా అల్–ఖ్వారిజ్ ఉగ్రవాదులు దాడులు చేసి యత్నించారని చెప్పింది. తమ ఎదురుదాడులతో అఫ్ఘానిస్తాన్‌కు చెందిన ఎనిమిది పోస్టులను, ఆరు ట్యాంకులను ధ్వంసం చేసినట్లు తెలిపింది. తాలిబన్లు వచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆర్మీ ప్రకటించింది. పాకిస్తాన్ దానికి తగిన ఎలాంటి ప్రత్యుత్తరం ఇవ్వాలనేది పూర్తిస్థాయి సైనికబలంతో తిప్పికొడతామని ఆర్మీ ప్రకటించింది. పాకిస్తాన్ విమానాలు అఫ్ఘానిస్థాన్ భూభాగంలోకి ప్రవేశిస్తున్నాయని, ఇతరదేశాల యుద్ధ వాహనాలను తమ గగనతలంలోకి అనుమతించేదిలేదని, వారి ఆటలు సాగనివ్వబోమని అఫ్ఘానిస్థాన్ ప్రకటించింది.

# కామెరూన్‌లో పాల్ బియా గెలిస్తే ప్రపంచ వృద్ధ దేశాధినేతగా రికార్డుల్లోకి..



**యావుండే:** సెంట్రల్ ఆఫ్రికాలో నైజీరియా పొరుగుదేశం కామెరూన్‌లో దేశాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలు ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. అనేక దశాబ్దాలుగా దేశాధ్యక్షుడుగా, తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న వృద్ధ నాయకులు పాల్ బియా (92) మరోసారి కూడా దేశాధ్యక్షుడిగా పోటీచేశారు. అధ్యక్ష పదవికి పోలింగ్ ప్రక్రియ గడచిన ఆదివారం (అక్టోబరు 12) పూర్తయింది. ఈ ఎన్నికల ఫలితాలు ఈనెల 25వ తేదీ నాటికిగానీ వెలువడే అవకాశం లేదు. ఈలోపే ఆ దేశంలో అంతర్గంగా ఉద్రిక్తతలు చెలరేగుతుండగా, ప్రపంచ దేశాలు కూడా తీవ్ర ఉత్కంఠతో ఈ ఎన్నికల ఫలితాలకోసం ఎదురుచూస్తున్నాయి. కామెరూన్ అధ్యక్షుడు పాల్ బియా ఇప్పటికే 43 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్నారు. ప్రతిసారీ ఎన్నికల్లో ఆయన తిరుగులేకుండా విజయం సాధిస్తూనే ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో 11 మంది పోటీపడ్డారు. కానీ పాల్ బియా పేరు తప్ప దేశంలో ప్రజలకు మరో పేరు ఏదీ తెలియదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈసారి కూడా ఆయనే విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని భారీ అంచనాలు వెలువడుతున్నాయి. ఇదే నిజమై మళ్ళీ ఆయన గెలిస్తే ప్రపంచంలో అత్యంత వృద్ధుడైన దేశాధినేతగా పాల్ బియా రికార్డు సృష్టిస్తారు. కామెరూన్ దేశానికి ఇప్పటివరకూ ఇద్దరే ఇద్దరు అధ్యక్షులుగా ఉన్నారు. దేశాధికారం తీసుకున్న పాల్ బియా రెండో అధ్యక్షుడు. 1982 నుండీ ఇప్పటివరకూ ప్రతిసారీ 70 శాతం ఓటింగ్‌తో పాల్ బియా గెలుస్తూ వస్తున్నారు. ఐతే బియా కూడా విశ్వాసంతో ఉన్నప్పటికీ, ''ఏదీ స్థిరంగా ఉండదు, ఎన్నికల ఫలితాలు వచ్చేవరకూ మనం ఎదురుచూద్దాం'' అని పాల్‌బియా పాత్రికేయులతో అన్నారు.

**నేనే గెలిచా... ప్రతిపక్షనేత ఏకపక్ష ప్రకటన**

కామెరూన్ అధ్యక్ష ఎన్నికల్లో ఈసారి 11 మంది పోటీపడుతుండగా వారిలో ప్రతిపక్ష నాయకుడు, పాల్‌బియా మంత్రివర్గంలో పనిచేసిన ఒకప్పటి నాయకుడు ఇస్సా చిరోమా బకారీ (79) అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఈ ఎన్నికల్లో తానే గెలిచానని ఇంకా ఫలితాలు రాకముందే ఆయన ఏకపక్షంగా ప్రకటించుకున్నారు. దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న పాల్ బియా తన ఓటమి అంగీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో ఎన్నికల సంఘం మండిపడింది. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకూ ఎదురుచూడాలని, ఎన్నికల ఫలితాలు ప్రకటించేది తామేనని పేర్కొంది. వాస్తవం ఏమిటంటే పాల్ బియా పాత స్నేహితులు అందరూ ఈసారి ఎన్నికల్లో చాలావరకూ ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

### హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ, ప్రచురణ, ప్రచారం పూర్తిగా నిషేధించామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ఈ నిషేధం నవంబర్ 6వ తేదీ ఉదయం 7 గంటల నుండి నవంబర్ 11 వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకు అమల్లో ఉంటుందన్నారు. భారత ఎన్నికల సంఘం 2025 అక్టోబర్ 13న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కాలంలో టెలివిజన్, రేడియో, వార్తా పత్రికలు, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వంటి ఏ మాధ్యమం ద్వారా అయినా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం, ప్రచురించడం, ప్రచారం చేయడం కఠినంగా నిషేధించబడిందని కర్ణన్ తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి ప్రజాప్రతినిధుల చట్టం, 1951లోని సెక్షన్ 126ఎ ప్రకారం రెండు సంవత్సరాల వరకు జైలుశిక్ష లేదా జరిమానా, లేదా రెండూ విధించవచ్చని ఆయన హెచ్చరించారు. పోలింగ్ ముగియకముందు 48 గంటల వ్యవధిలో ఎన్నికల సంబంధిత సర్వేలు, అభిప్రాయ సేకరణ ఫలితాలు ఎలక్ట్రానిక్ లేదా ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేయవద్దు అన్నారు. 126(1)(బి) సెక్షన్‌లోని నిబంధనలు స్పష్టంగా పేర్కొంటున్నాయని వివరించారు. మీడియా సంస్థలు, రాజకీయ పార్టీలు, సోషల్ మీడియా వినియోగదారులు ఈ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. స్వేచ్ఛా, నిష్పాక్షిక, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణలో సహకరించాలని కోరారు.

**రూ.10 లక్షలకుపైగా నగదు స్వాధీనం**



జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల పర్యవేక్షణ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు బుధవా రం వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.10లక్షలకుపైగా నగదును స్వాధీ నం చేసుకున్నాయి. అధికారుల వివరాల ప్రకారం, ఫ్లయింగ్ స్క్వాడ్ 3ఎ బృందం అమీర్‌పేట్ చౌరస్తాలో వాహనాన్ని ఆపి రూ.1.50 లక్షలు స్వాధీనం చేసింది. ఫ్లయింగ్ స్క్వాడ్ 10ఎ బృందం వెంకటగిరి కాలనీ రోడ్ నెంబర్ 2 వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.2.30 లక్షలు స్వాధీనం చేసింది. ఇక ఫ్లయింగ్ స్క్వాడ్ 6బి బృందం మధురానగర్‌లో రూ.6.50 లక్షలు స్వాధీనం చేసింది. స్వాధీనం చేసిన నగదును సంబంధిత పంజాగుట్ట, జూబ్లీహిల్స్, మధురానగర్ పోలీస్ స్టేషన్‌లకు అప్పగించారని ఎన్నికల అధికారులు తెలిపారు.

# లంకల దీపక్ రెడ్డి (మొదటి పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి దీపక్ రెడ్డి ఓటమిచెందారు. 25 వేల ఓట్లు సాధించి మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు. దీంతో అన్ని సమీకరణాలను పరిగణలోనికి తీసుకున్న పార్టీ అధిష్టానం దీపక్ రెడ్డి వైపే మొగ్గుచూపింది. దీపక్ రెడ్డి గతంలో తెలుగు యువత నగర అధ్యక్షునిగా, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. అలాగే పిపూల్స్ ఫర్ బెటర్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ అధ్యక్షునిగా కూడా ఆయన సేవలు అందించారు.

**మాగంటి సునీత నామినేషన్ దాఖలు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత మొదటి నామినేషన్ దాఖలు చేశారు. బిఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం స్వీకరించారు. ప్రధాన మూడు పార్టీల్లో బిఆర్ఎస్ మొదటి నామినేషన్ దాఖలు చేసింది. నామినేషన్ కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, టి.పద్మారావు గౌడ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు చేసే ముందు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయంలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత పూజలు చేశారు. మాగంటి గోపీనాథ్ అనవాయితీ ప్రకారం నామినేషన్ వేయడానికి ముందు పెద్దమ్మగుడిలో ప్రత్యేక పూజలు చేసేవారు. అదే ఆనవాయితీని భార్య సునీత కొనసాగించారు. మాగంటి సునీతతో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు.

# ఆప్షన్ ఇవ్వలేం (మొదటి పేజీ తరువాయి)

పిటిషనర్ సూచన సాధ్యమయ్యేది కాదని, దాన్ని ఇప్పటికే తమ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్నామని న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇది విధానపరమైన నిర్ణయమని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటుచేసే అంశాన్ని గతంలో పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది సమాధానంపై ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. కాలానుగుణంగా ఎన్నో అంశాల్లో మార్పులు వచ్చాయని, కానీ ప్రభుత్వం మాత్రం ఆ మార్పులను స్వీకరించేందుకు సిద్ధంగా లేదని, అదే ఇక్కడ సమస్యగా మారిందని వ్యాఖ్యానించింది. అయితే ప్రస్తుతానికి దీనిపై తాము ఎలాంటి విధానపరమైన ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబర్ 11కు వాయిదా వేసింది.

# భారత్ టూరిజం!

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రణాళిక అమలుకోసం సంస్కరణలు చేపట్టామన్నారు. శుక్రగ్రహ అధ్యయనానికి అనుమతి లభించిందని, అంగారకుడి (కుజుడు) మీదకు కొత్త చంద్రయాన్–4, చంద్రయాన్–5 యాత్రలుతోపాటు యాక్సియం, వంటి అత్యున్నతమైన ప్రాధాన్యతగల ఖగోళ పరిశీలనా అధ్యయన యాత్రల ప్రాజెక్టులు కూడా చేపడతామన్నారు. బుధవారం పిటిఐ వార్తాసంస్థ ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అంతరిక్షప్రాజెక్టులు, భారత్ లక్ష్యాలను ఆయన వివరించారు. భారత పౌరులు 2040 నాటికి చంద్రుడిమీద సంచరిస్తారనీ, వారిని మళ్ళీ సురక్షితంగా కిందకు తీసుకు రావడమే తమ లక్ష్యమని ప్రకటించారు. మొట్టమొదటి మానవ సహిత గగనయాన్ మిషన్ 2027లో చేపడతామని ఇస్రో 2035 నాటికి భారత జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తామని, ఈ దిశగా అంతరిక్ష రంగంలో సంస్కరణలు చేపట్టామన్నారు. ''దేశీయ చంద్రయాన్ 2040లో జరుగుతుంది, ఇందుకు వీలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారు, ఈ దేశీయ చంద్రయాన్ ప్రకారం 15 ఏళ్ళ తర్వాత మనదేశ పౌరులు చంద్రుడిమీద తిరుగుతారు, మళ్ళీ వారిని సురక్షితంగా భూమి మీదకు తీసుకువస్తాం, దీనికి ముందుగా మూడు మానవ రహిత గగనయాన్ ప్రయోగాలు, మానవ సహిత యాత్రలు జరుగుతాయి, శుక్రగ్రహం (వీనస్ ఆర్బిటార్ మిషన్) అధ్యయనానికి దానిచుట్టూ పరిభ్రమించి పరిశీలించడానికి కూడా ఆమోదం లభించింది'' అని నారాయణన్ చెప్పారు. భారతీయ అంతరిక్ష కేంద్రం (బిఎఎస్) 2035 నాటికి ఎజెండాలోకి వస్తుంది, దీనికి ముందుగా అవసరమైన మాడ్యూల్స్‌ను 2027 నాటికంటే ముందుగానే సిద్ధం చేస్తాం అని చెప్పారు. రాంచీ కేంద్రంగా పనిచేసే బిర్లా టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ (బిట్) మెస్రా 35వ స్నాతకోత్సవంలో నారాయణన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంగా ఇంటర్వ్యూలో ఈ విషయాలన్నీ చెప్పారు.''గగనయాన్‌లో అనేక పరిణామాలు సంభవిస్తున్నాయి, మనం ఇంకా మరికొన్ని ప్రయోగాలు చేసేందుకు కూడా ప్రణాళిక చేసుకుంటున్నాం, 'వ్యోమ్మిత్ర' ప్రయోగం ఈ ఏడాది డిసెంబరులోనే జరుగుతుంది, వచ్చే ఏడాది మరో రెండు మానవ రహిత గగనయాన్ ప్రయోగాలు చేస్తున్నాం, మానవ సహిత గగనయాన్ 2027 మొదటి అర్థభాగంలోనే చేపడతాం'' అని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాలా స్పష్టమైన బృహత్తర ప్రణాళికను ఇస్రోకు నిర్వచించారని, ఆ మేరకు తమ ప్రణాళికలతో ముందుకు వెళతామని చెప్పారు. ఇస్రో చాలా విశ్వాసంతో ముందుకు ప్రయాణం చేస్తోందని భారతదేశ ప్రజల కలలను, ఆశయాలను నెరవేర్చేదిశగా అడుగులు వేస్తామని చెప్పారు. ఇప్పటికే ఇస్రో ఆదిత్య ఎల్1 మిషన్‌ను చేపట్టి అనేక ఫలితాలు సాధించిందని చెప్పారు. 15 టెరాబైట్స్ పైగా సోలార్ డేటాను సంపాదించామని, అంతరిక్ష వాతావరణానికి సంబంధించి ఎంతో విలువైన సమాచారం లభించిందని చెప్పారు. అంతర్జాతీయంగా పలు దేశాలతో కలిసి ఉమ్మడి ప్రయోగాలకు కూడా ఇస్రో సిద్ధంగా ఉందన్నారు. భారతదేశం స్వయం సమృద్ధి సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. వాదతావరణశాస్త్రం, అంతరిక్ష పరిశక్షధన వంటి విషయాల్లో స్వయం సమృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈనాడు భారతదేశం అంతరిక్షరంగంతో ప్రపంచ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానంలో నిలబడి ఉందన్నారు. చంద్రుడిపై నీటి జాడలున్నాయని చంద్రయాన్–1 ద్వారా తెలుసుకోవడం దగ్గర నుండి చంద్రుడి దక్షిణధృవం వద్ద చంద్రయాన్–3 దిగడం దగ్గర నుండి అనేక రికార్డులు విజయాలు సాధించామన్నారు. మొత్తం తొమ్మిది రంగాల్లో ఇస్రో ప్రపంచవ్యాప్తంగా ప్రధమస్థానంలో ఉందన్నారు.

# 48 గంటల్లో చెల్లింపులు

(మొదటి పేజీ తరువాయి)

పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం ఆల్ టైమ్ రికార్డ్ సృష్టించిందని, యావత్ భారతదేశంలోని 29 రాష్ట్రాలలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇంతటి దిగుబడి రాలేదని ఆయన గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అత్యవసరమైతే అదనపు ఖర్చులకు వెనుకడుగు వేయకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 నుండి 72 గంటల వ్యవధిలో రైతులకు నగదు చెల్లింపులకు వీలుగా తూకం నుండి డేటా ఎంట్రీ వరకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. వాతావరణం మార్పులు,వర్ష సూచనలను పౌర సరఫరాల అధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, వర్షం వస్తే ధాన్యం చెడిపోకుండా ఉండేందుకు గాను టార్పలిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తనతో పాటు పౌర సరఫరాల శాఖ కమిషనర్ ను సంప్రదించాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సున్నితమైన అంశమని,కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎక్కడ కుడా అసౌకర్యం కలుగ కుండా చూడాలని ఆయన సూచించారు.

**రూ.23వేల కోట్లతో 80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య కొనుగోలు**

148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో వ్యవసాయ చరిత్రలోనే రికార్డ్ నమోదవ్వడంతో పాటు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం కుడా సరోకోత్త రికార్డ్ అవుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రూ.22 వేల నుండి రూ.23 వేల కోట్లను వెచ్చించి,80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో 40 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు,40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకాలు కొనుగోలు చేయనున్నట్టు ఆయన వివరించారు. మొత్తం 66.8 లక్షల ఎకరాలలో ఉత్పత్తయిన ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందులో 4,259 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా,3,517 ఐకెపి కేంద్రాల ద్వారా, ఇతర సంస్థల ద్వారా మరో 566 కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు పూర్తి స్థాయిలో రవాణ వసతిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గత అనుభవలను పరిగణనలోకి తీసుకుని వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.

**ఇబ్బందులొస్తే '1800–425–00333/1967' హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయండి**

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు తలెత్తితే 180042500333/1967 హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసే వరకు జిల్లా కేంద్రం నుండి కొనుగోలు కేంద్రాల వరకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గడిచిన రెండేళ్లుగా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటేనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేశామన్నారు. ప్రస్తుత వానాకాలంలో ముందెన్నడూ లేని రీతిలో ధాన్యం దిగుబడి వచ్చిన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయం చేసుకుని క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రత్యేక దృష్టితో సారించాలన్నారు.

# తక్షణం రద్దు (మొదటి పేజీ తరువాయి)

మారిన 12 నెలల తర్వాత గానీ తన పొదుపును తీసుకునే అవకాశం రావడం లేదు, మోదీజీ మీరు జోక్యం చేసుకోండి'' అని కాంగ్రెస్ ఎంపి మాణిక్కం టాగోర్ తన ఎక్స్ పోస్టింగ్‌లో కోరారు. ఇన్ని నెలలపాటు ఉద్యోగం పోయిన వారు తన పొదుపు డబ్బుకోసం ఎదురుచూడాలా? దీనివల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారు? పెన్షన్లను ఇప్పుడు రిటైరైన 36 నెలల తర్వాత మాత్రమే విత్‌డ్రా చేసుకోవాలి, కానీ ఇంతకుముందు రిటైరైనవారికి రెండు నెలలకే పెన్షన్ వచ్చేది, ఉద్యోగ భవిష్యనిధిని శాశ్వతంగా ఉద్యోగులకు కాకుండా తాళంవేసి స్తంభింపజేశారా? అని మోదీని మాణిక్కం టాగోర్ నిలదీశారు. ''ఈ విధానం వల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారు మోదీజీ? ఖచ్చితంగా కార్మికులకైతే ప్రయోజనం లభించడంలేదు, ఒక్కసారి ఊహించండి, ఒక కార్మికుడు ఉద్యోగం కోల్పోయిన తర్వాత 12 నెలలపాటు తన పొదుపు తీసుకోవడానికి ఎదురుచూడాలా? లేకపోతే ఒక రిటైరైన ఉద్యోగి ఎంతో కష్టపడి తను కూడబెట్టుకున్న సొమ్మును పెన్షన్‌ను తీసుకోవడానికి 36 నెలలు ఎదురుచూడాలా? ఒకవైపు కేంద్ర ప్రభుత్వం తన ధనవంతులైన మిత్రులకు, కోటీశ్వరులకు లక్షలకోట్లు పన్నుల రాయితీలు, మాఫీలు ప్రకటిస్తోంది, మరోవైపు కార్మికులు కష్టపడుతున్నారు, ఇవి సంస్కరణలు కాదు, దోపిడీ'' అని విమర్శించారు. టిఎంసి ఎంపి సాకేత్ గోఖలే కూడా కొత్త ఇపిఎఫ్ఓ నిబంధనలను తీవ్రంగా విమర్శించారు. నిబంధనల్లో మార్పులు దిగ్భ్రాంతికరంగా, హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ''ఈ నిబంధనల మార్పు వేతన జీవులను బాహాటంగా బెదిరింపులకు గురిచేయడమే, ఇపిఎఫ్‌లో ఉన్నది ప్రజల సొమ్ము, వారి కష్టార్జితం, వారి పొదుపు మొత్తం, ఇంతకుముందు నిబంధనల ప్రకారం ఎవరైనా ఉద్యోగం పోగొట్టుకుంటే రెండు నెలల్లో పిఎఫ్ సొమ్మును విత్‌డ్రా చేసుకోవచ్చు, కానీ ఇప్పుడు ఈ కనీస గడువు దిగ్భ్రాంతికరంగా ఏడాదికాలంగా నిర్దేశించారా? మౌలికంగా ఎవరి సొమ్ము వారిదే, వారు తీసుకోవాలంటే ఇంతకాలం ఆగాలా? దయచేసి అమానుషమైన ఈ నిబంధనలను తక్షణం రద్దుచేయండి'' అని సాకేత్ గోఖలే డిమాండ్ చేశారు.

# లొంగదీస్తాం (మొదటి పేజీ తరువాయి)

సామూహిక దాడులు చేసి హతమార్చడం వంటి చర్యలకు పాల్పడుతూ ఉండటంతో ట్రంప్ పైవిధంగా హెచ్చరిక చేశారు. గాజాలో యుద్ధ విరమణకు ట్రంప్ శాంతి ఒప్పందంలో కొన్ని మౌలిక అంశాలను మాత్రమే హమాస్ అంగీకరించింది. అనేక అంశాలపై తిరిగి చర్చ జరగాల్సి ఉందని హమాస్ మొదటి నుండీ వాదిస్తోంది. ఆయుధాలు వదిలిపెడతామని హమాస్ ఇప్పటి వరకూ తనంతట తానుగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. హమాస్ ఆయుధాలు వదిలేవరకూ, ఆ సంస్థను పూర్తిగా నిర్మూలించేవరకూ గాజాలో యుద్ధం విరమించేదిలేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా మొదటినుండీ మొన్న మొన్నటివరకూ వాదించారు. ఇప్పుడు కూడా ఆయుధాలు వదిలిపెట్టకపోతే మళ్ళీ దాడులు ప్రారంభిస్తామని కూడా గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ప్రపంచదేశాలన్నీ ఏకమై స్వతంత్ర పాలస్తీనా దేశం ఆవిర్భవించాలని పట్టుబడుతున్నాయి. ఇటీవల ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 80వ వార్షిక సమావేశాలలో కూడా అనేక దేశాలు పాలస్తీనా భుజం కాయడంతో ఇజ్రాయెల్ ఏకాకిగా మారింది.దీంతో ట్రంప్ వ్యూహం మార్చి 20 అంశాల శాంతి ఒప్పందం ముందుకు తెచ్చి అందరినీ పరుగులు పెట్టించి ఒప్పందం మొదటిదశ అమలయ్యేలా చూశారు. ఇప్పుడు ఇజ్రాయెల్‌ను అందరూ ప్రేమిస్తారని, ఇక ఇజ్రాయెల్‌ను ఎవరూ వ్యతిరేకించడంలేదని పదే పదే ప్రకటనలు చేస్తూ, హమాస్ ఆయుధాలు వదిలిపెట్టకపోతే తామే లొంగదీస్తామని తాజా హెచ్చరికలు చేశారు.

**రెండో దశ మొదలైంది, కానీ.. అనుకున్నది ఇంకా పూర్తికాలేదు**

ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఒప్పందం ప్రకారం రెండోదశ ప్రక్రియ ఇప్పుడే మొదలైందని డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈ దశలో హమాస్ యోధులు ప్రధానంగా నిరాయుధీకరణ పాటించాల్సి ఉంటుంది. 20 అంశాల శాంతి ఒప్పందంలో మొదటి దశ ప్రకారం 20 మంది సజీవులైన బందీలు సురక్షితంగా ఇజ్రాయెల్‌కు చేరుకున్నారని, అనుకున్నవిధంగా వారిని జాగ్రత్తగా అప్పగించారన్నారు. కానీ ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఇంకా నిర్జీవులైన 21 మంది బందీల మృతదేహాలను హమాస్ స్వాధీనం చేయలేదని అన్నారు. ''పని పూర్తికాలేదు, ఇంకా మిగిలే ఉంది, నిర్జీవులైన బందీలను స్వాధీనం చేయలేదు'' అని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టింగ్ పెట్టారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైలు బోగీలో మహిళపై అత్యాచారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు ప్రయాణంలో ఒంటరిగా ఉన్న మహిళపై ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బోగీలో బాధితురాలు తప్ప ఎవరూ లేకపోవడాన్ని అవకాశంగా తీసుకున్న దుండగుడు.. కత్తితో బెదిరించి అత్యాచారం చేయడంతో పాటు బాధితురాలి డబ్బు, నగలు ఎత్తుకెళ్లాడు. ఏపీలోని రాజమహేంద్రవరం సంత్రగచి స్పెషల్ ట్రైన్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చర్లపల్లి వెళ్లేందుకు బాధిత మహిళ రాజమహేంద్రవరంలో సంత్రగచి స్పెషల్ ఎక్కింది.రైలు గుంటూరు దాటిన తర్వాత ఆ బోగీలో తను తప్ప ఎవరూ లేరని, ఇంతలోనే 40 సంవత్సరాల వయస్సున్న దుండగుడు బోగీలోకి వచ్చాడని తెలిపింది. తాను ఒంటరిగా ఉండడాన్ని అవకాశంగా తీసుకున్న నిందితుడు.. కత్తితో బెదిరించి తనపై అఘాయిత్యం చేశాడని తెలిపింది. రైలు గుంటూరు, పెద్దకూరపాడు మధ్య ప్రయాణిస్తుండగా ఈ దారుణానికి పాల్పడ్డాడని చెప్పింది. అనంతరం, తన హ్యాండ బ్యాగ్, సెల్ ఫోన్ లాక్కుని పెద్దకూరపాడు స్టేషన్ లో రైలు ఆగగానే దిగిపోయాడని తెలిపింది. చర్లపల్లికి చేరుకున్నాక బాధితురాలు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి.. దర్యాప్తు ప్రారంభించారు.

# బిసి జెఎసి బంద్‌కు బిజెపి, బిఆర్‌ఎస్ మద్దతు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి జెఎస్ బంద్‌కు మద్దతు ఇవ్వాలని జెఎసి చైర్మన్ ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో జెఎసి ప్రతినిధులు బిజెపి రాష్ట్ర నాయకత్వాన్ని మద్దతు కోరారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిసి జెఎసి ప్రతినిధులు బుధవారం బిజెపి పార్టీ నేతలతో సమావేశమయ్యారు. బిసిలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో బిసి జెఎసి ఈనెల 18వ తేదీన బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. బిసిలు న్యాయం కోరి చేపట్టిన ఈ ఉద్యమానికి బిజెపి సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. బిసిల హక్కుల కోసం ఆర్. కృష్ణయ్య సంవత్సరాలుగా పోరాడుతున్నారన్నారు. బిసి సమాజ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని పార్టీ సీరియస్‌గా తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీలను నిర్లక్ష్యంగా చేయడం వల్ల బిసి సమాజం అసంతృప్తికి ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. బిజెపి కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బిసి మంత్రులు ఉన్నట్లు, ఇది బిసిలకు పార్టీ ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. 1931 తర్వాత తొలిసారిగా చేపట్టిన కులగణనను వెంటనే ప్రారంభించడం ద్వారా బిసిల జనాభా ఆధారంగా విధానాలు రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. ఈ నిర్ణయం బిసి సమాజం చరిత్రాత్మక విజయమన్నారు. బిసి జెఎసి పిలుపుపై పార్టీని చెందిన రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు బంద్‌లో సంపూర్ణంగా పాల్గొనాలని, అవసరమైన మద్దతును అందించాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**బిసి రిజర్వేషన్‌ల నెపాన్ని ఇతరులపై తోసేస్తున్న కాంగ్రెస్ : కెటిఆర్**

పార్లమెంట్‌లో చేయాల్సిన పనిని శాసన సభలో చేసి, నెపాన్ని ఇతరుల మీద తోసేసే కాంగ్రెస్ ప్రయత్నం మంచిది కాదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. ఎన్‌డిఎ, ఇండియా కూటమి పక్షాలు అనుకుంటే చాయ్ తాగినంత సమయంలో బిసి రిజర్వేషన్‌లు వస్తాయని రెండు కూటములు అనుకుంటే బిల్లు కాస్తా చట్టంగా మారుతుందన్నారు. బిసి జెఎస్ బంద్‌కు మద్దతు ఇవ్వాలని జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో జెఎసి ప్రతినిధులు తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌తో భేటీ అయ్యారు. ఈ నెల 18న బిసి సంఘాలు తలపెట్టిన బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా పూర్తిగా సంపూర్ణంగా మద్దతు ఇస్తామని కెటిఆర్ తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ బిజెపి నేతలు బిసి రిజర్వేషన్ కోసం ప్రధానమంత్రి దగ్గరికి తీసుకెళ్తే వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమం లాగే బిసి పోరాటాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లి సాధించుకుందామని కెటిఆర్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామంటే తాము అసెంబ్లీలో మద్దతిచ్చామన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా, పార్టీ తరఫున రిజర్వేషన్‌లు ఇస్తామని, ఆర్డినెన్స్ ద్వారా, బిల్లు ద్వారా, మరోసారి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత అని చెబుతోందన్నారు. బిసి రిజర్వేషన్‌లపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి బలహీన వర్గాలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదాకా నిలదీస్తూనే ఉంటామన్నారు.

# రిజర్వేషన్ల రద్దు చేసే కుట్రలు



బిసి బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బ్రాహ్మణ, బనియా పార్టీగా పేరొందిన దురహంకార అగ్రకుల పక్షపాతి బిజెపి ఓబిసి రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలు చేస్తుందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఓబిసి రిజర్వేషన్లపై మండల్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలనే నిర్ణయాన్ని బిజెపి గట్టిగా వ్యతిరేకించిందని ఆయన గుర్తు చేసారు. ఓబిసి గుర్తింపును తిరస్కరించడం, కుల ఆధారిత రిజర్వేషన్లను వ్యతిరేకించడంలో సంఘ్ పరివార్ ఆదేశాలను బిజెపి పాటిస్తోందని, అందుకే తెలంగాణాలో బిసి రిజర్వేషన్లపై బిజెపి ద్వంద వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి సమావేశం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో బుధవారంజరిగింది. సమావేశానికి సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఈ.టి.నరసింహ ప్రసంగిస్తూ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల చరిత్ర ఎల్లప్పుడూ దళితులు, అణగారిన, వెనుకబడిన ప్రజలకు వ్యతిరేకంగా ఉందని, తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తుందని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్సును గవర్నర్ ఆమోదించకపోవడం బిజెపి కుట్రలో భాగమేనని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీఓతోపాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడం విచారకరమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి, రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చి బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని అయన డిమాండ్ చేశారు. బిసిలకు న్యాయం పేరుతో ఈ నెల 18న బిసి జెఎసి నిర్వహించే రాష్ట్ర బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలిపుతుందని, సిపిఐ శ్రేణులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఈ.టి.నరసింహ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, కౌన్సిల్ సభ్యులు ఎం.నరసింహ, జి.చంద్ర మోహన్ గౌడ్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఈటి.నర్సింహకు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యవర్గం తరపున హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జ శ్రీనివాసులు, టి.సత్యప్రసాద్, శ్రీమాన్, యుగంధర్, చేపూరి కొండల్ తదితరులు పాల్గొన్నారు.



# దివిస్ కోసం పేద రైతుల పొట్టగొడతారా?

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ధ్వజం

భూమికి భూమి ఇవ్వాల్సిందే

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలి

అమరావతి కంటే మిన్నగా చౌటుప్పల్ రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని దివిస్ లాబొరేటరీస్ పరిశ్రమను కాపాడేందుకు పేద రైతుల పొట్టగొడతారా అని సిపిఐ జాతీయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ ప్రకారం భూములు కోల్పోతున్న రైతుల భూములను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిబుల్ ఆర్‌ను ఆశాస్త్రీయంగా రీజనల్ రింగు రోడ్డు నుంచి 40 నుంచి 60 కిలోమీటర్లు తీసుకొని చౌటుప్పల్ కు ఉత్తర దక్షిణ ప్రాంతంలో 28 కిలోమీటర్లు ఎందుకు కుదించారని ఆయన నిలదీశారు. త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను పాము వంకర లాగా తిప్పుతూ ఒకచోట 50 కిలోమీటర్లు మరోచోట 60 కిలోమీటర్లు చౌటుప్పల్ దగ్గరికి వచ్చేసరికి 28 కిలోమీటర్లు ఎన్ని రకాలుగా మార్చడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటో బయట అమరావతి కంటే చౌటుప్పల్‌లో భూముల విలువ తక్కువేమీ కాదని... జాతీయ రహదారి అనుకుని ఉన్న భూములు కోల్పోయే భూమికి భూమి లేదా బహిరంగ మార్కెట్ ధర ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఫార్మా కంపెనీల కొమ్ము కోస్తూ పేద రైతుల జీవితాలతో చెలగాటం ఆడాలని చూస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరించారు. రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలని లేని ఎడల బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం 3 రెట్లు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై శాసనమండలి సమావేశంలో చర్చిస్తామని, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, భూ నిర్వాసితులు చింతల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, కురిమిద్దె శ్రీనివాస్, బోడ సుదర్శన్, కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, పెరబోయిన మహేందర్, పగిళ్ల మోహన్ రెడ్డి, పిల్లి శంకర్, కొండూరి వెంకటేష్, ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, భూ నిర్వాసితులు సందగల మల్లేశం, జాల శ్రీశైలం, బోరం ప్రకాష్‌రెడ్డి, గుండెబొయిన వేణు, మార్గం నరసింహ, సుర్కంటి శశికళ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో దేవి రెడ్డి బంగ్లా, లింగ వారిగూడెం, పుట్టపాక ఎస్ వి ఎల్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాలలో త్రిబుల్ ఆర్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులను కలిసి భూములను సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి నేతృత్వంలో సిపిఐ బృందం పరిశీలించింది. త్రిబుల్ ఆర్ అలైన్మెంట్‌లో భూములు కోల్పోతున్న రైతులు, ఆయా గ్రామాల ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**కొడంగల్ తరహాలో న్యాయం చేయాలి...**

కొడంగల్‌లో ఏ విధంగానైతే 50 కిలోమీటర్ల పరిధి అలైన్మెంట్ కు తీసుకున్నారో ఉత్తరభాగం దక్షిణభాగం సమాంతరంగా తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేట్ సంస్థలకు పరిశ్రమలకు ఒక న్యాయం రైతులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు పల్లా వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. భూనిర్వాసిత కమిటీ నాయకులు పల్లె పుష్ప రెడ్డి, నడికుడి అంజయ్య, గాజుల అంజయ్య, వర్ధన్ నాగార్జున, భూ నిర్వాసిత రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో ఉన్నారు. అనంతరం సిపిఐ నేతలు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాతృమూర్తి శంకరమ్మ దశదినకర్మలో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# 18న రాష్ట్ర బంద్‌కు 135 బిసి కుల సంఘాల మద్దతు




బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకూ ఉద్యమం ఆగదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బిసిలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ బుధవారం హైదరాబాద్‌లో 135 బిసి కుల సంఘాలతో పాటు మరో 35 బిసి సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అధ్యక్షత హైదరాబాద్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ నారగోని, కో చైర్మన్ దాసు సురేష్, కోఆర్డినేటర్ గుజకృష్ణ ప్రసంగించారు. స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వం కల్పిస్తూ జారీ చేసిన జిఓపై హైకోర్టు స్టే ఇవ్వడం అన్యాయం అని పేర్కొన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్టే ఇవ్వడం సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేమన్నారు. భారతదేశ చరిత్రలో ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్టే ఇవ్వడం జరగలేదని గుర్తు చేశారు. మొదటిసారి న్యాయ చరిత్రలో ఇలా బిసిలపై అన్యాయంగా స్టే ఇచ్చారని, నోటిఫికేషన్‌తో వేలాదిమంది నామినేషన్లు దాఖలు చేశారని అని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో కోర్టు ఎలా స్టే ఇస్తారని అన్నారు. కేసు నాలుగు రోజులుగా కోర్టులో నడుస్తుంది ఇస్తే మొదటిరోజే స్టే ఇవ్వాలి కానీ రెండుసార్లు స్టే ఇవ్వబోమని కోర్టు ఇవ్వడానికి నిరాకరించిందన్నారు. రిజర్వేషన్ల కేసులో 30 బిసి సంఘాలు ఇంప్లీడ్ కేసులు వేయగా పిటిషనర్ల వాదన కూడా వినకుండా స్టే ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 243డి6 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి బిసి రిజర్వేషన్లను నిర్ణయించే అధికారం ఉందన్నారు. దీని ప్రకారం జీవో జారీ చేశారని తెలిపారు. చట్ట ప్రకారమే జీవో విడుదల చేశారని గుర్తు చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడి శాసనసభలో బిసి బిల్లు పాసయిందని, న్యాయపరంగా కూడా జీవోకు బలం ఉందని అన్నారు. మండల్ కమిషన్ కేసు సందర్భంగా 9 మంది జడ్జీల ధర్మాసనం తీర్పు ప్రకా రం జనాభా లెక్కలు ఉంటే దానిని అనుగుణంగా రిజర్వేషన్లు పెంచవచ్చు అని తీర్పు చెప్పిందని తెలిపారు. ప్రత్యేకంగా డెడికేటెడ్ బీసీ కమిషన్ వేసే జనాభా లెక్కలు తీసి రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు కృష్ణమూర్తి కేసులో తీర్పు చెప్పిందని, ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల సందర్భంగా 50శాతం సీలింగ్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేసిందన్నారు. సమయం సందర్భాన్ని బట్టి 50 శాతం సడలించాలని ఆదేశాలు ఉన్నాయని, అగ్రకులాలకు రిజర్వేషన్లపై ఈ కేసు సందర్భంగా 50 శాతం సీలింగ్ ఎత్తివేసారన్నారు. బిసి కేసు సందర్భంగా ఎత్తివేయడానికి అభ్యంతరం ఏమిటి? ఈ సంఘాల బంద్‌ను జయప్రదం చేయాలని వారందరు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.

## మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తి విజయలక్ష్మికి ఘననివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తి దివంగత పురిటిపాటి విజయలక్ష్మికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. విజయలక్ష్మి కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఎంఈఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.కృష్ణారెడ్డి మాతృమూర్తి పి.విజయలక్ష్మి ఈ నెల 5వ తేదీన తుదిశ్వాస విడిచారు. విజయలక్ష్మి సంస్మరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగింది. తొలుత భర్త పి.వీరారెడ్డి, కుమారులు ఎంఈఐఎల్ ఎండి పి.వి.కృష్ణా రెడ్డి, ఎంఈఐఎల్ సిఈఓ పి.వి.సుబ్బారెడ్డి, కుమార్తె ప్రసన్న, సోదరుడు, ఎంఈఐఎల్ చైర్మన్ పిపి రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్య లు హైటెక్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విజయలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బండి సంజయ్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ, ఎపి అసెంబ్లీ ఉప సభాపతి ఆర్.రఘురామ కృష్ణంరాజు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపిలు సిఎం రమేష్, కె.రఘువీర్ రెడ్డి, డి.కె.అరుణ, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, ఎంఎల్‌ఎలు టి.హరీష్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, సినీ నటులు కొణిదెల చిరంజీవి, దగ్గుబాటి వెంకటేష్, మాజీ ఎంపిలు కెవిపి.రామచంద్ర రావు, ఎపి జితేందర్ రెడ్డి, మధుయాష్కి గౌడ్, తెలంగాణ హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సి.వి.ఆనంద్, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్, టిడిపి నేత జె.సి.పవన్ రెడ్డి తదితర ప్రముఖులు విజయలక్ష్మికి నివాళులు అర్పించారు.



## ఎమ్మెల్యే తల్లికి సిఎం నివాళి



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హన్మకొండ :** నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. హన్మకొండలోని పిజిఆర్ గార్డెన్‌లో బుధవారం ఎమ్మెల్యే తల్లి దశదిన కర్మ వేడుకలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, యశశ్వినిరెడ్డి, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, రఘువీరారెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

**సిఎం రాకతో పోలీసులు భారీ బందోబస్తు....**

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ దశదిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతుండడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటుచేస్తున్నారు. హన్మకొండ కలెక్టరేట్‌లో హెలిప్యాడ్ వద్దకు సీఎం రాగానే కలెక్టర్ స్నేహ సబర్వాల్, సిపి సన్‌ప్రీత్ సింగ్‌లు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. హన్మకొండ సుబేదారి కలెక్టరేట్ నుండి ఒడ్డెపల్లి పిజెఆర్ కల్యాణ మండపం వరకు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత



త్వరలో అక్రిడిటేషన్ పాలసీ : మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. పాత్రికేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందే విధంగా విధివిధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్.ప్రియాంక, సిపిఆర్‌ఓ గుర్రం మల్సూర్‌తో కలిసి 'అక్రిడిటేషన్ విధానం'పై మంత్రి శ్రీనివాస్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడే విధంగా శాస్త్రీయ పద్ధతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కి తీసుకురావాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.


ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ నెం.19, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి, యూసఫ్‌గూడ, హైదరాబాద్.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నెం. 26/EE/DIV-19/SLPZ/GHMC/2025-26 తేదీ: 14.10.2025

NIT No. 26/EE/DIV-19/SLPZ/GHMC/2025-26, పనుల సంఖ్య: (2) నెంబర్ల ఎలక్షన్ పనులు, అంచనా విలువ: రూ. 13.10 లక్షలు, ప్రారంభ తేదీ / డౌన్‌లోడ్ ముగింపు తేదీ & సమయం: 15.10.2025న మ.02.00 గం.ల నుండి 18.10.2025న మ.12.00గం.ల వరకు మాత్రమే. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, జిహెచ్ఎంసి. శ్రీ బి.భద్రు 99899-30549. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.19, (ఎస్ఎల్‌పిజెడ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 9230-PP/CL/ADVT/1/2025-26, Date: 15-10-2025



ST.JOHN'S P.G. COLLEGE

Chengicherla (V), Medipally(M), Medchal - Malkajgiri (Dist)

(Approved by AICTE, Affiliated to O.U) Ph : 9949490652, 9849139745

SPOT ADMISSIONS

- No of Vacancies / Unreported Candidates :

MBA : 13 & MCA : 01

- Eligible Candidates attend with originals on or before : 18-10-2025
- Candidates to Pay Tution Fee, Special Fee, Processing Fee
- Admissions are Subject to Ratification by TGICET / TGCHE
- Fee Reimbursements is not applicable

www.stjohnspgcollege.in Contact : 9849139745, 9603216358



పురపాలక సంఘ కార్యాలయము - ఎల్లారెడ్డి, జిల్లా: కామారెడ్డి

నెం.యం.సి E1/91/2025-26 తేదీ: 14.10.2025

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఈ క్రింద తెలిపిన అభివృద్ధి పనుల కొరకు సీల్డ్ కొటేషన్ స్వీకరించుట.

| క్ర.సం. | పని వివరములు |
|---|---|
| 1 | Supply & fixing of Machinery/Equipments for processing solid waste |
| a | Electronic Weigh Bridge Size 4.8x2.8 m/10 Ton capacity/2 kg least Count |
| b | Garden Shredder/shredder |
| c | Dry waste sorting table |
| d | Baling Machine size-540x680x2600 mm with 25 Ton(Jack f |
| e | Air blower of 1500 cfm |
| f | Trommel (16 to 40 mm, 4 to 6 mm) |
| g | Sorting Conveyer belt |

పై చూపబడిన వస్తువుల యొక్క సీల్డ్ కొటేషన్స్ తేదీ:18.10.2025 సాయంత్రం 4-00 గంటల వరకు పురపాలక సంఘ కార్యాలయము ఎల్లారెడ్డి యందు సమర్పించగలరు మిగితా వివరాలకు కార్యాలయ పని వేళల యందు ఫోన్ నెం. 7995660845 నకు సంప్రదించగలరు.

దీని ప్రతి:- నోటీస్ బోర్డ్ పై సమాచార నిమిత్తం ఉంచనైనది.

సం/- కమిషనర్ పురపాలక సంఘం ఎల్లారెడ్డి

DIPR R.O. No. : 9217-PP/CL/ADVT/1/2025-26, Date: 15-10-2025

## అబ్దుల్ కలాంకు నివాళులు



**ప్రజాపక్షం/చిట్యాలః** మాజీ రాష్ట్రపతి, భారత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతిని నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యార్థులు బుధవారం ఘణంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవహర్త పెద్ది నరేందర్ మాట్లాడుతూ ఇండియన్ మిస్సైల్‌గా పిలువబడే కలాం భారతదేశ కీర్తిని పెంపొందించారని కొనియాడారు. భారతదేశం గర్వపడేలా అంతరిక్ష రంగాన్ని అభివృద్ధి చేశారని విద్యార్థులకు తెలియజేశారు. ఆయన చరిత్రను తెలుసుకుని, ఆయన అడుగుజాడల్లో విద్యార్థులు పయనించాలని నరేందర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నమ్ముల ఆనందకుమార్, షమీమున్నీసాబేగం, గణేష్, ఎస్ జ్యోతి, పి రమాదేవి, జుబేదా, ధనలక్ష్మి, సంతోష, మౌనిక, మాధవి, స్వాతి, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/నందికొండ:** నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించినబాలుర కోకో అండర్ 14,అండర్ 17 విభాగంలో స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల నుండి 15 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరచి అండర్ 17,14 విభాగంలో కోకో క్రీడలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే కోకో పోటీలకు అండర్ 14,17 విభాగం నుంచి 12మంది విద్యార్థులు ఎంపిక కాగా వాలీబాల్ అండర్14 విభాగం నుంచి ఒక విద్యార్థి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు.




## రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** రైతులు పండించిన దొడ్డు వడ్లను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుందని దేశం లోనే తెలంగాణ ప్రభుత్వం మాత్రమే ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి ల కృషి వల్ల సాధ్యమైంది అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు.బుధవారం శాలిగౌరారం చిత్తలూరు, తుదిమిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.రైతులు తాము పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లోనే విక్ర మద్దతు ధర పొందాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా నిశ్చింతగా ఉండాలన్నారు. రైతులకు లారీల ట్రాన్స్ పోర్ట్ విషయం ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ బి వరప్రసాద్,ఎంపిడిఓ జ్యోతిలక్ష్మి,ఏపీఎం శంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్లు పాదూరి శంకర్ రెడ్డి,నరిగె నరసింహ, సింగిల్ విండో చెర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలి

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ కార్యక్రమంలో ఏఐసిసి సెక్రటరీ, పరిశీలకులు బిశ్వాత్ రాజ్ మహతి, ఎంఎల్‌సి కేతావత్ శంకర్‌నాయక్‌లతో కలిసి పాల్గొన్న దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ ఈ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుల ఎన్నికపై పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలోపేతమవుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో అసెంబ్లీ అభ్యర్థులకు టికెట్లకు సిఫారస్ చేసే అధికారం డిసిసిలకే ఉంటుందని వెల్లడించారు. ఈ ప్రక్రియలో మండల, గ్రామ పార్టీ నాయకులకు కీలక అధికారాలు అప్పగిస్తారని వివరించారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైందని, పార్టీని గ్రామస్థాయి వరకు విస్తరించి ప్రతి కార్యకర్త చురుగ్గా పాల్గొనేలా అభియాన్ కార్యచరణతో ముందుకెళ్లుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నీట మునిగిన బత్తాయి తోటలు

**ప్రజాపక్షం/హాలియా:** అనుముల మండలం ఈశ్వర్ నగర్ సమీపంలోని వరద కాలువ కింద ఉన్నడి8 మైనర్ కాలువకు భారీ వర్షాల కారణంగా గండి పడింది. దీంతో కాల్వ సమీపంలోని మల్ రెడ్డి జనార్దన్ రెడ్డి తోపాటు పలువురు రైతులకు చెందిన బత్తాయి తోటలు నీటి మునిగాయి. రోజుల తరబడి బత్తాయి తోటలో వరద కాలువ నీళ్లు వెళ్తుండడంతో బత్తాయి చెట్లు నీటి ఊట పట్టి తోటలు ధ్వంసం అవుతున్నాయి. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుముల శివారులో ఉన్న మల్ రెడ్డి జనార్దన్ రెడ్డిఅనే రైతు తోట వరకే మైనర్ కాలవను తీయడంతో అక్కడి నుంచి నీళ్లు కాల్వ బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో వరద కాలువ నీరు అంత బత్తాయి తోట మీదుగా భారీ వరద వెళ్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈశ్వర్ నగర్ సమీపంలో వరద కాలువకు పడిన గండిని పూడ్చి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులను కోరుతున్నారు.



# బిసి రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో చట్టం చేయాలి

### సిపిఐ, బిసి హక్కుల సాధన సమితి అధ్వర్యంలో పలుచోట్ల నిరసన ర్యాలీలు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు స్థానిక సంస్థల్లో 42 రిజర్వేషన్లు అమలు కొరకు పార్లమెంటులో చట్టం చేయాలని బిసిహక్కుల సాధన సమితి నల్లగొండ జిల్లా కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. సాధన సమితి రాష్ట్ర సమితి పిలుపుమేరకు స్థానిక సుభాష్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టరు. గీత పని వారల సంఘం జిల్లా అధ్యక్షులు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 18 నాడు రాష్ట్ర బంద్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ ,ఎండి యూసఫ్, సంగిశెట్టి శ్రీనివాస్, ఎం. నందం, సుజాత ,విజయ,మాధవి ,నారాయణ, తెళ్లమల దశరథ, రామకోటి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

### బిసిలపై కేంద్రం కక్షపూరిత వైఖరి

**ప్రజాపక్షం/కోదాడ:** కేంద్రంలో అధికారంలో ఉన్న బి.జే.పి ప్రభుత్వానిది బిసిలపై కక్షపూరిత వైఖరి అవలంభిస్తు స్థానిక సంస్థల బిసిల 42 శాతం బిల్లును ఆమోదించలేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస రావు అన్నారు. బుధవారం కేంద్రం బి.సి బిల్లును ఆమోదించక పోవడం, హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలపై స్టే విధించడాన్ని నిరసిస్తు సిపిఐ, బీసీ హక్కుల సాధన సమితి అధ్వర్యంలో కోదాడ పట్టణ ప్రదాన రహదారి ఆర్‌టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ స్తారోకోలో మండల పార్టీ కార్యదర్శి బత్తినేని హనుమంత రావు, ఎస్‌కె లతీఫ్, మాతంగి ప్రసాద్, ఉప్పతల శ్రీనివాస్, కోటేశ్వరావు, గోపినాయక్, రెహమాన్, సట్టు పార్వతిలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు :** రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించే జీవో నెంబర్ 9 ను 99 షెడ్యూల్లో చేర్చి ఆమోదించే వరకు సిపిఐ, బీసీ హక్కుల సాధన సమితి పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజా రామచంద్రం అన్నారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మునుగోడు మండల కేంద్రంలో సిపిఐ, బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రెండు గంటల పాటు రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న తలపెట్టిన బీసీ బందు కార్యక్రమంలో సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గూరి నరసింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు ఈదులకంటి కైలాష్,మండల కార్యవర్గ సభ్యులు మందుల పాండు,బండమీది యాదయ్య,మాధగోని సత్తమ్మ,ఉప్పునూతల రమేష్, దుబ్బ వెంకన్న,రేవెల్లి అంజయ్య,తీర్పారి కృష్ణయ్య, కట్కూరి లింగస్వామి, కట్ట దశరథ,తిరందాా శ్రీనివాసులు, ఎండి జానీ, యాదయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్ అన్నారు. హైకోర్టు ఇచ్చిన నిలుపుదలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం భువనగిరి తాసిల్దార్ కార్యాలయం ముందు బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి డిప్యూటీ తాసిల్దార్ కళ్యాణ్‌కు వినతి పత్రం అందజేశారు. రెడ్డి జాగృతి సంస్థ బుట్టెం మాధవరెడ్డి హైకోర్టులో వేసిన ప్రతులను తాసిల్దార్ కార్యాలయం ముందు తగుల పెట్టడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కస్తూరి బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు, బీసీ సంఘం నాయకులు రాసాల బాలస్వామి పాల్గొన్నారు.







## భూభారతి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సంబంధిత సమస్యలపై అందిన దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన జీపీఓలు ఎప్పుడు గ్రామాల పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ పాలన అధికారులు భూ సమస్యలపై క్షేత్రస్థాయిలోపరిశీలించాలన్నారు. భూసమస్యల సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు, మొఖా, సర్వే నెంబర్లు ఇతర పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. మిస్సింగ్ సర్వే నెంబర్, ప్రాంతాల మార్పు, ప్రభుత్వ భూములు, సాదాబైనమా, అటవీ భూములు, హద్దుల నిర్ధారణ, ఇతర భూములకు సంబంధించి భూ భారతి కార్యక్రమంలో పొందిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, అందులో ఎన్ని నిర్మాణాలలో ఉన్నాయో, ఎన్ని స్లాబ్ లెవల్ లో ఉన్నాయ, ఎన్ని బేస్మెంట్ లెవల్ ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు. బేస్మెంట్ లెవల్, లెంటల్ లెవల్ వరకు పూర్తి అయిన వారికి లబ్ధిదారుల అకౌంట్‌లలో డబ్బులు జమ అయ్యాయా అని తెలుసుకున్నారు. పూర్తి స్థాయి నిర్మాణ పనులు అయిన ఇండ్లు ఎన్ని అని అడిగి తెలుసుకున్నారు. స్లాబ్ దశ, వరకు పూర్తి అయినా ఇండ్లని పరిశీలించారు.లబ్ధిదారులు అందరూ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజా త్రివిక్రమ్, ఆర్ఐ వెంకట్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆరోగ్యవంతమైన మహిళ కోసం కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. పోషణ మాసంలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించడమే పోషణ మాసం లక్ష్యమని, అందుకు క్రిందిస్థాయిలో కృషి చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు అభినందనలు తెలిపారు. గర్భిణీల పోషణలో ప్రతి గడపలోని అత్త, మామ, అమ్మ, నాన్న, భర్త, పిల్లల పాత్ర ఉంటుందని ప్రతి సమావేశంలో వీరందరిని భాగస్వాములను చేయాలన్నారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బాల్య ఆరంభ దశ సంరక్షణ అలాగే విద్యపై దృష్టి సారించాలని, ప్రతి పిల్లవాడు వెళ్లె మొట్టమొదటి బడి అంగన్‌వాడీ కేంద్రమేనని స్పష్టం చేశారు. పిల్లవాని అభివృద్ధికి పునాదులు వేసే అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. తల్లులు, పిల్లల ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని అన్నారు. పోషకాహార లోపం లేని సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమ అధికారి కె నరసింహారావు మాట్లాడుతూ మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యమని, పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుబ్బలక్ష్మి, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ జిల్లా బ్లాక్ కోఆర్డినేటర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## బైక్ చోరీల నిందితులు అరెస్ట్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పట్టణంలో పలు చోట్ల బైక్ దొంగతనాలను పాల్పడుతున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ ఎం.రమేష్ తెలిపారు. బుధవారం భువనగిరిలోని పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిందితుల వివరాలను వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 141 భువనగిరి పట్టణ పరిధిలోని పెద్ద చెరువు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టిన క్రమంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. వారిని అదుపు లోకి తీసుకొని విచారింపగా అనుమానస్పదంగా, విచారణలో పొంతనలేని సమాదానాలు చెప్పడంతో వారిని పూర్తి స్థాయిలో విచారించినట్లు చెప్పారు. విచారణలో బాగాంగా హైదరాబాద్లోని యాకుత్పురకు చెందిన సయ్యద్ తాలేర్‌అలీ అలియాస్ సమీర్, సైదాబాద్కు చెందిన అలుబా, యాకుతుప్పురకు చెందిన రేహాన్, పహాడిషారీఫ్కు చెందిన ఎండి.సాజిద్‌లు కలిసి పలు చోట్ల పార్కు చేసి ఉన్న బైక్లను దొంగలించినట్లు చెప్పారు. దొంగలించబడిన బైక్లను వికారాబాద్ జిల్లా పూడూర్కు చెందిన మహ్మద్ సోహేలీబ్కు ఇవ్వడంతో అతను వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులను ఐదుగురు సమానంగా పంచుకుని జల్సాలు చేసేవారని చెప్పారు. గతంలో సమీర్, అలుబా, రేహాన్, ఎండి. సాజిద్ అలీలు హైదరాబాద్లోని మిరౌచౌక్, నల్లకుంట, మల్కాజ్గిరి, అత్తాపూర్, లంగర్హౌస్, గచ్చిబౌలి, నార్సింగ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేయడంతో వీరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనాయని చెప్పారు. ఆ కేసుల్లో జైలుకు వెళ్ళివచ్చినట్లు తెలిపారు. ఈనెల 8న భువనగిరి పట్టణంలోని జంఖాన్గాడ చౌరస్తాలో ఓ ఇంటి ముందు పార్కు చేసిన ఉన్న బైక్ను సమీర్, అలుబా, రేహాన్లు దొంగలించినట్లు ఒప్పుకున్నారని చెప్పారు. వారి వద్ద నుంచి గతంలో దొంగలించబడిన 5 బైక్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.4.80 లక్షలు ఉంటుందని, వీరిలో అలుబా, రేహాన్లను అదుపులోకి తీసుకోలేదని వారికోసం విచారణ జరుపుతున్నామని, మిగిలిన వారిని రిమాండ్కు రలించినట్లు సీఐ ఎం.రమేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్.లక్ష్మి నారాయణ, క్రైమ్ సిబ్బంది ఎన్.రమేష్, కొండారెడ్డి, రామకృష్ణలు ఉన్నారు.

## స్కూల్ బస్సుల్లో ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని పలు ప్రైవేట్ స్కూల్ బస్సులను నల్లగొండ డీటీవో లావణ్య, మిర్యాలగూడ ఎంవీఐ చంద్రశేఖర్‌గౌడ్‌లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో పలు ప్రైవేట్ బస్సుల్లో అటెండర్లు లేకపోవడం, ఓవర్ లోడ్‌తో వెళ్తుండడం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు లేని తొమ్మిది బస్సులను గుర్తించి వాటిపై కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎంవీఐ కార్యాలయంలో వారు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యా సంస్థల యాజమాన్యాలు రవాణాశాఖ నిబంధనలను తప్పక పాటించాలని, ప్రతి బస్సుకు ప్రాక్సిమిటీ మిర్రర్ ఏర్పాటు చేయాలని, అటెండర్‌ను బస్సుల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏఎంవీఐ సోనిప్రియా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాలయాల పరిశోధనలే సమాజానికి దిక్సూచి



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో 2028లో జరగనున్న మూడవ విడత నాక్ మూల్యాంకనం పై సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కాకతీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు గోపికృష్ణ, ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త, ప్రతిక్ రెడ్డి ఫౌండేషన్ సీఈవో మారం గోన రెడ్డిలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ అధ్యాపకులు ప్రతి ఒక్కరూ పరిశోధనపై దృష్టి సారించాలని, విశ్వవిద్యాలయ పరిశోధనలు, సమాజానికి దిక్సూచిలా ముందుకు నడపాలన్నారు. ప్రతి అధ్యాపకుడు తనతోపాటు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులను సైతం పరిశోధనల వైపు ప్రోత్సహించాలని అన్నారు. ఉన్నత ప్రమాణాల జర్నలలో ప్రచురించిన పరిశోధకులకు ప్రోత్సాహకాలు సైతం ఈ ఏడాది నుంచి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నాక్ మూడో విడత మూల్యాంకనం 2028లో జరగనున్న దృష్ట్యా విశ్వవిద్యాలయం గత పనితీరు, రాబోవు రోజుల్లో వివిధ విభాగాల చొరవ, వారి భాగస్వామ్యం పై చర్చించారు. ఈ విడత నాక్ ఏ గ్రేడ్ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.అనంతరం ఆచార్య గోపికృష్ణ మాట్లాడుతూ నాక్ ఎప్పుడు ఆవిష్కరణలు మరియు ఉన్నత ప్రమాణాలపై సానుకూలత దృష్ట్యా ప్రతి విభాగం తమ పరిధిలో ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని, పర్యావరణహితమైన పద్ధతులపై మొగ్గు చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ఐక్యసి డైరెక్టర్ డా మిరియాల రమేష్, డీన్లు ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆచార్య రేఖ,ఆచార్య అన్నపూర్ణ,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, ప్రిన్సిపాల్ డా సుధారాణి,డాక్టర్ శ్రీదేవి,డాక్టర్ అరుణప్రియ తదితర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీగంధం చెట్లను నరికిన నిందితులు అరెస్ట్

### నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ ,సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలలో గత రెండు నెలలుగా రైతులు కొన్ని సంవత్సరాల కాలం పాటు పెంచుకున్న శ్రీగంధం చెట్లను అక్రమంగా నరికి దొంగతనాలను పాల్పడ్డ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి తెలిపారు. డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలన అర్ధ రాత్రి సమయంలో కనగల్ మండల పరిధిలోని నేషనల్ హైవే 595 రోడ్ కి సమీపములోని ఒక శ్రీ గంధం చెట్లు ఉన్న చిలుక విద్యాసాగర్ తోట లోకి వెళ్ళి చెట్లు కోసే రంపం మిషన్ లు, గొడ్డల్లు, ఉపయోగించి తోటలో 10 శ్రీగంధం చెట్ల మొద్దులు దొంగిలించుకొని, 5 శ్రీగంధం చెట్ల నరికి వదిలివేసినారు.దీనిపై విద్యాసాగర్ రెడ్డి ఇచ్చిన పిర్యాదుపై కేసు నమోదు చేసుకొని నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేయుచుండగా బుధవారం ఉదయం 6.00 గంటల సమయంలో కనగల్ పోలీసులు నల్లగొండదేవరకొండ రహదారిపై రంగారెడ్డి బంగ్లా వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా దేవరకొండ వైపు నుండి నల్లగొండ వైపు కి రెండు బైక్ ఎపి31బిఎస్1571, ఎపి28 డిక్యు2491 లపై వెళ్ళు చున్న ముగ్గురు అనుమానాస్పదంగా వెనుకకు తన బైక్‌లను తిప్పుకొని వెళ్ళు చుండగా వారిని కనగల్ పోలీస్ వారు పట్టుబడి చేసి వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న 3 రంపాలు, 3 గొడ్డల్లు, ఫన్సింగ్ వైర్ కట్ చేసే ఒక కట్టర్, ఒక ఆక్సల్ బ్లేడ్, మూడు మొబైల్ ఫోన్‌లు రెండు బైక్‌లపై వెళ్తున్నా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకోగా నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించడం జరిగిందన్నారు. సమావేశంలో చండూరు కె ఆదిరెడ్డి, ఎస్ఐ లు కె రాజీవ్ రెడ్డి,ఎస్ఐలు వెంకన్న,డి సైదా బాబు, రైటర్ వి.రమేశ్,జానకి రాములు, తిరుమలేష్, శ్రీకాంత్, రాజు, బాలకోటి, శంకర్, శేఖర్, బి సురేశ్,.రమేశ్,టి వెంకట్ రెడ్డి ఉన్నారు.

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## రూ.33.97 కోట్ల విలువగల మద్యం, నగదు, డ్రగ్స్ స్వాధీనం

**న్యూఢిల్లీ :** రాజకీయ పార్టీల నుండి ఓటర్లను ప్రలోభపెట్టకుండా నిరోధించే ప్రయత్నాలలో భాగంగా, ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు రూ.33.97 కోట్ల విలువైన నగదు, మాదకద్రవ్యాలు, మద్యం, ఉచిత వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి. నవంబర్ 6, 11 తేదీలలో రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా, ఓట్లు నవంబర్ 14న లెక్కించబడతాయి. ఈనెల 6న ఎన్నికలు ప్రకటించినప్పటి నుండి, వివిధ దర్యాప్తు సంస్థలు మొత్తం రూ.33.97 కోట్ల విలువైన నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఉచిత వస్తువులను స్వాధీనం చేసుకున్నాయని ఎన్నికల కమిషన్ బుధవారం తెలిపింది. అభ్యర్థులు చేసిన ఎన్నికల ఖర్చులను పర్యవేక్షించడానికి వ్యయ పరిశీలకులను ఇప్పటికే నియమించారు. రెండు దశలకు నోటిఫికేషన్ జారీ చేసిన రోజునే వారు తమ నియోజకవర్గాలకు చేరుకున్నారు. వ్యయ పర్యవేక్షణలో నిమగ్నమైన అన్ని బృందాలను వారు కలుస్తారు.

# ఆయుధం వీడిన అభయ్

**మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయుధాలు అప్పగించిన మావోయిస్టు నేత మల్లోజుల వేణుగోపాల్**

### నక్సలైట్ ఉద్యమం ముగింపు ప్రారంభానికి నాంది అన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్



**గడ్చిరోలి :** మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ భూపతి ఆయుధాలను వీడి జనజీవనస్రవంతిలో కలిశారు. మల్లోజులతో పాటు మరో 60 మంది ఆయన సహచరులు బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. వేణుగోపాల్ తలపై రూ.6 కోట్ల రివార్డు ఉంది. ఏడు ఎకె 47, 9 ఇన్సాస్ రైఫిల్స్ సహా మొత్తం 54 ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించారు. భూపతి అలియాస్ సోను మావోయిస్టు సంస్థలో అత్యంత ప్రభావవంతమైన వ్యూహకర్తలలో ఒకరిగా పరిగణించబడ్డాడు. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ప్లాటూన్ కార్యకలాపాలను చాలా కాలం పర్యవేక్షించాడు. మావోయిస్టుల లొంగుబాటు సందర్భంగా సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ సీనియర్ నక్సలైట్ భూపతి, మరో 60 మంది క్యాడర్ల లొంగుబాటు మహారాష్ట్రలో నక్సలైట్ ఉద్యమం ముగింపు ప్రారంభానికి నాంది అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లోని మొత్తం 'రెడ్ కారిడార్' నక్సలిజం నుండి విముక్తి పొందుతుందని ఫడ్నవీస్ అన్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి నిషిద్ధ (మావోయిస్ట్)కు వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహిస్తున్నందుకు తాను గర్విస్తున్నానన్నారు. ఇంకా కొద్దిమంది నక్సలైట్లు మిగిలి ఉన్నారని, వారు కూడా లొంగిపోవాలని లేదంటే పోలీసు చర్యను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. గడ్చిరోలి దేశంలో నక్సలిజంపై పోరాటానికి నాయకత్వం వహిస్తున్నదని ఆనందం వ్యక్తం చేశారు. తన తలపై రూ. 6 కోట్ల రివార్డు కలిగి గడ్చిరోలిలోని అహేరి, సిరోంచాలో నక్సల్ ఉద్యమాన్ని పెంచిన భూపతి, 60 మంది ఇతర సహచరులు లొంగిపోవడం ఒక పెద్ద పరిణామం అని ఫడ్నవీస్ అన్నారు. దేశ చరిత్రలో ఇది ఒక పెద్ద విషయమని, భూపతి లొంగిపోవడం మహారాష్ట్రలో నక్సల్ ఉద్యమం ముగింపుకు నాంది అని ఆయన పేర్కొన్నారు. నక్సలైట్లు తాము సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోయామని తెలుసుకోవాలని, జనజీవన స్రవంతిలో చేరడం, భారత రాజ్యాంగాన్ని పాటించడం ద్వారా మాత్రమే సమానత్వం, న్యాయం సాధించగలమని అర్థం చేసుకోవాలన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టులు తాము సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోయామని, భారత రాజ్యాంగం మాత్రమే తమకు న్యాయం చేయగలదని వారు అర్థం చేసుకున్నారని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో కూడా 100 మందికి పైగా నక్సల్స్ లొంగిపోతారని, రెడ్ కారిడార్ అని పిలవబడే నక్సలిజం అంతమవుతుందని తాను విశ్వసిస్తున్నానన్నారు. లొంగిపోయిన వారికి గౌరవంగా పునరావాసం కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రానున్న 5 నుండి 7 సంవత్సరాలలో గడ్చిరోలి ఉక్కు కేంద్రంగా మారుతుందని, ఈ గడ్డమీద పుట్టిన లక్ష మంది బిడ్డలు జిల్లాలోనే ఉపాధి పొందుతారని చెప్పారు. నక్సలిజంపై పోరాటంలో గడ్చిరోలి పోలీసుల సాహసాన్ని ఫడ్నవీస్ ప్రశంసించారు. జిల్లాలో నక్సలిజం అంతం దగ్గర పడిందని, కానీ పోలీసు శాఖ సంతృప్తి చెంది, విశ్రాంతి తీసుకుంటుందని దీని అర్థం కాదన్నారు. రాబోయే రెండు సంవత్సరాలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యమం ముగింపు దశకు చేరుకున్నప్పుడు, మిగిలిన కొద్దిమంది చివరిసారిగా దాడి చేయడానికి ప్రయత్నిస్తారని సిఎం హెచ్చరించారు. 40 సంవత్సరాలకు పైగా గడ్చిరోలి జిల్లా మావోయిస్టు హింసను చవిచూసిందని, అభివృద్ధికి దూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

**నెల రోజులుగా మల్లోజుల చర్చలు : పోలీసులు**

గత నెలలో ఆయుధాలు వదులుకోవాలనే తన కోరికను సీనియర్ మావోయిస్టు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి తెలియజేసిన తర్వాత పోలీసులు ఆయనతో చర్చలు ప్రారంభించారని బుధవారం ఒక అధికారి తెలిపారు. భూపతితో పాటు మరో 60 మంది ఇతర కేడర్లు రెండు రోజుల క్రితం తూర్పు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో పోలీసుల ముందు లొంగిపోయారని చెప్పారు. గత నెలలో లొంగిపోవాలనే తన ఉద్దేశ్యాన్ని తెలియజేస్తూ కరపత్రాలు, ప్రెస్ నోట్స్ జారీ చేసిన తర్వాత గడ్చిరోలి పోలీసులు తమ నిఘా నెట్‌వర్క్‌ను సక్రియం చేసి, భమ్రాగఢ్ ప్రాంతంలోని వర్గాల ద్వారా చర్చలు ప్రారంభించారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. మావోయిస్టుల కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడైన 69 ఏళ్ల భూపతి, 1980లో ఏర్పడిన పీపుల్స్ వార్ గ్రూప్ (పిడబ్ల్యుజి) వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమాన్ని వ్యాప్తి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అధికారి తెలిపారు. దాదాపు 10 రోజుల క్రితం భూపతి ఫోడేవాడ ప్రాంతంలోని గ్రామస్తులతో సమావేశం నిర్వహించి హింస మార్గాన్ని విడిచిపెట్టడం గురించి తన ఆలోచనలను పంచుకున్నారని ఆయన అన్నారు. భూపతితో సంబంధం ఉన్న ఒక వ్యక్తి అక్టోబర్ 13 తెల్లవారుజామున భమ్రాగఢ్ తాలూకాలోని హోదరి గ్రామం వెలుపల భూపతితో సహా నక్సలైట్ల బృందం లొంగిపోయే అవకాశం ఉందని గడ్చిరోలి పోలీసులకు సమాచారం అందించారని ఆ అధికారి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ యాంటీనక్సల్ ఆపరేషన్స్ సందీప్ పాటిల్, గడ్చిరోలి పోలీస్ సూపరింటెండెంట్ నీలోత్పాల్, ఇతర సీనియర్ అధికారులు పరిణామాలను పర్యవేక్షించారని ఆయన చెప్పారు. ఈ వర్గాల ద్వారా లొంగిపోయే స్థలాన్ని నిర్ణయించారని, మొత్తం బృందాన్ని సురక్షితంగా అదుపులోకి తీసుకున్నట్లు అధికారి తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లను అదే రాత్రి ఆరు వాహనాల్లో గడ్చిరోలికి తరలించారు. ఈ బృందంలో ఒక కేంద్ర కమిటీ సభ్యుడు (భూపతి), ఇద్దరు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, 10 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, ఒక డిప్యూటీ కమాండర్, 16 మంది పార్టీ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు, 25 మంది సభ్యులు ఉన్నారు. వారి నుండి 54 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. వాటిలో ఏడు ఎకె47 రైఫిల్స్, ఒక ఎస్‌జి రైఫిల్, తొమ్మిది ఇన్సాస్ రైఫిల్స్, రెండు కార్బైన్లు, ఒక బిజిఎల్ లాంచర్‌తో పాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి కూడా ఉన్నాయని అధికారి తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఆయుధాలు వీడిన 77 మంది నక్సలైట్లు

**కాంకేర్/సుక్మా (ఛత్తీస్‌గఢ్) :** నక్సల్ నెట్‌వర్క్‌కు పెద్ద దెబ్బగా, 42 మంది మహిళా కేడర్లు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన కనీసం ఇద్దరు సభ్యులు సహా 77 మంది మావోయిస్టులు బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, కాంకేర్ జిల్లాల్లో లొంగిపోయారని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో సీనియర్ నక్సలైట్ మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి, 60 మంది ఇతర కేడర్లు మంగళవారం సామూహికంగా లొంగిపోయిన తర్వాత ఈ పరిణామం జరిగింది. సుక్మా జిల్లాలో, పది మంది మహిళలు సహా 27 మంది నక్సలైట్లు తమ ఆయుధాలను విడిచిపెట్టారు. వారిలో 16 మంది నక్సలైట్లు రూ.50 లక్షల సమిష్టి బహుమతిని కలిగి ఉన్నారని అధికారులు తెలిపారు. కాంకేర్ జిల్లాలో, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఆఫ్ మావోయిస్టులకు చెందిన ఇద్దరు సభ్యులు, 32 మంది మహిళా కేడర్లతో సహా 50 మంది నక్సలైట్లు సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) శిబిరంలో లొంగిపోయారు. కాంకేర్ గడ్చిరోలికి ఆనుకుని ఉన్న జిల్లా. మావోయిస్టుల దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి) సభ్యులు రాజ్‌మాన్ మాండవి, రాజు సలాం నేతృత్వంలోని మావోయిస్టు కేడర్ల బృందం కాంకేర్‌లోని కోయ్లిబెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బిఎస్ఎఫ్ 40వ బెటాలియన్‌లోని కామ్తేరా శిబిరానికి చేరుకున్నట్లు ఒక అధికారి తెలిపారు. వారు ఏడు ఎకె 47 రైఫిల్స్, రెండు సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్స్, నాలుగు ఇన్‌సాస్ రైఫిల్స్, ఒక ఇన్‌సాస్ ఎల్ఎంజి (లైట్ మెషిన్ గన్), ఒక స్టెన్ గన్‌తో సహా 39 ఆయుధాలను కూడా అప్పగించారని ఆయన చెప్పారు.

లొంగిపోయిన వారిలో ఐదుగురు డివిజనల్ కమిటీ సభ్యులు ప్రసాద్ తడామి, హీరాలాల్ కొమ్రా, జుగ్ను కోవాచి, నర్సింగ్ నేతమ్, నందే (రాజ్మాన్ మాండవి భార్య) ఉన్నారు. మిగతా వారిలో 21 మంది ఏరియా కమిటీ సభ్యులు, 21 మంది పార్టీ సభ్యులు ఉన్నారని ఆయన చెప్పారు. సుక్మాలో లొంగిపోయిన నక్సల్స్‌లో మావోయిస్టుల బలమైన సైనిక నిర్మాణంగా పరిగణించబడే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) బెటాలియన్ నంబర్ 1 సభ్యుడు ఓయం లఖ్ము (53) ఉన్నారు. అతని తలపై రూ. 10 లక్షల రివార్డు ఉందని అధికారి తెలిపారు. మరో ముగ్గురు పిఎల్‌జిఎ బెటాలియన్ నంబర్ 1లోని మిలిటరీ ప్లాటూన్ యూనిట్‌లో పార్టీ సభ్యురాలు మాడ్వి భీమా (18), సునీతా అలియాస్ కవాసి సోమ్డి (24), ప్రాంతీయ మిలిటరీ కంపెనీ నంబర్ 2 సభ్యులు సోడి మాసే (22) ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ప్రకటించారని ఆయన చెప్పారు. అంతేకాకుండా, ఒక కేడర్‌కు రూ. 3 లక్షల రివార్డు, రెండు కేడర్‌లకు రూ. 2 లక్షల రివార్డు, తొమ్మిది కేడర్‌లకు రూ. 1 లక్ష చొప్పున బహుమతి లభించిందని ఆయన అన్నారు. గడ్చిరోలిలో మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనుతో సహా 60 మంది నక్సలైట్లు లొంగిపోవడం నక్సలైట్ భావజాలానికి నిర్ణయాత్మక దెబ్బ అని ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్గదర్శకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో, మార్చి 31, 2026 నాటికి నక్సల్ రహిత భారతదేశాన్ని సాధించాలనే సంకల్పం ఖచ్చితంగా నెరవేరుతుందని తనకు పూర్తి నమ్మకం ఉందని సాయి అన్నారు.

# అట్టహాసంగా తేజస్వి యాదవ్ నామినేషన్

**పాట్నా/హాజీపూర్ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ బుధవారం రఘోపూర్ అసెంబ్లీ స్థానం నుండి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ స్థానంలో ఆయన హ్యాట్రిక్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రఘోపూర్ నియోజకవర్గం గతంలో తన తల్లిదండ్రులను, ఇద్దరూ బిహార్ ముఖ్యమంత్రులను ఎన్నుకుంది. 35 ఏళ్ల యాదవ్, వైశాలి జిల్లా ప్రధాన కార్యాలయం అయిన హాజీపూర్‌లోని కలెక్టరేట్‌లో ఆర్‌జెడి అధ్యక్షుడు, తండ్రి లాలూ ప్రసాద్, తల్లి రబ్రీ దేవి సమక్షంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. పాటలీపుత్ర ఎంపి, పెద్ద సోదరి, రాజ్యసభ సభ్యుడు మిసా భారతి వంటి అనేక మంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు కూడా మాజీ డిప్యూటీ సిఎంతో పాటు ఉన్నారు. నామినేషన్ వేయడానికి ఆర్‌జెడి నాయకులు పాట్నాలోని పార్టీ అధినేత ఇంటి నుండి హాజీపూర్ సబ్ డివిజన్ కార్యాలయం వరకు 40 కిలోమీటర్ల ప్రయాణానానికి కొన్ని గంటలు పట్టింది. 20 సంవత్సరాల తర్వాత పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆశిస్తున్న మద్దతుదారులు పెద్ద సంఖ్యలో రోడ్డుకు ఇరువైపులా నిలబడి ర్యాలీగా బయలుదేరారు. యాదవ్ తన తల్లిదండ్రులు, సోదరీమణులతో కలిసి ప్రయాణిస్తున్న కారును పూల అలంకరించారు. మద్దతుదారులు మార్గమధ్యలో పూల వర్షం కురిపించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. యాదవ్ కారు దిగి నామినేషన్ పత్రాలు దాఖలు చేయాల్సిన కార్యాలయం వైపు కొన్ని అడుగులు నడిచినప్పుడు కలెక్టరేట్ వద్ద భద్రతా సిబ్బందికి చాలా కష్ట పడాల్సి వచ్చింది. ఆయనతో పాటు వీల్‌చైర్ తీసుకున్న ప్రసాద్, ఇతరులు కూడా ఉన్నారు.

**ఇంటింటికీ ఒక ప్రభుత్వ ఉద్యోగం**

నామినేషన్ సందర్భంగా తేజస్వి మాట్లాడుతూ, రఘోపూర్ ప్రజలు తనపై నమ్మకం ఉంచి రెండుసార్లు గెలిపించారని, మూడోసారి కూడా ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని చెప్పారు.

**ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో కఠినమైన షరతులతో...**

# గ్రీన్ క్రాకర్ల విక్రయాలు, వినియోగానికి 'సుప్రీం' ఓకే

### 18నుండి 20వరకు అమ్మకాలకు అనుమతించిన ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ బెంచ్

### ఉదయం 6నుండి 7గంటల వరకు, రాత్రి 8 నుండి 10గంటల సమయం వరకు మాత్రమే పటాకులు కాల్చాలనే షరతు

**న్యూఢిల్లీ :** ఢిల్లీఎన్‌సిఆర్ పరిధి ప్రజలు దీపావళి పండుగ సందర్భంగా గ్రీన్‌క్రాకర్లు పేల్చడానికి సుప్రీంకోర్టు 'గ్రీన్' సిగ్నల్ ఇవ్వడం పెద్ద ఊరటనిచ్చింది. దీపావళి పండుగ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ సహా దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో పర్యావరణహిత గ్రీన్ క్రాకర్స్ అమ్మడానికి, పేల్చడానికి బుధవారం సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. దీనికి కొన్ని కఠినమైన షరతులు విధించింది. పర్యావరణ, ఆరోగ్య సమస్యలతో సంప్రదాయాలను సమతుల్యం చేసేలక్ష్యంతో ఈ షరతులు ఉన్నాయి. దీపావళికి ముందు రోజు, పండుగ నాడు గ్రీన్ క్రాకర్ల వాడకం నిర్దిష్ట గంటలకే పరిమితం చేయబడుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీపావళి జరుపుకునే అక్టోబర్ 18 నుండి గ్రీన్ 20వ తేదీ వరకు గ్రీన్ క్రాకర్ల అమ్మకానికి అనుమతి ఉంటుంది. ఈ సడలింపు 'పరీక్షా ప్రాతిపదికన మాత్రమే' అని, పేర్కొన్న కాలానికి మాత్రమే ఉంటుందని కూడా అత్యున్నత న్యాయస్థానం స్పష్ట ం చేసింది. ఢిల్లీ ప్రభుత్వం విధించిన పూర్తి నిషేధాన్ని సడలించాలని కోరుతూ కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం చేసిన ఉమ్మడి అభ్యర్థనను, గ్రీన్ క్రాకర్ల తయారీదారుల విజ్ఞప్తిని ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ , జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం అనుమతించింది. 'తీవ్రమైన ప్రమాదాలకు దారితీసే తీవ్రమైన పర్యావరణ కాలుష్యం, బాణసంచా కాల్చే వ్యక్తులకు, వారి కార్మికులకు అందుబాటులో ఉన్న జీవించే హక్కు, వృత్తిని కొనసాగించే హక్కుకు విరుద్ధంగా ఉంది. పటాకులు పేల్చడం పండుగ స్ఫూర్తిని వ్యక్తపరుస్తుంది. అంతేకాకుండా మతపరమైన ఇతర శుభకార్యక్రమాలలో ఇది మానసిక స్థితిని పెంచుతుంది. భారతదేశ సాంస్కృతిక కార్యక్రమాలలో ఇది పొందుపరచబడింది' అని ధర్మాసనం పేర్కొంది. 'సంప్రదాయాలు, సాంస్కృతిక లేదా మతపరమైన నిబంధనల ఆధారంగా అనియంత్రిత వినియోగం ద్వారా ఆరోగ్యానికి స్వల్పకాలిక హాని కలిగించే పరిస్థితికి ఇది దారితీయదు. పర్యావరణ ఆరోగ్యం విషయానికి వస్తే వాణిజ్యపరమైన అంశాలు, పండుగ స్ఫూర్తిని వెనక్కి తీసుకోవాలని ఈ కోర్టు తరచుగా చెప్పినట్లుగా మేం పునరుద్ఘాటించకుండా ఉండలేం' అని భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ తన 21 పేజీల ఆర్డర్‌లో చెప్పారు. తాత్కాలికగా చర్యగా ఆదేశాలు జారీ చేస్తూ, 2018లో అర్జున్ గోపాల్ కేసులో గ్రీన్ క్రాకర్స్ అనే భావన ఆవిర్భవించిన తర్వాత అనుసరించిన విధానానే ధర్మాసనం అనుసరిస్తుంది అన్నారు. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఇఇఆర్ఐ) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన గ్రీన్‌క్రాకర్ల



అమ్మకానికి అక్టోబర్ 18నుంచి అనుమతి ఉంది. అక్టోబర్ 20 వరకు మాత్రమే కొనసాగుతుంది' అని ధర్మాసనం పేర్కొంది. జిల్లా యంత్రాంగం, పోలీసులు రెండు రోజులలో అంటే దీపావళికి ముందు రోజు ఉదయం 6నుండి 700గంటల వరకు , రాత్రి 800గంటల నుండి 10గంటల వరకు మాత్రమే పటాకులు కాల్చాలని నిర్ధారించుకోవాలని ధర్మాసనం తెలిపింది. 'దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లోని నిర్ణీత ప్రదేశాల నుండి మాత్రమే గ్రీన్‌క్రాకర్ల అమ్మకాలకు అనుమతి ఉంటుంది. ఆప్రదేశాలను జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌తో సంప్రదించి, గుర్తించి, విస్తృత ప్రచారం చేపట్టాలి' అని బెంచ్ తెలిపింది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులు నామినేట్ చేసిన అధికారులతో సహా, పోలీసు అధికారులు, డిస్ట్రిబ్యూషన్‌తో సంప్రదించి, అమ్మకాల కోసం నియమించబడిన ప్రదేశాలపై నిఘా ఉంచడానికి పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అనుమతించబడిన ఉత్పత్తులు మాత్రమే విక్రయించబడతాయని, అవి కూడా కోడ్‌లను కలిగి ఉన్నాయని, పెట్రోలింగ్ బృందాలు క్రమం తప్పకుండా నిఘా నిర్వహిస్తాయని బెంచ్ తెలిపింది. వారు విశ్లేషణ ప్రయోజనం కోసం యాదృచ్ఛిక నమూనాలను కూడా తీసుకోవాలని సూచించింది. నిషేధిత ఉత్పత్తి తయారీ లేదా అమ్మకంలో పాల్గొన్నవారికి జరిమానా విధించడమే కాకుండా ఎన్ఇఇఆర్ఐ నుండి వారి లైసెన్స్ / రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేయబడుతుందని వెల్లడించింది. లైసెన్స్ పొందిన వ్యాపారుల ద్వారా మాత్రమే క్రాకర్లను విక్రయించవచ్చని, ఎన్ఇఇఆర్ఐ, పిఇఎస్ఒతో నమోదుచేసుకున్న వారి ద్వారానే వాటిని తయారు చేయాలని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది.

స్వాధీనం చేసుకున్న క్రాకర్లు, రిజిస్టర్డు మ్యానుఫాక్చరర్లు తయారు చేయనివి జప్తుచేయబడతాయని, బయటి నుండి ఎన్‌సిఆర్ ప్రాంతంలోకి బాణసంచా అనుమతించబడదని పేర్కొంది. బేరియం కలిగిన బాణసంచా, ఎన్ఇఇఆర్ఐ ఆమోదించని వాటిని గ్రీన్‌క్రాకర్లుగా ఉపయోగించడానికి అనుమతిలేదని, వ్యక్తులు / వ్యాపారుల వద్ద ఉన్నట్లు తేలితే వాటిని జప్తు చేస్తారని, లారిస్ (ఫైర్ క్రాకర్స్ సిరీస్) తయారీ లేదా అమ్మకం ఉండకూడదు అని ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఎస్‌పిబిలతో సంప్రదించి అక్టోబర్ 14నుండి 25వరకు గాలి నాణ్యత సూచిక (ఎక్యూఐ)ను పర్యవేక్షిస్తాయని, ప్రతీరోజూ ఎక్యూఐని పేర్కొంటూ ఒక నివేదిక దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

## 57 మందితో జెడియు తొలి జాబితా

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు) బుధవారం 57 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ప్రకటించింది. అందులో విజయ్ కుమార్ చౌదరి, శర్వన్ కుమార్, మదన్ సాహ్నీ, మంత్రులు రత్నేష్ సదా, మహేశ్వర్ హజారీ వంటి పలువురు మంత్రులు ఉన్నారు. సంవత్సరం క్రితం ఆర్‌జెడిని వీడి జెడి(యు)కి తిరిగి వచ్చిన శ్యామ్ రాజక్, మంగళవారం మోకామా అసెంబ్లీ స్థానం నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన అనంత్ కుమార్ సింగ్ వంటి వారు కూడా ఈ జాబితాలో ఉన్నారు. జెడి(యు) రాష్ట్ర యూనిట్ అధ్యక్షుడు ఉమేష్ కుష్వాహా కూడా మహ్నార్ స్థానం నుండి పోటీలో ఉన్నారు. కుష్వాహా మంగళవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. తొలి జాబితా ప్రకారం... మదన్ సాహ్నీ బదౌర్‌పూర్ అసెంబ్లీ స్థానం నుండి, రత్నేష్ సదా సోన్‌బార్సా నుండి, మహేశ్వర్ హజారీ సరైరంజన్ నుండి, విజయ్ కుమార్ చౌదరి నలంద నుండి పోటీ చేయనున్నారు.

**ఎన్‌డిఎలో పరిస్థితి బాగా లేదు : ఉపేంద్ర కుష్వా**

ఎన్‌డిఎలో పరిస్థితులు బాగాలేవని రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) చీఫ్, రాజ్యసభ ఎంపి ఉపేంద్ర కుష్వా సీట్ల పంపకాల ఏర్పాటుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ బిజెపి నాయకులను కలవడానికి బుధవారం ఢిల్లీకి బయలుదేరిన కుష్వాహా, విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ, అంతా బాగానే ఉంటుందన్న ఆశ, నమ్మకంతో తాము ఢిల్లీకి వెళ్తున్నామన్నారు. పార్టీ అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం కుష్వా తన పార్టీకి కేటాయించిన ఆరు సీట్లతో సంతోషంగా లేరు. మహువా స్థానాన్ని మరొక ఎన్‌డిఎ సభ్యుడైన కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)కి కేటాయించడం పట్ల కూడా ఆయన అసంతృప్తితో ఉన్నారు. పాట్నాలోని సీనియర్ బిజెపి నాయకులు కుష్వాను ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్, ఇతర రాష్ట్ర బిజెపి నాయకులు మంగళవారం సాయంత్రం ఇక్కడ కుష్వాను కలిశారు. రాత్రి పొద్దుపోయే వరకు సమావేశం కొనసాగింది, ఆ తర్వాత కుష్వా విలేకరులతో మాట్లాడుతూ ఈసారి ఎన్‌డిఎ పరిస్థితులు ఏమీ బాగా లేవన్నారు. కూటమి భాగస్వాముల మధ్య సీట్ల కేటాయింపు సామరస్యంగా పరిష్కరించబడిందని, చర్చలు చివరి దశలో ఉన్నాయని ఎన్‌డిఎ నాయకులు పేర్కొన్న కొద్దిసేపటికే చిన్న మిత్రపక్షాలలో అసంతృప్తి బయటపడింది.

# 'మహా'లో ఓటర్ల జాబితాలు లోపభూయిష్టం

### స్థానిక సంస్థల ఎన్నికలలో వీటిని ఉపయోగించొద్దు ప్రతిపక్షనేతల డిమాండ్,

**ముంబయి :** మహారాష్ట్రలోని ఓటర్ల జాబితాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, రాజకీయ నేతల ప్రలోభాలకు గురయ్యాయని ప్రతిపక్ష నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వీటిని ఉపయోగించ వద్దని ఎన్‌సిపి (ఎస్‌పి) నేత జయంత్ పాటిల్, కాంగ్రెస్‌కు చెందిన బాలాసాహెబ్ థోరట్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఇసి) దినేష్ వాగ్మారే, ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) చోకలింగంలను ప్రతిపక్ష నాయకుల బృందం బుధవారం వరుసగా రెండవ రోజు కలిసి ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై ఆందోళన వ్యక్తం చేసింది. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ థాక్రే కూడా ప్రెస్ మీట్‌లో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు మరో రెండు నెలల్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో జరిగే అవకాశం ఉంది. కాగా, ఇపిఐసి (ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డులు), రాజకీయ పార్టీలతో పంచుకున్న ఓటర్ల జాబితాలలో అసంపూర్ణమైన, తప్పుదారి పట్టించే చిరునామాలు సరైన ప్రక్రియ తీవ్రమైన ఉల్లంఘనను సూచిస్తాయని పాటిల్ అన్నారు. ఓటర్ల జాబితాలు రాజకీయ నేతలతో రాజీ పడినట్లుగా కనిపిస్తున్నాయని, చిరునామాలు తప్పుగా ఉన్నాయని, కొంత మంది ఆ చిరునామాల్లో నివసించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తాము సిఇఒ, ఎస్ఇసికి నిర్దిష్ట ఉదాహరణలను చూపించామని చెప్పారు. థానే జిల్లా ముర్బాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని బూత్ నంబర్ 8 వద్ద 400 మంది ఓటర్ల చిరునామాకు బదులుగా డాష్ ఉంచారని ఆయన చెప్పారు. అమరావతి బద్నేరా సెగ్మెంట్‌లోని బూత్ నంబర్ 218లో 450 మంది ఓటర్ల ఇంటి చిరునామాకు ముందు ఒక సంఖ్యా సున్నా రాయబడిందన్నారు. కాంప్టీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎటువంటి నివాస చిరునామా లేకుండా 867 ఓటరు ఐడిలు జారీ చేశారని పాటిల్ పేర్కొన్నారు. ఇపిఐసి నంబర్లు ప్రత్యేకంగా ఉండాలనే భావించినప్పటికీ ఓటర్ల జాబితాలలో ఒకే వ్యక్తి పేరు అనేకసార్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. నల్లసోపారాలో ఆరు వేర్వేరు ఇపిఐసి నంబర్లతో సుషమా గుప్తా అనే పేరు కనిపించింది. ఆగస్టు 12న మీడియాలో ఈ విషయం బయటపడిన తర్వాత, అదే రోజు సాయంత్రం 6 గంటల నాటికి ఆరు ఎంట్రీలను తొలగించారు. ఈ తొలగింపును ఎవరు ఆదేశించారు? ఫిర్యాదును ఎవరు దాఖలు చేశారు? ఏ అధికారి భౌతికంగా ధృవీకరణ నిర్వహించి, అన్ని ఫోటోలు ఒకే మహిళకు చెందినవని నిర్ధారించారు? అధికారులు ఎటువంటి సమాధానాలు ఇవ్వలేదు అని ఆయన చెప్పారు. ఒక ప్రైవేటు సంస్థ ఎన్నికల డేటాబేస్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థలో వేరే ఎవరో పేర్లను చొప్పించారని, అవి బహిర్గతం అయినప్పుడు, గుట్టుచప్పుడు కాకుండా వాటిని తొలగించారని మండిపడ్డారు.

## బిజెపి రెండో జాబితా..

### సింగర్ మైథిలీ ఠాకూర్

పాట్నా : బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల రెండవ జాబితాను భారతీయ జనతా పార్టీ బుధవారంనాడు విడుదల చేసింది. 12 మంది అభ్యర్థులు, వారు పోటీ చేసే నియోజకవర్గాలను తాజాగా ప్రకటించింది. ఈసారి టిక్కెట్ దక్కిన వారిలో ఫోక్ సింగర్ మైథిలీ ఠాకూర్, మాజీ ఐపిఎస్ అధికారి ఆనంద్ మిశ్రా తదితరులు ఉన్నారు. అలీనగర్ నియోజకవర్గం నుంచి మైథిలీ ఠాకూర్ పోటీ చేయనుండగా, బక్సర్ నుంచి ఆనంద్ మిశ్రా పోటీ చేస్తారు. బిహార్‌లోని మధుబని జిల్లా బేనిపట్టికి చెందిన మైథిలీ ఠాకూర్ ఇటీవల బిజెపిలో చేరారు. కాగా, మైథిలీ ఠాకూర్‌తో పాటు మరో మహిళా అభ్యర్థి ఛోటీ కుమారికి ఛాప్రా సీటును బిజెపి కేటాయించింది. బిజెపి మొత్తం 101 స్థానాలకు గాను ఇంతరకూ 83 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. సోమవారంనాడు తొలి జాబితాలో 71 మంది అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చింది.

# విజయ్ ఆలస్యంగా రావడంవల్లే

### తొక్కిసలాటపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన



**చెన్నై :** తమిళనాడు కరూర్‌లో టివికె చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 60 మంది గాయపడ్డారు. ఇక ఈ ఘటనపై తమిళనాడు అసెంబ్లీలో బుధవారం చర్చ జరిగింది. ఈ చర్చ సందర్భంగా టివికె పార్టీ, విజయ్‌పై తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. విజయ్ ఆలస్యంగా రావడమే ఈ ఘటనకు కారణమని వ్యాఖ్యానించారు. కరూర్ తొక్కిసలాట ఘటనకు విజయ్, టివికెనే బాధ్యులని పేర్కొన్నారు. 'టివికె చేసిన షెడ్యూల్ తప్పిదాలే కరూర్ తొక్కిసలాటకు కారణం. విజయ్ మధ్యాహ్నం నాటికి వేదిక వద్దకు చేరుకుంటారని పార్టీ పేర్కొంది. కానీ ఆయన ఏడుగంటలు ఆలస్యంగా వచ్చారు. అప్పటికే అక్కడ జనం పెద్ద ఎత్తున గుమిగూడారు. దీంతో ఆయన ప్రచార వాహనం కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో అక్కడ గందరగోళం నెలకొంది. ఊపిరాడక తొక్కిసలాట చోటు చేసుకుంది. విజయ్ ఆలస్యమే తొక్కిసలాటకు ముఖ్య కారణం. ర్యాలీకి వచ్చిన ప్రజలకు తాగునీరు వంటి కనీస సౌకర్యాలను కల్పించడంలో టివికె పార్టీ విఫలమైంది' అని సిఎం ఆరోపించారు. తొక్కిసలాట అనంతరం క్షతగాత్రులకు సాయం చేసేందుకు ప్రయత్నించిన అంబులెన్స్‌లపై టివికె కార్యకర్తలు దాడి చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ దాడిలో అత్యవసర సేవల సిబ్బంది కూడా గాయపడినట్లు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సిఎం స్టాలిన్ అసెంబ్లీలో వివరించారు.

ప్రజాపక్షం
గురువారం, 16 అక్టోబరు

# ముంచుకొస్తున్న కాలుష్య ఉప్పెన!

దీపావళి వస్తున్నది. మళ్లీ వాయు కాలుష్య సమస్య తెరపైకి తెస్తున్నది. పర్యావరణ సమస్యకు కూడా మతం ముసుగువేసే ప్రయత్నం మరోసారి మొదలైంది. జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో మంగళవారం సాయంత్రానికి వాయు నాణ్యత సూచీ (ఎక్యూఐ) 210 దాటింది. ప్రమాదాన్ని సూచిస్తున్నది. కాలుష్య సమస్య ఉప్పెనగా మారి, విరుచుకుపడనుంది. శ్వాస తీసుకోవడం కష్టతరమవుతుంది. సమస్యలు పాతవే. పరిష్కరించడంలోనే ప్రభుత్వ వైఫల్యాలు. రాజధానిలో పొగ, ఇతర కాలుష్య కారకాల స్థాయిని పెంచడానికి కారణమవుతున్న వ్యవసాయ వ్యర్థాలు దగ్ధమవుతునే ఉన్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలు సైతం అమలు కాని పరిస్థితి. వాహనాల నుంచి కర్మాగారాల వరకూ... వ్యవసాయ వ్యర్థాల దగ్ధం నుంచి గ్రీన్ హౌస్ ఉద్గారాల వరకూ అడుగడుగునా వైఫల్యాలే. శీతాకాలం ప్రారంభ దశలోనే ఉత్తరాది రాష్ట్రాల్లోని రైతులు తమ తదుపరి సీజన్‌లో విత్తనాలు నాటడానికి వరి దుబ్బులను తగలబెడతారు. దీనివల్ల కాలుష్య స్థాయి పెరుగుతుంది. దీపావళి బాణాసంచా సృష్టించే కాలుష్యాన్ని మరింత తీవ్ర స్థాయికి చేరుస్తుంది. బాణాసంచా వాడకాన్ని నియంత్రించాలనడం మత విశ్వాసాలను దెబ్బతీయడమే అంటూ వితండ వాదనలు. మొండి వైఖరులు. కాలుష్యాన్ని పెంచుతున్నది ఎవరు? వాహన యజమానులా? రైతులా? వాతావరణ పరిస్థితులా? పండుగ సంబరాలా? దోషి ఎవరు అనే దానిపై ఎడతెగని చర్చలు. పరస్పర ఆరోపణలు. అంతులేని రాజకీయ వివాదాలు. ఫలితం మాత్రం శూన్యం. సమస్య ఏటేటా పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు. శీతాకాలంలో కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రభుత్వం సఫలమైన సందర్భాలు దాదాపు శూన్యం. ప్రతి సంవత్సరం పండుగ సీజన్‌లో శ్వాసకోశ రుగ్మతల కేసులు పెరుగుతునే ఉన్నాయి. డ్రై క్లీనింగ్ ద్రావణాలు, పెట్రోల్..డీజిల్ ఇంధనాలు, పెయింట్లు, పాలిష్‌లు వంటి సామాగ్రి మిగిల్చే వాయు కాలుష్యం అంతాఇంతా కాదు. వీటికి తోడు, దీపావళి తర్వాత ఢిల్లీలో పొగమంచు కమ్ముకుంటుంది. అనేక మెట్రోలలో గాలి నాణ్యత తగ్గుతుంది. ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఆస్తమా, న్యుమోనియా, దీర్ఘకాలిక కొవిడ్ వంటి సమస్యలు పెరుగుతాయి. ఇది నిత్యం చూస్తున్న సత్యమే... ప్రతిసారీ అధికారుల హడావుడే... సుదీర్ఘ చర్చలే. దీపావళి సంబరాలపై పరిమితులు విధించడం, ఆ వెంటనే మనోభావాలు దెబ్బతిన్నాయంటూ ఓ వర్గం విమర్శలు గుప్పించడం.. ఇంతకు మించి ప్రజలకు జరుగుతున్న మంచి లేనేలేదు. కాలుష్య సమస్యను నియంత్రించే విధానాలపై స్పష్టత శూన్యం. దీర్ఘకాలిక ప్రణాళికలు మృగ్యం. కాలుష్యకారకాలను గుర్తించినా... సుప్రీం కోర్టు నేరుగా ఆదేశాలు జారీ చేసినా, ప్రభుత్వాల స్పందన అంతంత మాత్రం. గత రెండు సంవత్సరాల్లో కాలుష్య సూచీ అత్యధిక స్థాయిని మించి నమోదు అవుతున్నా, నియంత్రణ దిశగా అడుగు ముందుకు పడడం లేదు. భారతదేశ రాజధాని ఢిల్లీ అధికార కేంద్రం మాత్రమేకాదు, ఆర్థిక, సాంస్కృతిక, జనజీవన దృక్కోణంలో భారతదేశ హృదయం కూడా. కానీ, నేడు పొగతో నిండిన కాలుష్య సాగరం. ఈ దుస్థితి హఠాత్తుగా ఊడిపడిన ఉపద్రవం కాదు. ఇది సంవత్సరాల తరబడి కొనసాగిన నిర్లక్ష్యం... అస్తవ్యస్తమైన పరిశ్రమల వ్యవస్థ... దీపావళి వంటి పండుగలు వంటి ఎన్నో అంశాల పెను ప్రభావం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే ప్రణాళికలు, కార్యాచరణ విధానాలు అమలుకావడం లేదు. హామీలు నినాదాలుగానే మిగిలిపోతున్నాయి. ప్రతి శ్వాసలోనూ విషపూరిత కణాలు ప్రజల శరీరంలో చేరుతున్నాయి. పొంగమంచు నిరోధక వ్యవస్థల ఏర్పాటును నిర్లక్ష్యం చేసిన ఫలితం కాలుష్య రూపంలో కబళిస్తున్నది. కృత్రిమ వర్షాన్ని కురిపిస్తామని ఢిల్లీలో ఇటీవల అధికారంలోకి వచ్చిన బిజెపి ఎన్నికల హామీ ఇచ్చింది. అమలు చేయడం లేదు. కాలుష్య సంక్షోభానికి వినూత్న పరిష్కారాలు కనుగొంటే 50 లక్షల రూపాయల బహుమతిని ప్రకటించడంతో బాధ్యత తీరినట్టు వ్యవహరిస్తున్నది. కంటితుడుపు ప్రకటనలు... నామమాత్రపు చర్యలతో పరిస్థితి చక్కబడదు. ఉదాసీన వైఖరికి భారీ మూల్యం తప్పదు. దీపావళికి ముందుగానే కాలుష్య సూచీలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్న తరుణంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాఢ నిద్ర నుంచి మేల్కొనాలి. పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలి. మత విశ్వాసాలకు అతీతంగా సమస్యను అధ్యయనం చేయాలి. విశ్లేషించాలి. పరిష్కారాలతో సిద్ధం కావాలి. కాలుష్యంపై జరిగే మహాయుద్ధంలో విజయానికి అన్ని రకాల మార్గాలను అనుసరించాలి. ప్రజల ఆరోగ్యంతో... జీవితాలతో ఆడుకోవడం ప్రభుత్వాలకు ఎంతమాత్రం తగదు.

# భారతదేశం అరుదైన మూలకాల గని

సృష్టి గుప్తా, రోషన్ సోని

అరుదైన భూ మూలకాలపై (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) ఆధారపడటం గురించి ప్రపంచం 2010లో మేల్కొంది. ప్రాదేశిక వివాదం సమయంలో జపాన్‌కు చైనా ఎగుమతులను నిలిపివేసిందని ఆరోపణలు ఈ భౌగోళిక రాజకీయ సంక్షోభానికి కారణం. ఆ సమయంలో బీజింగ్ ప్రపంచ డిమాండ్‌లో 97 శాతం సరఫరా చేస్తుండేది. అణుయుగం నుండి డిజిటల్ విప్లవం వరకు, కలర్ టెలివిజన్‌లు, పెట్రోలియం శుద్ధి నుండి నేటి ఉపగ్రహాలు, ఎలక్ట్రిక్ వాహనాల వరకు ఆధునిక ప్రపంచం ఆధారపడేలా ఆర్‌ఇఇలు చేస్తున్నాయి.

2021 నాటికి దాదాపు 5.3 బిలియన్ల అమెరికా డాలర్ల విలువైన ప్రపంచ అరుదైన భూ మూలకాల మార్కెట్ 2026 నాటికి 10 బిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా.

**మారుతున్న గుత్తాధిపత్యం**

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లు భారతదేశం, బ్రెజిల్, ఆఫ్రికాలోని వలసప్రాంతాల నుండి సరఫరాలపై ఆధారపడ్డాయి. 1960ల నాటికి, అణుశక్తి, ఎలక్ట్రానిక్స్‌కు కీలకమైన ఖనిజాలను సరఫరా చేసేయడంలో కాలిఫోర్నియాలోని మౌంటైన్ పాస్ గని అమెరికాకు ఆధిపత్యం దక్కేలా చేసింది.

1990ల నాటికి సమతుల్యత తూర్పు వైపుకు మళ్ళింది. వనరుల సమృద్ధి, సబ్సిడీలు, సాంకేతిక పురోగతి (జు గువాంగ్జియన్ క్యాస్కేడ్ సిద్ధాంతం), పర్యావరణ వ్యయాల భరింపుపై నిర్మించిన పారిశ్రామిక వ్యూహంతో చైనా ఆధిపత్యాన్ని సాధించింది. ఇన్నర్ మంగోలియాలోని బయాన్ ఓబో వంటి గనులు ప్రపంచ సరఫరాకు పర్యాయపదంగా మారాయి. 2010 నాటి ఎగుమతి సంక్షోభం ఆర్‌ఇఇలు కేవలం వస్తువులు కాదని, అవి శక్తి సాధనాలు అని నిరూపించింది.

**ప్రపంచ ఆర్‌ఇఇ ఉత్పత్తి అవలోకనం**

ఆర్‌ఇఇ ఉత్పత్తి సరఫరాలో చైనా ప్రపంచ ఉత్పత్తిలో 69 శాతంతో ఆధిపత్యం చెలాయిస్తోంది. ఆ దేశం ప్రపంచంలోని మొత్తం నిల్వలలో 49 శాతం కలిగి ఉంది. కేవలం 1.6 శాతం నిల్వలతో ఉన్న యునైటెడ్ స్టేట్స్ దాదాపు 12శాతం వాటాను అందిస్తుంది. ఐదవ అతిపెద్ద ప్రపంచ నిల్వలలో 8శాతం కలిగి ఉన్న భారతదేశం, ఒక్క శాతం కంటే తక్కువ ఉత్పత్తి చేస్తుంది. ఇది దాని వినియోగంలో లేని సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.

భారతదేశ నిల్వలు తూర్పు, దక్షిణ తీరప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. ఈ మోనజైట్ నిక్షేపాలు భారతదేశ శుద్ధ ఇంధనం(క్లీన్ ఎనర్జీ), రక్షణ పరిశ్రమలకు లంగరు వేయగలవు.

2000, 2020 మధ్య చైనా తన ఉత్పత్తిని 70,000 నుండి 140,000 టన్నులకు రెట్టింపు చేసింది. ఇది క్రమంగా 3.5 శాతం వృద్ధి చెందింది. అమెరికా ఉత్పత్తిని 5,000 నుండి 38,000 టన్నులకు పెంచింది. ఇది సంవత్సరానికి 10.67 శాతం పెరుగుదల. ఉత్పత్తి ప్రతి ఏడు సంవత్సరాలకు రెట్టింపు అవుతుంది. భారతదేశం 2,700 నుండి 3,000 టన్నులకు పెరిగింది. ఇక్కడ వార్షిక వృద్ధి రేటు 0.5 శాతం. కాబట్టి, చైనా వాటా కుంచించుకుపోతుండగా, అమెరికా తిరిగి పట్టును సాధిస్తుంది. భారతదేశం 'స్లీపింగ్ జెయింట్ (నిద్రిస్తున్న బాహుబలి)'గా మిగిలిపోయింది.

**చైనా ప్రారంభం, దాని వ్యయాలు**

నేటి చైనా నాయకత్వం పర్యావరణానికి భారీ నష్టాన్ని కలిగిస్తోంది. జియాంగ్జీ, ఇన్నర్ మంగోలియాలో క్రమబద్ధీకరించని మైనింగ్ కారణంగా కలుషితమైన నీరు, విషపూరితమైన నేల, బంజరు వ్యవసాయ భూములు మిగిలిపోయాయి. ప్రకృతి రమణీయ దృశ్యాలు పునరుద్ధరణకు 50–100 సంవత్సరాలు పట్టవచ్చు. బయాన్ ఓబో సమీపంలోని అపఖ్యాతి పాలైన విషపూరిత సరస్సు అదుపులేని వృద్ధి, వినాశకరమైన పర్యావరణ మూల్యాన్ని గుర్తు చేస్తుంది. ప్రభావిత ప్రాంతాలలో మానవ నష్టం తీవ్రంగా ఉంది. అక్కడ క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, రేడియోధార్మిక వ్యర్థాలు, రసాయనాలకు గురికావడంతో ముడిపడి ఉన్న జనన లోపాలు ఎక్కువగా ఉన్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

గనుల సమీపంలో నివసించే సమాజాలు కలుషితమైన భూగర్భ జలాలు, అసురక్షిత గాలి, దీర్ఘకాలిక ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. ఇవన్నీ ఆర్థిక శక్తిగా చైనా ఆధిపత్యాన్ని చాటే కథ వెనుక మాటున లోతైన సామాజిక, పర్యావరణ మచ్చలతో ఉన్నాయి.



**భారతదేశం వైరుధ్యం**

భారతదేశంలో 1950 నుండి ఐఆర్‌ఇఎల్ (ఇండియా) లిమిటెడ్ అనే ప్రభుత్వరంగ సంస్థ ఏకైక ఆర్‌ఇఇ వెలికితీతదారుగా ఉంది. భారతదేశం పరిమిత ఖనిజాన్ని తవ్వుతుంది కానీ, చాలావరకు తుది ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది. 2024–25లో దేశీయ ఉత్పత్తి 3,000 టన్నుల కంటే తక్కువగా ఉండగా, దాదాపు 54,000 టన్నుల అరుదైన భూమి అయస్కాంతాలను దిగుమతి అవుతుంది. కాలం చెల్లిన వసతులు, పరిమిత పరిశోధన, అభివృద్ధితో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంపై చారిత్రాత్మక నిషేధంతో ఆవిష్కరణలను అణచివేత దీనికి కారణాలు. చైనా వేగవంతమైన, అస్థిరమైన వృద్ధికి భిన్నంగా మన దేశంలో కఠినమైన కార్మిక, పర్యావరణ నిబంధనలు కూడా ఆర్‌ఇఇల విస్తరణను మందగించాయి.

ఈ అంతరాన్ని తగ్గించడానికి ప్రభుత్వం నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ (2025)ను ప్రారంభించింది. దీనిపై దృష్టి సారించింది:

- **అన్వేషణ, మైనింగ్:** 2030 నాటికి 1,200 కి పైగా ప్రాజెక్టుల ప్రణాళిక రచించబడింది. ఇప్పటికే 195 అమలులో ఉన్నాయి.
- **ప్రాసెసింగ్, విలువ గొలుసులు:** 2030 నాటికి దాదాపు రెట్టింపు నియోడైమియం ఉత్పత్తికి ఐఆర్‌ఇఎల్ తన ఒడిశా ప్లాంట్‌ను విస్తరిస్తోంది.
- **అంతర్జాతీయ భాగస్వామ్యాలు:** కెఎబిఐఎల్ ద్వారా అర్జెంటీనా (లిథియం), ఆస్ట్రేలియా (ఆర్‌ఇఇ) లతో భారతదేశం అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది.
- **రీసైక్లింగ్, ప్రత్యామ్నాయాలు:** అయస్కాంత రహిత మోటార్లను, ఫ్లై యాష్, ఎర్ర బురద వంటి పారిశ్రామిక వ్యర్థాల నుండి రికవరీ గురించి ఐఐటిలలో పరిశోధన ద్వారా అన్వేషిస్తోంది. అయినప్పటికీ రీసైక్లింగ్ అసమర్థమైనది. 100,000 ఐఫోన్లను విడదీయడం ద్వారా కేవలం 11 కిలోల ఆర్‌ఇఇలు మాత్రమే లభిస్తాయి.

ప్రభావ అంచనాలు, కమ్యూనిటీ సంప్రదింపులు, చైనా తప్పులు పునరావృతం కాకుండా ఉండటానికి జీరో డిశ్చార్జ్ టెక్నాలజీలను స్వీకరించే విషయంలో పర్యావరణ నియంత్రణలు ఇప్పుడు అవసరం.

> భారతదేశం శుద్ధమైన సాంకేతికతకు, కఠినమైన పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వృద్ధి స్థిరత్వంపై ఆధారపడి ఉండాలి. ఎందుకంటే పురోగతికి నిజమైన కొలమానం ఉత్పత్తి పరిమాణంలో మాత్రమే కాకుండా, భూగ్రహాన్ని సంరక్షించడాన్ని సాకారం చేయడంలో ఉంటుంది.

భారతదేశం ఖనిజ స్వావలంబన సాధించడం కోసం పర్యావరణ బాధ్యతను నిర్ధారించుకోవడం ఒక సవాలు, అలాగే అవకాశం కూడా. ఎంఎంఆర్ చట్ట సంస్కరణలు, ఎన్‌సిఎంఎం 2025 –2031 ద్వారా అర్జెంటీనా నుండి ఆస్ట్రేలియా వరకు భాగస్వామ్యాల ద్వారా శుద్ధి, రీసైక్లింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు, విదేశీ ఆస్తులను భద్రపరుచుకునేందుకు భారతదేశం నిబద్ధతను నొక్కి చెబుతున్నది. అయితే, మైనింగ్, ప్రాసెసింగ్ తరచుగా విషపూరితమైన రేడియోధార్మిక వ్యర్థాలను ఉత్పత్తి చేస్తాయి. ఇతర చోట్ల కనిపించే పర్యావరణ విపత్తులను నివారించడానికి భారతదేశం శుద్ధమైన సాంకేతికతకు, కఠినమైన పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వృద్ధి స్థిరత్వంపై ఆధారపడి ఉండాలి. ఎందుకంటే పురోగతికి నిజమైన కొలమానం ఉత్పత్తి పరిమాణంలో మాత్రమే కాకుండా, భూగ్రహాన్ని సంరక్షించడాన్ని సాకారం చేయడంలో ఉంటుంది.

**సృష్టి గుప్తా టాటా చైర్ యూనిట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ అసిస్టెంట్ ప్రొఫెసర్**
**రోషన్ సోని ఢిల్లీ యూనివర్సిటీలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఎంఏ ఎకనామిక్స్ (ఎఫ్) చేశారు**
**(ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)**

# ఫీజు బకాయిలు... విద్యార్థుల భవిష్యత్తు?




**కసిరెడ్డి మణికంఠ రెడ్డి**
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా విద్యార్థుల బాధలు తీరడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి చదువుకుంటున్న పేద విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాలేజీ విద్యార్థుల ట్యూషన్ ఫీజు విడుదల చేయడం లేదు. చివరికి పాఠశాల స్థాయిలో అమలవుతున్న బెస్ట్ అవలైబుల్ స్కీమ్(బిఎఎస్)కు నిధులివ్వకపోవడంతో ఆ స్కీమ్ కింద చదువుతున్న విద్యార్థులను ఆయా యాజమాన్యాలు స్కూళ్లకు రానివ్వని పరిస్థితి తలెత్తింది. విద్యా సమానత్వానికి ప్రతీకగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్, బిఎఎస్ స్కీమ్‌ల బకాయిల విడుదలలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం విద్యార్థుల మనోధైర్యాన్ని దెబ్బతీసింది.

రాష్ట్రంలో గత 4 సంవత్సరాల నుంచి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు సకాలంలో విడుదల అవక విద్యార్థులు పడుతున్న బాధలు అంతా ఇంతా కాదు. దాదాపు 8,000 కోట్ల పైన ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్లకోసం కాలేజీలకు వెళ్తే యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాలేదని సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో చాలామంది తమ సర్టిఫికెట్లను తీసుకెళ్లలేకపోతున్నారు. తప్పనిసరి అవసరం ఉంటే ఫీజు చెల్లించి తీసుకెళ్తున్నారు. మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాక, ఫీజులు వసూలుకాక యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వడంలోనూ జాప్యం చేస్తున్నాయి. కాలేజీ మేనేజ్‌మెంట్లు రెండు, మూడుసార్లు కళాశాలలు బంద్ చేస్తే ఇదిగో విడుదల అదిగో విడుదల అంటూ ప్రభుత్వం చర్చలతో కాలయాపన చేసి ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతోంది.

పేద పిల్లలకు సైతం కార్పొరేట్ విద్య దక్కాలనే సదాశయంతో ప్రభుత్వం 'బెస్ట్ అవైలబుల్ స్కూల్' పథకం అమలు చేస్తోంది. ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన విద్యార్థులను లాటరీ విధానంలో ఎంపికచేసి ప్రైవేటు పాఠశాలలో ప్రవేశం కల్పిస్తున్నారు. వారి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే ఈ పథకం కింద రాష్ట్రంలో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు బకాయిలు రాక యాజమాన్యాలు విద్యార్థులను తరగతులకు రానివ్వడం లేదు. రాష్ట్రంలో 238 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉండగా వాటిలో సుమారు 7వేల మంది ఎస్‌టి, 23వేల మంది ఎస్‌సి విద్యార్థులు చదువుకుంటున్నారు. డే స్కాలర్స్ స్టూడెంట్స్ కి ఏటా రూ.28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.42వేల చొప్పున ఆయా స్కూల్స్‌కి ప్రభుత్వం ఫీజులు చెల్లించాలి. అయితే 2023–24 నుంచి ఇప్పటివరకూ ఈ స్కీం కింద చెల్లించాల్సిన స్టూడెంట్స్ ఫీజులు ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.180 కోట్ల బకాయిలు పేరుకు పోయాయని బిఎఎస్ స్కీం కింద ఉన్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య కమిటీల వారు తెలుపుతూ దీనిపై ఇటీవల కమిటీ సభ్యులు మీటింగ్ పెట్టుకొని స్టూడెంట్స్‌ని పాఠశాలకు అనుమతించకూడదని నిర్ణయించాయి. ఈ మేరకు అన్ని స్కూల్స్ తరపున ఒకేసారి పేరెంట్స్‌కి లెటర్స్ పంపించి ఇప్పటికీ దసరా సెలవులు తర్వాత పాఠశాలలు ప్రారంభమై అనేక రోజులు గడుస్తున్నా బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లోకి యాజమాన్యాలు పాఠశాలలకు వస్తున్న విద్యార్థులను రానివ్వడం లేదు.



ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలను ఎప్పటికప్పుడు విడుదల చేస్తే ప్రభుత్వానికి ఇన్ని కోట్ల బకాయిలు ఉండేవి కావు. ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదలలో ప్రతి సెమిస్టర్‌కి ముందే నిధులు విడుదలయ్యేలా పద్ధతి రూపొందిస్తే విద్యార్థులు, కళాశాలలు రెండింటికీ న్యాయం జరుగుతుంది. పాఠశాలల్లో విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీంతో చదివేవారికి ప్రతి విద్యా సంవత్సరం పూర్తయ్యేలోపు బకాయిలు విడుదల చేసేలా ప్రణాళికలు చేసి పథకాల అమలు తీరులో పారదర్శకత, సమయపాలన, బాధ్యతాయుత వ్యవస్థ అవసరం. ప్రభుత్వాలు విద్యార్థులపై పెట్టే ఖర్చు ఎప్పటికీ వృథా కాదు. చదువుకున్న యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యమవుతుందనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తుపెట్టుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ విధానాల పరిపాలన పై ఆధారపడి ఉంది. కాబట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ బకాయిల విడుదల కేవలం తాత్కాలిక ఉపశమనం కాకుండా, దీర్ఘకాలిక ఇబ్బందులు లేకుండా ప్రతి బడ్జెట్ లో నిధులు కేటాయించి బకాయిలు విడుదల చేయాలి. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి విద్యార్థుల బంగారు భవిష్యత్తు వారి చదువులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలి.

# సుప్రీంకోర్టులో బిసిలకు న్యాయం చేకూరేనా?



**ఉజ్జిని రత్నాకర్ రావు**
9490952646

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చలను, వాదోపవాదాలను పరిశీలించినట్లయితే రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి లేదనే అనిపిస్తుంది. రాష్ట్ర అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూచేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని బలపరుస్తూ వచ్చినా బిఆర్‌ఎస్, బిజెపిలు.. బిసి రిజర్వేషన్ల పెంపుకు సహకరించాల్సింది పోయి అక్కసుతో అడుగడుగునా అడ్డుకుంటున్నాయి. కులగణన సర్వే మొదలు, హైకోర్టులో స్టే వరకు మొత్తం ప్రక్రియ లో ఈ రెండు పార్టీలు కూడబలుక్కొని బిసిలకు అన్యాయం చేస్తున్నాయి. అసెంబ్లీలో ఆమోదించిన రిజర్వేషన్ల పెంపుబిల్లుకు చట్టబద్ధత కల్పించాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొక్కి పెట్టింది. రాష్ట్ర బిజెపి నేతలు పేద ముస్లింలను నెపంగా చూపిస్తూ బిల్లును అడ్డుకుంటున్నారు. నేడు హైకోర్టు తీర్పుతో విభిన్న వాదనలతో రాష్ట్ర కాంగ్రెస్ అందుకు బాధ్యత వహించాలని విమర్శలను గుప్పిస్తున్నారు... స్థానిక ఎన్నికల్లో 42శాతం బిసి రిజర్వేషన్ల కోసం తెచ్చిన జీవో 9 పై హైకోర్టు స్టే మంజూరు చేసింది. దానితోపాటు జీవో 41, 42 ల పై కూడా స్టే ని హైకోర్టు మంజూరు చేసింది. రాష్ట్ర హైకోర్టు తన తీర్పులో స్పష్టంగా 50 శాతం రిజర్వేషన్ మించకుండా ఎన్నికలు జరుపుకోవచ్చని పేర్కొంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

**ఖచ్చితంగా బిసిలకు న్యాయం చేస్తాం–కాంగ్రెస్ :**

సామాజిక న్యాయంకోసం 'ఎవరెంతో వారికంత న్యాయం' అని సిద్ధాంతానికి కట్టుబడి కాంగ్రెస్ జనాభాపరంగా 85 శాతానికి పైగా ఉన్న బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 'కామారెడ్డి బిసి డిక్లరేషన్' పేరుతో బిసి జనాభాకు అనుగుణంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగానే కులగణన చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచింది. దీంతో దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పై ఒత్తిడి రావడంతో జాతీయ స్థాయి లో కులగణన చేపట్టడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ప్రకటించింది.

**సర్వే నివేదిక ఆధారంగా బిసి లకు 42శాతం రిజర్వేషన్లు:**

రాష్ట్ర కేబినెట్ ఏకగ్రీవ తీర్మానం మేరకు సమగ్ర సాంఘిక, ఆర్థిక సర్వే రాష్ట్రంలో 60 రోజులపాటు జరిగిందని ఆ సర్వే నివేదికను ఆధారంగా చేసుకుని 42 శాతం బిసిలకు రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర అసెంబ్లీ 17, మార్చి 2025 రోజున ఏకగ్రీవంగా ఆమోదించిందని, అది గవర్నర్‌కు 22 మార్చి 2025 రోజున ఆమోదం కోసం పంపించారు. కానీ గవర్నర్ ఆ బిల్లును ఆమోదించకుండా కేంద్రానికి అంటే రాష్ట్రపతికి పంపించారు. ఆరుమాసాలు పైగా పెండింగ్‌లోనే ఉంది.

ఆరు మాసాలకు పైగా పెండింగ్‌లో ఉన్నందున 'గవర్నర్ వర్సెస్ తమిళనాడు' కేసును ఉదహరిస్తూ అదే విధంగా సెక్షన్ 285ఎని సవరిస్తూ 1.07.2025న ఆర్డినెన్స్ ప్రభుత్వం జారీ చేసిన తర్వాత డేటాని పరిగణలోనికి తీసుకొని 26.9.2025 న బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఎంఎస్ నెంబర్లు 9,41,42 లని జారీ చేసింది.

**జిఒలపై స్టే విధించిన హైకోర్టు :**

ఈ జిఒల ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తూ జారీచేసిన జిఒలను చాలెంజ్ చేస్తూ రెడ్డి జాగృతి సంస్థ హైకోర్టులో ఛాలెంజ్ చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతోపాటు అనేక బిసి సంఘాలు ఈ కేసులో ఇంప్లీడ్ అయినవి. దీనిపై అక్టోబర్ 8, 9 తేదీలలో ప్రభుత్వ, ప్రతివాదుల వాదనలు సుదీర్ఘంగా విన్న హైకోర్టు ధర్మాసనం.. 42 శాతం రిజర్వేషన్లపై ఇచ్చిన జిఒల అమలుపై స్టే విధించింది.

**సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ :**

రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగానైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థలలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్ తోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సిఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నందున హైకోర్టు ఇచ్చిన తీర్పులో ప్రతి అంశాన్ని పరిశీలించి, బిసి రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ 9ను నిలిపివేస్తూ హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులపై న్యాయ నిపుణులతో చర్చలు జరిపారు. ప్రధానంగా హైకోర్టు తమ వాదనలు పూర్తిగా వినకుండానే స్టే విధించిందనే అంశంతోనే.. బిసి రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. ఇందులో రాష్ట్రంలో సమగ్రంగా ఒబిసిల వివరాలను సేకరించాం. అందుకు ప్రత్యేకంగా డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేశాం. కమిషన్ అధ్యయనం తర్వాత రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాం. కులగణన సర్వే ప్రకారం రాష్ట్రంలో 56 శాతానికి పైగా బిసిలు ఉన్నారని' తెలింది. జనాభా నిష్పత్తి ప్రకారమే వారికి 42శాతం కేటాయించాలని నిర్ణయించాం. కానీ హైకోర్టు స్టే ఇవ్వడం అత్యంత బాధాకరం. సుప్రీంకోర్టులో సానుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నాం. సుదీర్ఘ చర్చలు పరిశీలన తర్వాత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ తెలిపారు.

**రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో రిలీఫ్ వచ్చేనా?**

రిజర్వేషన్లపై ఇచ్చిన స్టేను సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. సుప్రీంకోర్టులో ఏమైనా రిలీఫ్ (ఉపశమనం) వస్తుందా అనే విషయంలో న్యాయ నిపుణులకు విభిన్న అనుమానాలతో ఉన్నారు. హైకోర్టు తమ వాదనలు పూర్తిగా వినలేదని సుప్రీంకోర్టులో మాకు రిలీఫ్ వస్తుందని ప్రభుత్వం భావిస్తుంది! ఏదిఏమైనా, ఈ జిఒ కోర్టులో నిలిచే అవకాశం ఉందని ప్రభుత్వం భరోసాతో ఉంది! బిసిల రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకునే ప్రయత్నమా? అన్ని రాజకీయ పక్షాలు బిసిలకు రిజర్వేషన్లు కావాలని కోరుకుంటున్నాయా? దీనిపై అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే విధంగా ఉన్నవి?

**రిజర్వేషన్ల సాధనకై తెలంగాణ బిసి జెఎసి:**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ఎన్నికలకు నామినేషన్లు వేస్తున్న సందర్భంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని అన్ని బిసిల సంఘాలు, కుల సంఘాలు ఐక్యమై రిజర్వేషన్ల సాధనకు 'తెలంగాణ బిసి జెఎసి' ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా రాష్ట్రంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు వేస్తూ ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు.'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో మొదటి కార్యాచరణగా అక్టోబర్ 18న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు.

రాష్ట్ర బంద్ కు సహకరించాలని అన్ని రాజకీయ పార్టీలకు, సంస్థలకు, ఉద్యోగ కార్మిక సంఘాలకు, విద్యార్థి యువజన సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికీ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, టిజెఎస్ తదితర పార్టీలు మద్దతు తెలిపారు. తెలంగాణ బిసి జెఎసి తరఫున చేపడుతున్న రాష్ట్ర బంద్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగానైతే చేపట్టామో.. అంతకన్నా ఎక్కువగా బిసి ఉద్యమాన్ని నడిపిస్తామని జెసి చైర్మన్ ఎంపి ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు.

రాష్ట్ర హైకోర్టు తీర్పు.. రాష్ట్రంలో బిసిలను ఐక్యం చేస్తూ ఉద్యమానికి శ్రీకారం చుట్టే విధంగా ప్రోత్సహించినట్లయింది.

## లేఖ

## డేటా సెంటర్లపై అక్కడ తీవ్ర వ్యతిరేకత

అమెరికా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించి మూయించేసిన థర్మల్ విద్యుత్ కేంద్రాలు వదిలించుకోవాలని ఎన్రాన్ లాంటి కంపెనీలు తిన్నగా ఎక్కడకి వెళ్తాయో తెలుసా? మనలాంటి బీద దేశాలలో నాయకులను పట్టుకుంటారు. అయితే ఏ పార్టీ జెండా పెట్టుకోకుండా ఇక్కడి ప్రజలు సాగించిన ప్రజాపోరాటాల వల్ల మన సోంపేట, కాకరాపల్లితో సహా ఎక్కడా ప్రభుత్వాల ఆటలు సాగలేదు. ఇప్పుడు మళ్లీ కథ మొదటికొచ్చింది. ఈసారి డేటా సెంటర్ల రూపం లో ప్రజలు అప్రమత్తం కావాలి.

యూరోప్‌లోని ఐర్లాండ్, నెదర్లాండ్స్, డెన్మార్క్ ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాలు.

ఐర్లాండ్‌లో డేటా సెంటర్ పెట్టాలని గూగుల్ ప్రయత్నం చేయగా, మా దేశ ప్రజలంతా కలిసి వాడేంత పవర్ ఒక్క మీ డేటా సెంటర్ కే ఇవ్వాలి, మా దేశంలో మీ డేటా సెంటర్ వద్దు అని తిరస్కరించింది ఐర్లాండ్ ప్రభుత్వం.

నెదర్లాండ్స్‌లో డేటా సెంటర్ పెట్టాలని మెటా ప్రయత్నం చేయగా, అక్కడి ప్రజలు వ్యతిరేకించటంతో వారి అప్లికేషన్‌ను తిరస్కరించింది నెదర్లాండ్స్ ప్రభుత్వం. అంతే కాదు, దేశంలో పెద్ద డేటా సెంటర్లు పెట్టటానికి వీలు లేదు అని ఏకంగా చట్టమే చేసింది.

డెన్మార్క్ కూడా పెద్ద డేటా సెంటర్లు పెట్టటం వలన పవర్ గ్రిడ్లు దెబ్బతినటం తప్ప ఉపయోగం తక్కువ అని అనుమతులు ఇవ్వటం లేదు.

ఇక గూగుల్ లాటిన్ అమెరికా దేశాలైన చిలీ,ఉరుగ్వే, మెక్సికో దేశాల్లో డేటా సెంటర్ పెట్టాలని ప్రయత్నించింది. ఎలాగోలా ఆ ప్రభుత్వాల నుంచి కొంత సానుకూలత వ్యక్తమైనప్పటికీ అక్కడి ప్రజలు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేయటంతో ఈ పెద్ద కంపెనీలు ముందుకు కదలలేని పరిస్థితుల్లో ఇరుక్కున్నాయి.

ఇక అమెరికాలో డేటా సెంటర్ హబ్‌గా పేరొందిన రాష్ట్రం వర్జీనియా. పవర్ గ్రిడ్‌మీద పడే లోడు, పెరిగిన కరెంట్ బిల్లులు, వాటి నుంచి నిరంతరం వచ్చే ఎమిషన్స్, శబ్దాలు, విపరీతమైన నీటి వినియోగం, అవి తీసుకునే వందల ఎకరాల భూమి, ఇవన్నీ గమనించాక వాటిలో వచ్చే ఉద్యోగాల కన్నా నష్టపోయేది ఎక్కువ అని గ్రహించిన అక్కడి ప్రజలు NIMBY (Not In My BackYard) అంటూ వాటిని వ్యతిరేకిస్తున్నారు. ఏ రాజకీయ నాయకుడు అయినా వాటికి మద్దతుగా మాట్లాడితే అక్కడి ప్రజలు ఎన్నికల్లో ఓడిస్తున్నారు. ఇప్పుడు అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ కూడా వాటిని వ్యతిరేకిస్తున్నారు. చెప్పులు, గుడ్డలు కూడా ఇక్కడే తయారు చేయాలని, విదేశాల్లో ఇన్వెస్ట్ చేయటానికి వీలులేదని రోజూ గొడవ చేసే ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు కూడా వీటి విషయంలో మాత్రం ఏమీ అనటం లేదు.

ఆ దేశాల్లో అవసరాన్ని మించి కరెంట్ ఉత్పత్తి అవుతుంది. అంటే power surplus ఉన్న దేశాలు అవి. మన మీద నీటి వనరులు ఎక్కువ. అయినా సరే డేటా సెంటర్లు పెట్టటానికి ఒప్పుకోకపోవటంతో ఈ పెద్ద కంపెనీలు సముద్రం ఒడ్డున ఉండే third world దేశాలవైపు చూస్తున్నాయి. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలు తమ e wasteను ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాల్లో డంప్‌చేస్తూ ఉంటాయి. కొంచెం అటుఇటుగా ఈ డేటా సెంటర్లు కూడా అటువంటివే! ఇక్కడ విషాదం ఏమిటంటే మన ప్రభుత్వాలు వారు అడగని బెనిఫిట్లు కూడా ఇచ్చి, లాభనష్టాలు బేరీజు వేసే అవకాశం ప్రజలకు ఇవ్వకుండా వాటికి ఎర్ర తివాచీ పరవటం!!

**రమేష్ అడుసుమిల్లి**

## కరెంట్ షాక్‌తో ఒకరు మృతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కునారం రోడ్ వద్ద బుధవారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. నూతన ఇంటి నిర్మాణంలో నిమగ్నమై ఉన్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు.వివరాల్లోకి వెళ్తే, పట్టణానికి చెందిన వెలిచాల రమేష్ ఇటీవల తన కొత్త ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. అయితే ఇంటి క్యూరింగ్ కోసం నీళ్లు కొడుతున్న సమయంలో విద్యుత్ వైరు తగలడంతో రమేష్ కరెంట్ షాక్‌కు గురయ్యాడు.దీంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గమనించి విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రమేష్ మరణంతో స్థానికుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పురపాలక అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి



**ప్రజాపక్షం/ధర్మపురి :** పురపాలక సంఘం అభివృద్ధి లో పట్టణ ప్రజలను భాగస్వాములను చేయాలని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజాగౌడ్ అన్నారు.ధర్మపురి మున్సిపాలిటీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశ్యుద్ధ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆస్తిపన్ను బకాయిలు తదితర వాటిపై అడిగి తెలుసుకుని మున్సిపల్ అభివృద్ధికి ప్రజల తోడ్పాటు అవసరాన్ని వివరిస్తూ బకాయిలు లేకుండా చూడాలన్నారు.పురపాలక కమిషనర్ మామిల్ల శ్రీనివాసరావు, మేనేజర్ బాలె గంగాధర్ ఉన్నారు.

## గవర్నర్ అవార్డు అందుకున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత



**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడం ద్వారా వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వివిధ రంగాలలో ఘన విజయాలు సాధిస్తారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో 1991 నుండి విద్యార్థులకు విద్యా సంస్థలు ఏర్పాటు ద్వారా అత్యుత్తమ విద్యను అందించడమే కాకుండా వారిని ఉత్తమ స్థానంలో స్థిరపడేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో చాలా ప్రశంసనీయమైన విశిష్టమైన సేవలను అందిస్తున్నందుకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని చక్కగా వినియోగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు ప్రధానంగా అత్యుత్తమ అధ్యాపకులచే విద్యార్థులకు నాణ్యతమైన శిక్షణ ఇప్పిస్తూ ఘన విజయమైన వైపు పయనించే విధంగా చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అత్యుత్తమ ఉపాధ్యాయుని అవార్డు స్వీకరించడం చాలా గర్వించదగ్గ విషయమని వారు తెలిపారు. ప్రతిష్టాత్మక అవార్డు పట్ల రాజకీయ ప్రముఖులు తల్లిదండ్రులు , విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, యువజన సంఘాలు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నిక పారదర్శకంగా జరుగుతుంది

## కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతనోత్సాహం




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నిక పారదర్శకంగా జరుగుతుందని ఏఐసిసి అబ్జర్వర్ మన్నే శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా ఏఐసీసీ పిలుపు మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నూతన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష నియామకం కొరకు ఏఐసీసీ అబ్సర్వర్ మన్నె శ్రీనివాస్,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భారత దేశంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం వస్తుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,అగ్రనేత రాహులు గాంధీ, కేసీ వేణు గోపాల్ ఏఐసీసీ స్థాయిలో అధ్యక్ష పదవులను పర్యవేక్షిస్తున్నారన్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు జిల్లా అధ్యక్ష ఎన్నిక ఉంటుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తతో మాట్లాడి వారి నుండి అభిప్రాయం స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.సంఘటన్ సృజన్ అభియాన్ ముఖ్య ఉద్దేశం కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా బలపరచడమే అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ద్వారానే సమన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో విభేదాలకు తావు లేకుండా ప్రతి కార్యకర్త నాయకుని అందరి సలహాలు సూచనలు అభిప్రాయాలు తీసుకొని అధ్యక్ష ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బ్లాక్ లెవెల్ సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయం సేకరించడం జరుగుతుందన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోనే భారత్ జోడో యాత్ర విజయవంతం అయ్యిందన్నారు. దీనికి ప్రతి కార్యకర్త తమ సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, చక్రధర్ రెడ్డి, కల్లూరి చందన తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి: సిపి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** బాణసంచ విక్రయాలకు అనుమతి తప్పనిసరి ..దీపావళికి భద్రత ప్రమాణాలు పాటించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ ఆదేశించారు. ప్రజల భద్రతను దృష్టిలోపెట్టుకొని రాబోయే దీపావళికి ప్రజలందరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. అనుమతులు లేకుండ బాణసంచ దుకాణాలను ఏర్పాటు చేసి పేలుడు పదార్థాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు. బుధవారం సిపి విజయ్ కుమార్ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో పట్టణాల్లో, మండల కేంద్రాల్లో, అయా గ్రామాల్లో తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేసుకొని షాపుల యజమానులు సంబంధిత ఏసిపిల మధ్య అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసే బాణసంచ షాపుల్లో ఏలాంటి ప్రమాదం జరుగకుండ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏలాంటి అనుమతులు లేకుండ బాణసంచ దుకాణాలను ఏర్పాటు చేసిన, సరైన భద్రత ప్రమాణాలు పాటించకుండ దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు జరిపితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. దీపావళీ పండుగ పురస్కరించుకొని బాణసంచ విక్రయ దారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. బాణసంచ దుకాణాలతో ప్రజలకు ఏవైన ఇబ్బందికరంగా ఉంటే వెంటనే 100, సిద్దిపేట పోలీస్ కమిషనర్ కంట్రోల్ రూం 871266700కు కాల్ చేసి వివరాలు వెల్లడించాలన్నారు. ప్రజాల ప్రాణాలతో చెలగాట మాడవద్దని సిపి సూచించారు.

## కారు స్కూటీ ఢీ: ఒకరు మృతి



**ప్రజాపక్షం/కొండపాక:** కారు స్కూటీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని రాజీవ్ రహదారి వద్ద చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాశనగర్‌కు చెందిన మహమ్మద్ అసిఫా, మహమ్మద్ గోరిమియాలు రేషన్ బియ్యం తీసుకురావడానికి స్కూటీపై తిమ్మారెడ్డిపల్లి రోడ్డు దాటడంకోసం యుటర్న్ అవుతుండగా వెనుకాల వస్తున్న కారు స్కూటీనీ ఢీకొట్టడంతో స్కూటీపై ఉన్న ఆసిఫా, గోరెమియాలకు తీవ్ర గాయాలు కాగ వారిని అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆసిఫా మృతి చెందినది.

# ఓట్ చోరీపై భారీ ర్యాలీ




ఓట్ చోరీపై గ్రామ గ్రామన ప్రజలకు వివరించండి

పార్టీ శ్రేణులకు మంత్రి పొన్నం పిలుపు

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** దేశంలో భారతీయ జనత పార్టీ ఓట్ల చోరికి పాల్పడుతూ అన్ని రాష్ట్రల్లో అధికారంలోకి రావాలని చూస్తుందని వారి అడ్డుకోవాలంటే ప్రతి ఒక్కరు తమ ఓట్లు ఉన్నయో లేవో చూసుకోని రాబోవు ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడు ప్రజలను కొరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పట్టణంలో మంత్రి పొన్నం అధ్వర్యంలో పట్టణంలోని అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ఓట్ చోరిపై ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం పలు రాష్ట్రల్లో ఓట్ చోరికి పాల్పడుతూ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదగకుండ చూస్తుందని అన్నారు. నేడు రాహుల్‌గాంధీ ఓట్ చోరి సంఘటనలు బైట పెట్టిందని అలాగే మన తెలంగాణ రాష్ట్రంలో కూడ ప్రతి గ్రామా గ్రామాన కాంగ్రేస్ నాయకులు ఓట్ చోరిపై ప్రజలకు వివరించాలని పిలుపు నిచ్చారు. అలాగే దేశంలో నియంతృత్వ పాలన సాగుతుందని అరోపించారు. తెలుగు వాడైన హరియాన రాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి కుల వివక్షకు గురై తన సర్విస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడిన నేటికి 9 రోజులు కావస్తున్న సంబందిత అధికారి పై చర్యలు తీసుకొలేదని అందుకు తన భార్య నాభర్త మరణానికి కారకులైె వారిపై చర్యలు తీసుకునే వరకు పోస్టుమటన్ చేయనియకుండ భర్త మృతదేహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వానికి ఎందుకు సోయిలేదని అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రందాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బొల్లి శెట్టి శివయ్య , మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ చందు, తో పాటు వివిధ మండలాల పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి పరిరక్షణలో భారతదేశం:ఎంపి గడ్డం వంశీకృష్ణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రపంచ శాంతి పరిరక్షణలో భారతదేశం ముందుంటుందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం రోజున ఐక్యరాజ్యసమితి (ఎసిఎబికివ్) చైర్‌పర్సన్ శ్రీమతి జూలియానా గాస్పర్ రుయాస్, యు ఎన్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ అయినా చంద్రమౌళి రామనాథన్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఐక్యరాజ్యసమితి ఆర్థిక పరిస్థితి, ముఖ్యంగా శాంతి భద్రతా కార్యకలాపాల నిధులపై విస్తృత చర్చలు జరిగాయనీ, భారత ప్రతినిధులు ప్రపంచ శాంతి పరిరక్షణలో భారతదేశం పోషిస్తున్న కీలక పాత్రను పునరుద్ఘాటిస్తూ, ఐక్యరాజ్యసమితి వ్యవస్థల్లో పారదర్శకత, బాధ్యత, సమర్థత వంటి అంశాలపై తమ సూచనలు అందించామని, ఈ సమావేశం ద్వారా అంతర్జాతీయ ఆర్థిక, పరిపాలనా వ్యవహారాల్లో భారతదేశ స్వరాన్ని మరింత బలంగా ప్రతిధ్వనింపజేసే దిశగా మరో ముఖ్యమైన మరో అడుగు పడిందనీ తెలిపారు.



## ప్రజల సహకారంతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** ప్రజల సహకారంతోనే జగిత్యాల పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని జగిత్యాల ఎంఎల్ఏ డా.సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 36వ వార్డులో 36 లక్షలతో సీసీ డ్రైనేజీ స్లాబ్ నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరయ్యారని తెలిపారు. రేవంత్‌రెడ్డి హాయంలో రాష్ట్రంలో ఉచిత కరెంట్ సన్న బియ్యం, రేషన్‌కార్డులు ఇందిరమ్మ ఇండ్లు , ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు గిరి నాగభూషణ్ , అడువాల జ్యోతి లక్ష్మ ణ్, కమిషనర్ స్పందన, నాయకులు , మహిళలు , యూత్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## కొత్తగా ఎంపికైన డిఎస్‌పిలను అభినందించిన ఎస్‌పి



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల జిల్లాకు చెందిన అభ్యర్థులు ఇటీవల వెలువడిన గ్రూప్1 ఫలితాల్లో డీఎస్పీ హోదాకు ఎంపికైన విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతిభ లు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ని మార్యదపూర్వకంగా కలువగా ఎస్పీ వారిని శాలువాతో సన్మానించి అభినందించడం జరిగింది. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవ ఒక మహత్తరమైన బాధ్యత అని ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే నిజమైన విజయమని పేర్కోన్నారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా ఉంటూ క్రమశిక్షణతో సేవాభావంతో ప్రజలకు సేవ చేస్తు పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, ఆరిఫ్ అలీఖాన్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ కె.హైమావతి



**ప్రజాపక్షం/బెజ్జంకి:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు.బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం రాగానే ధాన్యాన్ని గన్నిల్లో నింపాలని అన్నారు.తేమ శాతం వచ్చిన దాన్యాన్ని ఎందుకు గన్నిల్లో నింపలేదని అడగడంతో ధాన్యం అన్‌లోడింగ్ మిల్లును కేటాయించలేదని సెంటర్ సిబ్బంది తెలుపడంతో తక్షనమే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా దగ్గరలోని రైస్ మిల్లులను కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని డిసిఎస్‌వోని ఫోన్ ద్వారా ఆదేశించారు.ఏఎంసి వద్ద పరిశుభ్రంగా ఉంచాలని మౌళిక సదుపాయాలను కల్పించాలని అన్నారు.ఈ సీజనన్‌లో 6 లక్షల మెట్రికట్ టన్నుల వరి దాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామని రైతులు దళారులను నమ్మి నష్టపోకుండా ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని అన్నారు.బ్యాంక్ ఖాత,ఫోన్ నెంబర్ లింకు,ఆధార్ అప్‌డేట్ చేసుకుంటే సాంకేతిక సమస్యలు రవని రైతులకు తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు.వీరి వెంట తహశీల్దార్ శ్రీకాంత్,ఎంపిడివో ప్రవీణ్,వివిధ శాఖల అధికారులు తదితరులున్నారు.

## ధాన్యాన్ని 24 గంటలలో రైస్ మిల్లులకు తరలించాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలో మద్దతు ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో వానాకాలం పంట కొనుగోలు పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ డి. వేణు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ఓపెన్ చేయాలని, ఒకే సారి ధాన్యం భారీగా రాకుండా క్రమ పద్ధతిలో వచ్చేలా చూడాలని అన్నారు. మన కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేసి 24 గంటల లోగా రైస్ మిల్లులకు తరలించి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి వేగవంతంగా జరిగేలా పటిష్ట వ్యవస్థను పౌరసరఫరాల సంస్థ సిద్ధం చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత రాకుండా చూడాలని అన్నారు. ప్రతి మండలంలో హార్వెస్టర్లతో వ్యవసాయ విస్తరణ అధికారులు సమావేశం నిర్వహించి వరి కోతల సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. నవంబర్ చివరి వరకు పెద్దపల్లి జిల్లాలో 2 లక్షల పైగా మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేలా కార్యాచరణ ఉండాలని అన్నారు.నవంబర్ నెలలో ప్రతిరోజు మన పెద్దపల్లి జిల్లాలో 10 నుంచి 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అకాల వర్షాలు కురిసే సమయంలో టార్ఫాలిన్ కవర్లతో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ సిపిఆర్‌పై అవగాహన ఉండాలి


కలెక్టర్ పమేల సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** గుండెపోటు సమయంలో అవలంభించవలిసిన సిపిఆర్ పద్ధతిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈ నెల 13 నుండి 17 వరకు సిపిఆర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ నిర్వహిస్తున్నారు. బుధవారంశిక్షణ కార్యక్రమానికి హజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుండెపోటు సంభవించిన సమయంలో మొదటి కొన్ని సెకండ్లు వృధా చేయోద్దని అన్నారు. ఈ సమయంలో సిపిఆర్ చేసినట్లయితే ప్రాణాన్ని రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో వయస్సుతో నిమిత్తం లేకుండా గుండెపోటు సంభవిస్తుందని అందువల్ల ప్రతి ఇంట్లోనూ కుటుంబ సభ్యులకు సిపిఆర్‌పై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అడిషనల్ డిఎంఈ తక్యుద్దీన్ ఖాన్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సూపరిండెంటెండ్ వీరా రెడ్డి, ఆర్ఎంవో నవీన, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా మధ్యాహ్న భోజనం





మెనూ పట్టింపు లేదు...

అధికారుల భయమూ లేదు..

విద్యార్థులకు నాణ్యతలేని భోజనం..

ఉద్యోగి సస్పెండ్ అయినా తీరుమారట్లే...


**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కామన్ మెనూ తప్పనిసరిగా పాటించి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాల్సిన ఉపాధ్యాయులు,పట్టింపు లేకుండా విద్యార్థులకు నాణ్యత లేని భోజనం అందించి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జిల్లాలో కలెక్టర్ పర్యటించి మెనూ పాటించలేదని ఒక ఉపాధ్యాయురాలును సస్పెండ్ చేసినా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల తీరు మారటం లేదు. సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామంలోని ప్రైమరీ,ఉన్నత పాఠశాలలో నామమాత్రంగా మెనూ పాటిస్తూ విద్యార్థులకు నాణ్యతలేని మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని,మెస్ చార్జీలు రాక మూడు నెలలు అవుతుందని మధ్యాహ్న భోజనాన్ని వండే వారు సమాధానమిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనంలో కొన్ని సార్లు నీళ్ల చారు,నాసిరకం గుడ్లు,ముక్కిపోయిన పప్పులు వినియోగిస్తున్నారని అవి తినలేక పోతున్నామని విద్యార్థులు ఆవేధన వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్ ఉన్నప్పటికీ ఎండలో నిలబెట్టి భోజనం వడ్డిస్తున్నారని,డైనింగ్ హాలును స్టోర్‌రూంగా మార్చినట్లు ఆరోపణలున్నాయి. ఉపాధ్యాయులను వివరణ కోరగా ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేవారు అకడమిక్ ప్రారంభం నుండే లేరని ప్రైమరీ పాఠశాలలో వండేవారితోనే సర్దుకుపోతున్నామని అన్నారు. కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా జిల్లాలో పర్యటిస్తూ విద్యార్థుల బాగోగులు చూసుకుంటున్నా కొన్ని పాఠశాలల తీరు మారకపోవడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

అదనపు కలెక్టర్ డి.వేణు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యల పై ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బనావత్ వనజ తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు,గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం,ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, హాస్టల్స్ (ప్రభుత్వ, ప్రైవేట్) లలో విద్యార్థుల అలవాట్లను పర్యవేక్షించాలని, విద్యా సంస్థల పరిసర ప్రాంతాలలో ఎక్కడ డ్రగ్స్, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు రాకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల పై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## షీటీం సేవలు వినియోగించుకోవాలి

కెరీమెరి ఎస్ఐ మధుకర్

**ప్రజాపక్షం/కేరిమేరి:** విద్యార్థినులు, మహిళలు ఎలాంటి వేధింపులు, చీటింగ్, సైబర్ మోసాలు వంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా డయల్ 100కు, లేదా షీ టీం హెల్ప్‌లైన్ నెంబరుకు వెంటనే సంప్రదించాలని కెరీమెరి ఎస్ఐ మధుకర్ సూచించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేరిమేరి కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో బుధవారం నిర్వహించిన షీ టీం అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలు, విద్యార్థినుల భద్రతషీ టీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. షీ టీం మహిళా సురక్షణ కోసం రద్దీ ప్రాంతాలు, పాఠశాల, కళాశాలలు, తదితర అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షణ చేస్తుందన్నారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని షీ టీం ఇన్‌చార్జి ఎస్ఐ బిక్కాలాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, షీ టీం సభ్యులు స్వప్న, రజిని, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కొనుగోలు కేంద్రాన్ని డీసీఓ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ దళారులను మోసపోవద్దని రైతులు కల్లాల వద్దకే తమ ధాన్యాన్ని ఎండబోయాలని సూచించారు. రైతులు తెచ్చిన వారి ధాన్యాన్ని వెనువెంటనే తూకం వేయాలన్నారు. వరి ధాన్యం గ్రేడ్ ఎ కు 2389 లు, కామన్ వరి ధాన్యానికి 2369లు, ప్రభుత్వం చెల్లిస్తుందని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బూరోల్ల అశోక్, స్పెషల్ ఆఫీసర్ స్వప్న, వెంకటేశ్వర్‌రావు, ఎక్స్ సర్పంచ్ రాజు, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

## గుండా మల్లేష్‌కు సిపిఐ నివాళి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా సిపిఐ సమితి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ ఐదవ వర్ధంతిని బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాష్, సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ పాల్గొని గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.ఎన్.రెడ్డి, పెయింటర్ యూనియన్ భైంసా ఉపాధ్యక్షుడు జావేద్, డిహెచ్‌పిఎస్ నిర్మల్ జిల్లా కన్వీనర్ అనంతరావు, బిసి సంఘం నాయకులు అనుముల భాస్కర్ గౌడ్, నారాయణ గౌడ్, ఇందూర్ రాజన్న, సివిల్ సప్లై కార్మికులు పాల్గొన్నారు.

## మల్లూరులో జోనల్ ఖోఖో పోటీలు



**ప్రజాపక్షం/పిట్లం :** కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని మల్లూర్ గ్రామంలో జోనల్ ఖోఖో పోటీలను మల్లూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాలకు సంబందించిన అండర్ 14, అండర్ 17 కేటగిరిలలో బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు మల్లూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న మల్లూరు ఉపాధ్యాయులు పిడిఎన్ రాజు, జావీద్, సంజీవ్, సంతోష్, సాయిలు, ధర్మేంధర్, ప్రియాంక, అన్నపూర్ణ, రాజు, లాల్‌సింగ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి దుర్గమ్మ దర్శనం

60 రోజులపాటు ఆలయం మూసివేత



**ప్రజాపక్షం/పాపన్నపేట :** మంజీరా నది ప్రవాహంతో ఏడుపాయల ఆలయానికి భారీనష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సింగూర్ నుండి విడుదలైన నీటితో మంజీరా నది ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఆలయం మూసివేశారు. ఆగస్టు 14వ తేదీ నుండి నేటి వరకు సుమారు 60 రోజుల పాటు ఆలయం మూసి వేసి రాజగోపురం వద్ద ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కలిగించారు. విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలలో ఆలయం మూసి ఉండడంతో భక్తుల సంఖ్య తగ్గిపోవడంతో ఆలయానికి వచ్చే ఆదాయానికి గండి పడింది. దానికి తోడు మంజీర ప్రవాహానికి ప్రసాద కౌంటర్.. క్యూలైన్ కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు, క్యూలైన్ బారికేడ్లు, ఆలయ గ్రిల్స్, టైల్స్, ధ్వజస్తంభ తొడుగు పూర్తిగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. రెండు రోజుల నుండి మంజీరా ప్రభావం తగ్గడంతో సిబ్బంది శుభ్రత పనులు చేపట్టారు. తాత్కాలిక పనులు చేయించి శుక్రవారం నుంచి అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

## తండ్రిని హత్య చేసిన మైనర్ కుమారుడు అరెస్టు

ఎస్పి జానకి షర్మిల వెల్లడి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** తానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్వీ గ్రామ శివారులో తండ్రిని హత్యచేసి మృతదేహాన్ని దాచిన ఘటన వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు అధికారి డా.జి.జానకి షర్మిల కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్ నేతృత్వంలో పోలీసులు వేగవంతంగా దర్యాప్తు చేసి మైనర్ నిందితుడిని పట్టుకున్నారు. కొంత కాలంగా కుటుంబ విషయాలలో తండ్రి మందలింపులు, చదువులో విఫలం కావడం వల్ల మనస్థాపానికి గురై, తన తండ్రి వన్నెవడ్ లక్ష్మణ్‌ను ఆగస్టు 31 రాత్రి చేసులో గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఆ బాలుడు తన తండ్రిని చంపింది నేనే అని పోలీసుల సమక్షంల నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ పంచనామా ప్రక్రియను చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్, తానూర్ జి.మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా, మొగిలి గ్రామానికి చెందిన పంచలింగ్ సాయినాథ్, ముకొలు దర్శన్ హాజరయ్యారు. తానూర్ పోలీసు స్టేషన్ వారు ఈ కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడు మైనర్ కాబట్టి చైల్డ్ జస్టిస్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ ఎస్ఐలు అశోక్, పెర్సిస్, నరేష్, జుబేర్, కానిస్టేబుల్లు చౌహాన్ కృష్ణ శ్రావణ్‌లను ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

### బాధితులకు సత్వర న్యాయం జరిగాలి

**భైంసా :** భైంసా పట్టణంలో జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 9 మంది అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా ఏర్పాట్లు

కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి





**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా జరిగేలా విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మంత్రుల దృష్టికి తెచ్చారు. ఈసారి ఖరీఫ్‌లో 4.37 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారని, 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో ధాన్యం దిగుబడులు వస్తున్నందున ఇప్పటికే జిల్లాలో 274 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని ఈ కేంద్రాలలో ధాన్యం సేకరణ జరిపేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత సీజన్‌లో 606 కేంద్రాలుండగా, ఈసారి 676 కేంద్రాలను నెలకొల్పుతున్నామన్నారు. రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, రైతులు ధాన్యం విక్రయించిన 24 గంటలలోపే ట్యాబ్ ఎంట్రీ జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. కాగా జిల్లాకు 1582 అదనపు టార్పాలిన్లు కేటాయించాలని కలెక్టర్ కోరారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డిఆర్‌డిఒ సాయగౌడ, డిఎస్ఒ అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి గోవిందు, డిసిఒ శ్రీనివాస్, ఉమామహేశ్వర్‌రావు, మార్కెటింగ్ ఎడి గంగవ్వ, తూనికలు, కొలతల అధికారి సుజాత్ అలీ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### నిర్ణీత గడువులోపు నిర్మాణాలు పూర్తి

ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. మాధవనగర్ వద్ద ఖిల్లా రోడ్డును ఆనుకుని ఆధునాతన సదుపాయాలతో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయ భవనాన్ని 80 క్వార్టర్స్ కలెక్టరేట్ పక్కన నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆర్‌ఓబీ పనులు మందకొడిగా సాగుతుండటాన్ని గమనించి తక్షణమే అప్రోచ్ రోడ్డు, సర్వీస్ రోడ్ల పనులు జరిపించాలని, ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు అన్నివసతులతో అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా పను లు జరిపించాలన్నారు. నాగారం 80క్వార్టర్స్, న్యూకలెక్టరేట్‌కు ఆనుకుని నిర్మించిన రెండు పడగ గదుల ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు వీలుగా అవసరమైన పనులను తక్షణమే జరిపించాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, హౌసింగ్ డిఇ నివర్తి, తహసీల్దార్ బాలరాజు ఉన్నారు.

## బాల్య వివాహాల రహిత జిల్లాగా పేరు తేవాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** బాల్యవివాహాలు లేని జిల్లాగా పేరుతెచ్చేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలో దేవాలయాల్లో, మసీదులలో, చర్చ్‌లలో బాల్య వివాహాలు జరగకుండా ఏర్పాటు చేసే పోస్టర్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుంగా ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శాఖ అధికారి హేమభార్గవి, విజన్ సంస్థ డైరెక్టర్ వంగరీ కైలాస్, సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజు, సిబ్బంది యాదగిరి, సంజీవ్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/హాజీపూర్ :** ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు 2 వందల 16 కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా చేపడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనులు మందకొడిగా సాగుతుండటాన్ని గమనించిన కలెక్టర్ సకాలంలో పనులు పూర్తి చేసేలా ఇంజనీరింగ్, సంబంధిత అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల చోరీ, దొంగ పాస్ పోర్టుల సూత్రధారి బిఆర్ఎస్సే

నిజామాబాద్ ఎంపి అరవింద్




ప్రజాపక్షం/నిజామాబాద్ : రాష్ట్రంలో దొంగ ఓట్లు, దొంగ పాస్ పోర్టులకు ప్రధాన సూత్రధారి బిఆర్ఎస్ పార్టీ నేనని ఎంపి ధర్మపురి అరవింద్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపి ధర్మపురి అరవింద్ మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ, దొంగ ఓట్ల నమోదు జరిగిందని కెటిఆర్ అనటం హాస్యస్పదంగా ఉందని, రాష్ట్రంలో దొంగ ఓట్ల సంస్కృతి తెచ్చిందే బిఆర్ఎస్ పార్టీ అని ఎంపి అరవింద్ దుయ్యబట్టారు. బంగ్లాదేశ్, మయన్మార్ దేశ స్తులకు గతంలో ఆశ్రయం ఇచ్చింది బిఆర్ఎస్ పార్టీనేనని ఎంపి ఆరోపించారు. 42 శాతం బిసి రిజర్వేషన్ అంశంలో కాంగ్రెస్ పార్టీ డ్రామాలాడుతుందన్నారు. 42 శాతం అమలు ప్రాసెస్ కాంగ్రెస్ సరిగా చేయలేదు కానీ, ఈ అంశంలో బిజెపిని బద్నాం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. జిల్లాలో ఇటీవల సిఎం పర్యటనతో ఒరిగిందేమి లేదని, జిల్లాలో ఆర్‌ఓబిల నిధులు వెంటనే చేయకపోతే నిరాహార దీక్ష చేపడుతానని హెచ్చరించారు. పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ వాస్తవాలు తెలుసుకోకుండా ఆర్‌ఓబి పనులపై మాట్లాడవద్దని సూచించారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో విషాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నం

భర్త మృతి, భార్య, పెద్దకొడుకు పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో విషాదకర సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య కు యత్నించిన ఘటన కలకలం సృష్టించింది. కుటుంబ కలహాల కారణంగా తరచూ గొడవలు పడే ఆ కుటుంబానికి చెందిన ముగ్గురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వీరిలో భర్త దాసరి కిషన్ మృతి చెందగా, భార్య నాగమణి, వీరి పెద్ద కుమారుడు వంశీ ప్రస్తుతం హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు సంబంధిత రెండవ టౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. శివాజీనగర్‌లో నివాసముండే దాసరి కిషన్, నాగమణి దంపతులకు దాసరి వంశీ, దాసరి బాలకృష్ణ ఇద్దరు కుమారులున్నారు. వీరిలో ఒక కుమారుడికి వివాహం కాగా, మరో కుమారుడి వివాహం విషయంలో కుటుంబ సభ్యుల మధ్య ఇంట్లో తరచుగా గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మంగళవారం తల్లితండ్రితో పాటు పెద్ద కుమారుడు మధ్య గొడవ జరగగా తాను ఆత్మహత్య చేసుకుంటానని పెద్ద కుమారుడు వంశీ పురుగుల మందు తాగాడు. అక్కడే ఉన్న తండ్రి కిషన్‌తో పాటు తల్లి నాగమణి సైతం కొడుకు చేతిలోంచి పురుగుల మందు డబ్బా లాక్కొని తాగారు. రాత్రి సమయంలో వారి బంధువులు వచ్చి చూడగా పురుగుల మందు తాగి ముగ్గురు అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. గమనించిన వారు వెంటనే అంబులెన్స్‌కు సమాచారమందించారు. కాగా దాసరి కిషన్ (68) అప్పటికే మరణించగా, ఆయన భార్య దాసరి నాగమణి, పెద్ద కుమారుడు దాసరి వంశీ పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. వారి చిన్న కుమారుడు దాసరి బాలకృష్ణ ఫిర్యాదు మేరకు 2వ టౌన్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి విద్యార్థికీ అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/పటాన్‌చెరు:** ప్రతి విద్యార్థికీ అబ్దుల్ కలాం జీవితం ఆదర్శమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గల అబ్దుల్ కలాం కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే జిఎంఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రత్యేకంగా కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలోనే ఆయన కాంస్య విగ్రహాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాలను తరిమికొట్టాల్సిన గురుతర బాధ్యత విద్యార్థి లోకంపైన ఉందన్నారు.

# కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు రావొద్దు

కలెక్టర్ అభిలాష అభినవ్






**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లు చేస్తున్నామని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రుల దృష్టికి తెచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టరేట్ విసి హాలు నుంచి అధికారులతో వరి పంట కోత వివరాలపై చర్చించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. గతంలో సమస్యలు తలెత్తిన కేంద్రాల్లో లోటుపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాలలో తప్పనిసరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. తూకపు యంంత్రాలు, తేమ యంత్రాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలని, టార్పలిన్‌లు, గన్నిసంచులు సరిపడు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు ఏజెన్సీలు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, లారీలు, కూలీల కొరత తలెత్తకుండా చూడాలన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్‌డిఒ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి రాజేందర్, పౌర సరఫరాల జిల్లా మేనేజరు సుధాకర్, డిఆర్‌డిఒ విజయల, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాల కార్యక్రమం విస్తృతంగా నిర్వహించాలి

**నిర్మల్ టౌన్ :** పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ల కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం తన ఛాంబర్‌లో అవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ నుండి నెల రోజులపాటు జిల్లాలోని అన్ని మండలాల్లో గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాల కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. పశువులకు ఉచితంగా టీకాలు వేసి వ్యాధి వ్యాప్తిని అరికట్టడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యమని పేర్కొన్నా రు. ప్రతి గ్రామంలో ప్రత్యేక పశువైద్య బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి పశువులకు టీకాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గాలికుంటు వ్యాధి నిర్మూలనకు రైతులు, పశు యజమానులు 0ఈ కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్, సహాయ పశువైద్యాధికారి బాలిక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ


## శివం దూబేకు ఏమైంది?



టీమిండియా ఆల్‌రౌండర్ శివం దూబే తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా టూరుకు రెండు వారాల ముందు అతనికి వెన్ను నొప్పి వచ్చినట్లు ఓ మీడియా కథనం ద్వారా తెలిసింది. అక్టోబర్ 29 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే టీ20 సిరీస్‌కు భారత జట్టులో శివం దూబే ఉన్నాడు. వాస్తవానికి శివం దూబే ముంబై జట్టు తరపున రంజీలో ఆడాల్సి ఉన్నది. జమ్మూకశ్మీర్‌తో జరిగే రంజీ మ్యాచ్‌లో ఆడేందుకు కొన్ని రోజుల క్రితం దూబే జమ్మూకు వెళ్లాడు. కానీ అక్కడ ఉన్న కోల్డ్ వెదర్ వల్ల శివం దూబే ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. ప్రాక్టీస్ సమయంలో అతని వెన్ను పట్టేసినట్లు రిపోర్టు ద్వారా తెలుస్తోంది. గాయం తీవ్రం కాకముందే ముంబై జట్టు జాగ్రత్త పడింది. దీంతో అతను మంగళవారం తిరిగి ముంబై చేరుకున్నాడు. మెడికల్ టీమ్ ఇచ్చిన సలహా మేరకు దూబే రెస్టు తీసుకోనున్నాడు. ఆసీస్ టూరుకు ప్రకటించిన 16 మంది సభ్యుల టీ20 బృందంలో శివం దూబే ఉన్నాడు. అయితే ఆ భారీ టూరుకు ముందే దూబేకు గాయం కావడం కొంత ఆందోళనకరంగా కనిపిస్తున్నది. కానీ ఆ సిరీస్ ప్రారంభం కావడానికి ముందే దూబే మళ్లీ ఫిట్ అవుతాడని ఓ మీడియా తన కథనంలో తెలిపింది. ఈ వారం చివరలోగా శివం దూబే ఫిట్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు ముంబై టీమ్ నిపుణులు చెబుతున్నారు.

## క్రిస్టియానో రోనాల్డో ఫుట్‌బాల్ చరిత్రలో.. సరికొత్త రికార్డు

ఫేమస్ ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రోనాల్డో సరికొత్త చరిత్ర సృష్టించాడు. వరల్డ్‌కప్ 2026 క్వాలిఫయింగ్ టోర్నీల్లో అత్యధిక గోల్స్ సాధించిన ప్లేయర్‌గా నిలిచాడు. పోర్చుగల్ తరపున ఆడుతున్న రోనాల్డో ఇప్పటి వరకు వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ మ్యాచుల్లో అత్యధికంగా 41 గోల్స్ చేశాడు.



లిస్బన్‌లోని ఇస్టాడియో జోష్ అల్వలేడ్ స్టేడియంలో హంగేరితో జరిగిన మ్యాచ్‌లో అతను ఈ కొత్త ఫీట్‌ను అందుకున్నాడు. అయితే పోర్చుగల్, హంగేరీ మధ్య జరిగిన వరల్డ్‌కప్ క్వాలిఫయర్ మ్యాచ్ 2–2 గోల్స్ తేడాతో డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో రోనాల్డో రెండు గోల్స్ చేశాడు. వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల చరిత్రలో గత రికార్డు గ్వాటెమాలా ప్లేయర్ కార్లో రూయిజ్ పేరిట ఉన్నది. అతను తమ దేశం తరపున క్వాలిఫయింగ్ మ్యాచుల్లో 39 గోల్స్ చేశాడు. ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేశాడు రోనాల్డో. వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ మ్యాచుల్లో 40 గోల్స్ మైలురాయి దాటిని తొలి ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోనాల్డో చరిత్ర సృష్టించాడు. అయితే ఇప్పటి వరకు కూడా పోర్చుగల్ జట్టు వచ్చే ఏడాది జరిగే ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేదు. నవంబర్ 14వ తేదీన ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌లో గెలిస్తే, రోనాల్డో జట్టు వరల్డ్‌కప్‌కు క్వాలిఫై అయ్యే అవకాశాలు ఉన్నాయి.



## జోహార్ కప్ హాకీ టోర్నీ.. చేతులు కలిపిన భారత్-పాక్ ప్లేయర్లు!

గత కొంతకాలంగా భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన విషయం తెలిసిందే. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పరిస్థితులు మరింత దిగజారిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం భారత్‌పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచులపై కనిపించింది. మ్యాచ్ ఇరుదేశాల ఆటగాళ్లు కరచాలనం చేయని విషయం తెలిసిందే. ఈ అంశంలో వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. తాజాగా భారత్‌పాకిస్తాన్ మధ్య సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్ హాకీ టోర్నీలో ఆసక్తికర ఘటన చోటు చేసుకున్నది. మంగళవారం జూనియర్ హాకీ మ్యాచ్‌కు ముందు రెండు దేశాల జాతీయ గీతాలు ఆలపించారు. ఆ తర్వాత ఇరుదేశాల ఆటగాళ్లు హైఫైవ్ చేశారు. మ్యాచ్ 3–3తో డ్రాగా ముగిసింది. ఆ తర్వాత, రెండు జట్ల ఆటగాళ్లు కరచాలనం చేస్తున్నట్లు కనిపించింది. కొన్ని వారాల కిందట జరిగిన ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో రెండు దేశాల ఆటగాళ్ల మధ్య అలాంటి దృశ్యం కనిపించని విషయం తెలిసిందే. ఆసియా కప్ క్రికెట్‌లో భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ సమయంలో భారత జట్టు పాకిస్తాన్‌తో కరచాలనం చేయడానికి నిరాకరించింది. ఆపరేషన్ సిందూర్, పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు గౌరవం ఈ నిర్ణయం తీసుకున్నట్లు బిసిసిఐ పేర్కొంది. ఫైనల్‌లో భారత దేశం పాకిస్తాన్‌ను ఓడించి ట్రోఫీని గెలుచుకుంది. ఆ సమయంలో పాక్ హోంమంత్రిగా ఉన్న ఏసీసీ చైర్మన్ మోహ్సిన్ నఖ్వీ నుంచి సైతం ట్రోఫీని తీసుకునేందుకు నిరాకరించింది. ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌తో మ్యాచులు ఆడకూడదని సైతం డిమాండ్లు వచ్చిన విషయం తెలిసిందే. ఆసియా కప్ తర్వాత, సూర్యకుమార్ యాదవ్‌ను పాకిస్తాన్ జట్టుతో కరచాలనం చేయకూడదనే విధానం భవిష్యత్తులో కొనసాగుతుందా? అని ప్రశ్నించగా.. బ్యాలెన్స్‌గా సమాధానం ఇచ్చాడు. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో తనకు తెలియదని.. తాము ఇంటర్నేషనల్ టోర్నీలో మాత్రమే పాక్‌తో ఆడుతామని.. మళ్లీ ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో చూద్దామని.. ప్రస్తుతం ఆ క్షణాలను ఆస్వాదించాలనుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం టీం ఇండియా క్రీడా స్ఫూర్తికి, జాతీయ గౌరవానికి మధ్య సమతుల్యతను కొనసాగించాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేసింది.

సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్ హాకీ టోర్నమెంట్‌లో భిన్నమైన వాతావరణం ఉంది. మ్యాచ్‌కు ముందు, పాకిస్తాన్ హాకీ సమాఖ్య తన ఆటగాళ్లను భారత ఆటగాళ్లతో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితిని, ఘర్షణల జోలికి వెళ్లకూడదని.. కేవలం ఆటపై మాత్రమే దృష్టి పెట్టాలని ఆదేశించింది. ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ భారత ఆటగాళ్లు కరచాలనం చేయకపోతే, దాన్ని విస్మరించి ముందుకు సాగాలని ఆటగాళ్లు మానసికంగా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎలాంటి భావోద్వేగ ప్రతిచర్యలు, సంజ్ఞలను చేయొద్దని సూచించామన్నారు. అయితే, మైదానంలో దీనికి విరుద్ధంగా సీన్ కనిపించిందన్నారు. ఇరుదేశాల ఆటగాళ్లు మ్యాచ్‌కు ముందు, తరువాత పరస్పర గౌరవాన్ని ఇచ్చి పుచ్చుకున్నారు. భారత్‌పాకిస్తాన్ మధ్య జరిగిన ఈ హాకీ మ్యాచ్ 3–3తో ఉత్కంఠభరితంగా డ్రా కావడమే కాకుండా.. క్రీడా స్ఫూర్తికి ఉదాహరణగా నిలిచిందని పలువురు పేర్కొంటున్నారు.



# ఫోకస్

## ఖనిజ తవ్వకాలకు ముందే..




లోహ పరిజ్ఞానం (మెటలర్జీ) పూర్తిగా అభివృద్ధి చెందని కాలంలోనే, ఉత్తర అమెరికా గ్రేట్ లేక్స్ ప్రాంతంలో ఒక అసాధారణ స్థానిక సంస్కృతి వికసించినట్టు పురవస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది సుమారు 9,500 సంవత్సరాల క్రితం అర్కాయక్ యుగానికి చెందినవిగా వారు పేర్కొంటున్నారు. అప్పట్లో ప్రజలు, మిషిగాన్ రాష్ట్రంలోని అప్పర్ పెనిన్సులా ప్రాంతాల్లో మంచు ప్రవాహాలతో భూమి మీదకు వచ్చిన దాదాపు 99 శాతం శుద్ధత కలిగిన ఖనిజాలను కనుగొన్నారు. ఈ సమాజాలు దానిని కరిగించకుండా, రాళ్ల హమ్మర్లు, మంటల ఉష్ణతతో మృదువుగా చేసి, 'కోల్డ్ వర్కింగ్' పద్ధతిలో కత్తులు, గాలాలు, ఆయుధాలు, ఆభరణాలు, పూజా వస్తువులను తయారు చేసేవారు. ఐల్ రాయల్, కీవినా పెనిన్సులా ప్రాంతాలు ప్రధాన తాపాకపు ఉత్పత్తి కేంద్రాలుగా నిలిచాయి. కాలక్రమేణా, సుమారు క్రీస్తుపూర్వం 1000 నాటికి, ఈ ఖనిజాన్ని ప్రతిష్ఠా చిహ్నంగా, ఆభరణాల రూపంలో ఉపయోగించడం ప్రారంభమైంది. దీనితో సామాజిక స్థాయిలు, అధికార వర్గాలు స్పష్టంగా పెరిగాయి. ఈ తాపాకపు వస్తువులు గ్రేట్‌లేక్స్ ప్రాంతం దాటి ఖండంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. ఓల్డ్ కాపర్ కాంప్లెక్స్ మానవుడి లోహ వినియోగ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం, వాణిజ్య సంబంధాల అభివృద్ధికి ప్రతీకగా నిలిచింది. లోహాన్ని కరిగించే ప్రక్రియలు విస్తరించకముందే ఈ వివిధ ఆకృతులను తయారు చేసే విజ్ఞానం పరిశోధకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఈ ఓల్డ్ కాపర్ కాంప్లెక్స్ అనేది ఆదిమ మానవుల లోహ పట్ల ఉన్న అవగాహన, సాంకేతిక వినూత్నత, అంతర్జాతీయ మార్పిడి అంత్యంత గొప్ప ప్రబలమైన ఉదాహరణగా నిలిచింది.

## చరిత్ర, సంగీతం మధ్య అనుబంధం!



చరిత్రకు, సంగీతానికి అవినాభావ సంబంధం ఉందని తాజా పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. పురావస్తు శాస్త్రవేత్తలు, సంగీత పరిశోధకులు సమష్టిగా రెండు విశ్వప్రసిద్ధ పురాతన సాంస్కృతిక సంప్రదాయాల మధ్య అద్భుత సంబంధాన్ని వెలికితీశారు. సైరియా (ఉగరిట్) ప్రాంతంలో 3,000 సంవత్సరాల కిందటి ఒక మట్టికప్పపై లభ్యమైన 'హైమ్ టు నిక్కల్' ప్రపంచంలో అత్యంత పురాతన సంగీత ఆనవాలు. ఈ హైమ్‌లోని తాళ, స్వర రూపాలు భారతదేశంలోని ప్రాచీన ఋగ్వేదం శ్లోకాలలో వినిపించే విధానాన్ని, అందులోని సంగీతాన్ని గుర్తు చేసే విధంగా ఉండడం ఆశ్చర్యకం. శాంటా బార్బరాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన డాన్ సి. బాసియు నేతృత్వంలో జరిగిన తాజా కంప్యూటర్ ఆధారిత అధ్యయనం ప్రకారం ఋగ్వేదంలో ప్రతి అయిదు శ్లోకాలలో ఒకటి సైరియన్ హైమ్‌లో ఉండే అదే తాళపు ముగింపుతోనే ముగుస్తుంది. దీనిని యాదృచ్ఛికమని శాస్త్రవేత్తలు భావించడం లేదు. అలాంటి అవకాశాలు పది లక్షల్లో ఒకటి మాత్రమేనని అంటున్నారు. అంతేకాదు, స్వర ప్రస్తావన కలిపినపుడు, 3 శాతం ఋగ్వేద శ్లోకాలు సైరియన్ సంగీతానికి నిలువ బంధాన్ని చూపిస్తున్నాయి. ఇవి యాదృచ్ఛికం కంటే చాలా ఎక్కువ, క్రీస్తు పూర్వం సుమారు 1400 ప్రాంతం (కాంస్య యుగ కాలం)లో ఆసియాలో సంగీతం ఒక ముఖ్యమైన సాంస్కృతిక వారధిగా విరాజిల్లిందని ఈ పరిశోధన సూచిస్తుంది. ఈ 'హైమ్ టు నిక్కల్'లో రెండు రకాల తాళపులు ఉన్నాయి. ఒక తాళం ఎంతో సరళంగా, గుండె కవాటాన్ని పోలి ఉంటుంది. రెండోది కాస్త సంక్లిష్టంగా ఉంటుంది. ఇవే ఋగ్వేదంలోనూ కనిపిస్తున్నాయి. సరళ తాళం చాలా శ్లోకాల ముగింపులో, సంక్లిష్ట తాళం త్రిష్టుభ్ ఛందస్సులో కనిపిస్తుంది. సైరియన్ గీతంలోని స్వరాల ఎత్తులు, ఋగ్వేద ఛందసులోనూ అవే శబ్ద తరంగాలు పదేపదే కనిపిస్తున్నాయి. ఈ సంప్రదాయాల మధ్య ఉన్న బంధం యాదృచ్ఛికం కాదు, శాస్త్రీయంగా నిర్ధారించబడిన సంగీత సమ్మిళితంగా పేర్కొనవచ్చు. కాంస్య యుగంలో, మితానీ రాజ్యం విరాజిల్లింది. ఇది మసాపోటామియా, భారతదేశాన్ని కలిపే ప్రదేశంలో ఉండేది. అందుకే, ఇది ప్రాచీన సామ్రాజ్యాలకు, సంగీత సంప్రదాయాలకు మధ్య వారధిగా ఉండేదని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ శాస్త్రీయ పరిశోధన ద్వారా, ప్రపంచ పురాతన నాగరికతలు ఒంటరిగా కాక, విస్తృతంగా పరస్పరం కలిసిపోయి, సంగీతాన్ని ఆధునిక జీవితానికి సంగమబంధంగా మార్చుకున్నారనే విషయం స్పష్టమవుతుంది. సంగీతం అంటే వాద్యాల రూపంలోనే కాక, అనుబంధాన్ని, సంస్కృతి మార్పిడిని చాటే తొలి భాషగానే గుర్తించాల్సి ఉంటుంది.

## ఆశ్చర్యానికి గురి చేస్తున్న కాంక్రీటు



సుమారు రెండు వేల సంవత్సరాల క్రితం, రోమన్ ఇంజనీర్లు తయారు చేసిన కాంక్రీటు ఇప్పటికీ శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. అగ్నిపర్వతం నుంచి వెలువడి, ఘనీభవించిన లావా, సున్నం, సముద్రపు నీళ్లను కలిపి ప్రత్యేకమైన మిశ్రమాన్ని రూపొందించారు. ఈ మిశ్రమం వల్ల సముద్రపర ప్రాంతాల్లో నిర్మాణాలు నీటి క్రింద కూరిగి, కాలక్రమంలో ఇంకా బలంగా మారేవి. రోమన్ కాలం నాటి కాంక్రీటులో సముద్రపు నీళ్లు, అగ్నిపర్వతం పొడితో కలిసి రసాయనిక చర్యలకు లోనై, టోబర్మొరైట్, ఫిలిప్సైట్ అనే క్రిస్టల్ సమ్మేళనాలను తయారు చేసిందని పరిశోధకులు గుర్తించారు. ఇవి కాంక్రీటు బలాన్ని పెంపొందిస్తాయి. ఇటలీలోని కొన్ని పురాతన రేవులు, పియర్లు ఇప్పటికీ ఠీవిగా నిలబడడం గమనార్హం. ఆధునిక కాంక్రీటు కొన్ని దశాబ్దాలలోనే పాడవుతుండగా, వేలాది సంవత్సరాల క్రితం నాటి కాంక్రీట్ మాత్రం స్థిరంగా ఉండడం అందరినీ అబ్బురపరుస్తున్నది. తాజా పరిశోధనల ప్రకారం రోమన్లు హాట్ మిక్సింగ్ అనే ప్రత్యేక పద్ధతిని వాడారు.



ఇందులో తక్షణ సున్నం ఉపయోగించడం వల్ల కాంక్రీటు తేమను తీసుకున్న తర్వాత కొద్దిగా బీటలు పడ్డా, అది తనను తాను మళ్లీ పునరుద్ధరించుకున్నట్టు పరిశోధకులు తేల్చారు. మొత్తం మీద రెండువేల సంవత్సరాల తర్వాత కూడా, రోమన్ ఇంజనీరింగ్ మౌలికాలు మనకు శాశ్వత నిర్మాణాలను, ప్రకృతికి మిత్రంగా ఉండే నిర్మాణ పద్ధతులను తెలుసుకునే అవకాశాన్ని అందజేస్తున్నాయి. నీటి కనుగుణంగా నిలిచి ఉండే, కాలానికి తట్టుకోగలిగే నిర్మాణాలను నిర్మించడానికి ఇవి మార్గదర్శిగా నిలుస్తున్నాయి.

## బిసికోటాకు సామాజిక ఉద్యమంగా ముందుకెళ్లాలి : సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 18న జరిగే తెలంగాణ బంద్‌కు సిపిఐ పూర్తి మద్దతు తెలుపుతుందని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సగం మాకు సగం నినాదంతో బంద్‌కు పిలుపునివ్వటం జరిగిందని ఈ తెలంగాణ బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జిఒతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద హైకోర్టు స్టే విధించటంతో, రిజర్వేషన్ల అమలు జిఒతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించటంతో రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని, ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశా రు. రాష్ట్ర ప్రభుత్వం కులగనన సర్వే నిర్వహించి బిసిలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపించినా ఆమోదించకపోవటంతో రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. బిజెపి కులతత్వ, మనువాద పార్టీ అయినందున కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని మనుధర్మ శాస్త్రాన్ని అమ లు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ మహిళలకు రావల్సిన హక్కులన్నింటిని కాలరాసుందని ధ్వజమెత్తారు. బిసిల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌ను సమావేశపర్చి ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

## బిసి ఉద్యమకారులను సమన్వయం చేసుకుని 18న బంద్‌లో పాల్గొనాలి : ఫయాజ్



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ఈనెల 18న జరగనున్న తెలంగాణ రాష్ట్రబంద్‌కు సిపిఐరాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇచ్చిందని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ అన్నారు. అందులో భాగంగానే జిల్లాలో ఉన్న బిసి సంఘాల జెఎసి ఇతర ఉద్యమ సంస్థలు 18వతేదిన నిర్వహించే బంద్‌కు జిల్లాలో కూడా జిల్లా కార్యవర్గం కౌన్సిల్ ప్రజాసంఘాల నాయకులు , మండల కార్యదర్శులు ఇతర గ్రామ పట్టణ కార్యదర్శులు పార్టీ నాయకత్వం అంతాకూడా తమ తమ మండలాల్లో ప్రాంతాల్లో ఉన్న బిసి ఉద్యమకారులతో సమన్వయం చేసుకొని 18న జరగనున్న బంద్‌కు మద్దతు ఇచ్చి పాల్గొనాలని కోరారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న బంద్‌ను విజయవంతం అయ్యేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న పార్టీ యంత్రాంగమంతా కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు.



హనుమకొండలో...



భద్రాద్రి కొత్తగూడెం ...

# బిసి రిజర్వేషన్లు అమలయ్యేదాక పోరాటం ఆగదు

### రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చకుంటే అగ్నిగుండమే : తాటిపాముల

**ప్రజాపక్షం / ఖిలా వరంగల్ :** స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరిపే దాకా ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చకుంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. బుధవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో సిపిఐ బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రాస్తారఖో,నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు ప్రసంగిస్తూ శాసనసభలో బిసి రిజర్వేషన్‌పై ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించి ఆరు నెలలు దాటిన పట్టించుకోకపోవడం బిసిలను అవమానపరచడమేనన్నారు . రాష్ట్రంలోని బిజెపి కేంద్ర మంత్రులు ఎంపిలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే శక్తి లేకపోతే రాజీనామా చేయాలన్నారు. ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీల బిసి సంఘాల ప్రతినిధులతో ప్రధానమంత్రి దగ్గరికి రాష్ట్రపతి దగ్గరికి తీసుకెళ్తానని చేసిన వాగ్ధానం ఏమైందన్నారు. జిఒ 9పై హైకోర్టులో పిటిషన్ వేసిన రెడ్డి జాగృతికి చెందిన బుట్ట మాధవరెడ్డినితో పాటు బిసి ద్రోహులకు తగిన గుణపాఠం తప్పదన్నారు. బిసి వ్యతిరేక విధానాలను విడనాడకపోతే వారికి పుట్టగతులుండవని హెచ్చరించారు. బిసిలకు బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం లభించే వరకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడి పోరాడుతామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి ప్రసంగిస్తూ రాజ్యాధికారం కోసం బిసిలు ఐక్యంగా పోరాడాలని బిసి పోరాటాలకు సిపిఐ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా నాయకులు దండు లక్ష్మ ణ్ ,గన్నారపు రమేష్, గుండె బద్రి, సంగీ ఏలేంధర్ బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలభోజు వెంకన్న, బిసి హక్కుల సాదన సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజు, సిపిఐ సమితి సభ్యులు ఎండి అక్బర్ పాషా, సుంకరి భవాని, యాకాబ్రమ చారి,దస్రు బిసి హక్కుల సాదన సమితి నాయకులు చిట్యాల సువర్ణ, పరికరాల రమేష్, నల్లతీగల కుమార్, రాజేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి బిసి వ్యతిరేక విధానాన్ని నిరసించండి : సిపిఐ,బిసి సంఘ నాయకుల పిలుపు

**హనుమకొండ :** దేశంలో జనగణనతోపాటు కుల గణన చేసి బహుజనుల యొక్క జనాభా ఆధారంగా చట్టసభల లో స్థానిక సంస్థలలో విద్యా ఉద్యోగాలలో ఉపాధి రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి కేంద్ర పాలకులపై ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని కాళోజీ నారాయణరావు సెంటర్లో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ రాస్తారోకో నిర్వహించడం జరిగినది. ఈ నిరసన రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కార్రే బిక్షపతి, రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా జీవో 9 ద్వారా తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్‌కు పంపించడం జరిగినా గవర్నర్ వివక్షతతో కేంద్రానికి పంపకుండా పెండింగ్‌లో పెట్టడాన్ని రాష్ట్ర హైకోర్టు స్టే ద్వారా బిసి రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యని ధ్వజమెత్తారు. ఈనెల 18న బిసి ఐక్య కార్యాచరణ జరిపే బంధును విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు కార్య లక్ష్మ ణ్, ఊట్కూరు రాములు, ఏదునూరి మునిగాల బిక్షపతి యేష బోయిన శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు గుంటి రాజేందర్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా అ ధ్యక్ష కార్యదర్శులు బత్తిని సదానందం, నేదునూరి రాజమౌళి, భారత్ బచావో జిల్లా అధ్యక్షులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు

### బిసి రిజర్వేషన్ బిల్లుకు మోకాలడ్డుతున్న మోదీ : సాబీర్ పాషా

**భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్రంలోని మోడి ప్రభుత్వం మోకాలు అడ్డుతోందని, రిజర్వేషన్ల అంశంపై కేంద్రం రాజకీయాలు చేయడం సరైంది కాదని, ఇలాంటి చర్యలు బిసిల పట్ల కేంద్రానికున్న వైఖరి బహిర్గతమవుతోందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ అనుబంధ బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం బిసిహెచ్ఎస్, సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపి కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ తెలంగాణ ఉభయ సభల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును ఆమోదించి ఆర్డినెన్స్ ఇవ్వకుండా మోదీ ప్రభుత్వం తొక్కిపట్టిందని ఆరోపించారు. బిసి జెఎసి తలపెట్టిన అక్టోబర్ 18 రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సిపిఐ సంపూర్ణంగా బలపరుస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్య లు కంచర్ల జమలయ్య, ఎస్ కే ఫహీమ్ జిలాల్ సమితి స భ్యులు ధీటి లక్ష్మీ పతి, భూక్యా శ్రీనివాస్, గుత్తుల సత్యనారాయణ, నాయకులు చింతాలరాజు, బోయిన విజయ్‌కుమార్ ఏ లక్ష్మీ నారాయణ, బత్తుల రమేష్, జహీర్, శ్రీను, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### బిసి రిజర్వేషన్లకు బిజెపి అడ్డు తగదు :లక్ష్మ ణ్

**మంచిర్యాల :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ రాకుండా బిజెపి అడ్డుపడటం తగదని, హైకోర్టు స్టేను వెంటనే రద్దు చేసి 42 శాతం రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు. బిసి హక్కుల సాధన సమితి, సిపిఐ ఇ చ్చిన పిలుపులో భాగంగా బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రం ఐబి చౌరస్తాలో సిపిఐ, బిసి హక్కుల సాధన సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు వనం సత్యనారాయణ, బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నరెండ్ల శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీ ఖాన్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి కుంచాల శంకరయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న తదితరులు పాల్గొన్నారు.

### బిసిలకు వ్యతిరేకంగా ఉన్న బిజెపిని గద్దె దింపాలి : పల్లా నర్సింహారెడ్డి

**దేవరకొండ:** బిసి రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ సిపిఐ కార్యాలయం నుండి ఐబి, కోర్టు, బస్టాండ్ వరకు నల్ల బ్యాడ్జిలతో నిరసన ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ముందు 167వ జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ నిరసన కార్యక్రమానికి సామాజిక కర్త, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు, సిపిఐ, బిసి హక్కుల సాధన సమితి, బిసి సంఘం నాయకులు పల్లా రంగారెడ్డి, వెంకట్రాములు, యాదయ్య, వెంకటయ్య,వెంగలయ్య, అనిత, జనార్ధన్‌రాజు, శ్రీను, యాదయ్య, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో...



దేవరకొండలో...



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సాకారం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సంగెం:** పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సాకారమైందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం హన్మకొండ భవాని నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో 17వ డివిజన్ పరిధిలో అర్హులైన 43 మందికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లను దశల వారీగా అందచేస్తామన్నారు. ఇళ్లు మంజూరైన వారు త్వరగా పూర్తి చేసుకొని బిల్లులు పొందాలన్నారు.

## సిఎంని కలిసి వరంగల్ జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి కాంతమ్మ ఇటీవల మరణించిన నేపధ్యం లో బుధవారం హన్మకొండ లోని పిజిఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన మాతృ యజ్ఞం కార్యక్రమం లో పాల్గొననుటకు గాను హన్మకొండ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల మైదానం హెలిప్యాడ్ వద్ద కు చేరుకున్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్చాన్ని అందజేసి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ డాక్టర్‌సత్యశారద.

## 'ఎనుగల్'లోబాలికా దినోత్సవం




**ప్రజాపక్షం/పర్వతగిరి:** జిల్లా సంక్షేమాధికారి రాజమణి ఆధ్వర్యంలో ఎంఈఓ గాయపు లింగారెడ్డి అధ్యక్షతన బుధవారం ఏనుగల్ జెడ్‌పిహెచ్‌ఎస్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి మాట్లాడుతూ.. బాలికల హక్కులను కాపాడటం వారి ప్రతిభను వెలుగులోకి తేవడం సమాన హక్కులతో కూడిన సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అన్నారు. పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 1098, 181, 100, 1930, 14567 కాల్ చేసి సాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జీఎస్ రమాదేవి, ఏడబ్ల్యూటీ అరుణ, ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, ఎండీ మజాహర్, కేశవులు, విజయ లక్ష్మి , నగ్షా పాల్గొనగా విద్యార్థులచే మొక్కలను నాటించారు.


## అందుబాటులో సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు

**ప్రజాపక్షం/గీసుకొండ:** జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ పథకం కింద మొత్తం 14 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు సబ్సిడీపై రైతులకు ఇవ్వడానికి గీసుకొండ మండల కేంద్రంలోని కోనాయిమాకుల రైతు వేదికలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ బాబు తెలిపారు. నేషనల్ సీడ్ కార్పోరేషన్ ద్వారా పంపిణీ చేస్తున్న ఈ ఎన్ఎస్‌సీ సీటీ 4260 అనే హైబ్రిడ్ మొక్కజొన్న రకం విత్తన మొక్క 200 నుంచి 300 సె.మీ. ముదురు ఆకుపచ్చ రంగు కలిగిన ఆకులతో తెలుపు రంగు ఆకుపచ్చ కంగి రంగు ఉంటుందని విత్తనం నారింజ పసుపు పరిపక్వత 115 నుంచి 120 రోజులు. అన్ని సీజన్లలో ఈ రకాన్ని విత్తుకోవచ్చన్నారు. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. 4 కిలోల ప్యాకింగ్ సైజుతో అందుబాటులో ఉన్న ఈ రకం ఎన్నో తెగుళ్లను తట్టుకొని చాలా అనుకూలతను కలిగిన అధిగ దిగుబడి ఇచ్చే రకం అన్నారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, ఫోన్ నంబరుతో వెంటనే మీ క్లస్టర్ ఎంఇఒను సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ బాబు తెలిపారు.

## పశువైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం : ఎంపి కావ్య

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** పశువైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం వడ్డేపల్లిలోని పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, పశు సంపద అనేది ఎంతో విలువతో కూడుకున్నదని అన్నారు.రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కల్పిస్తున్న అవకాశాలను పాడి రైతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.పశుసంవర్ధక శాఖ ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరిన్ని చేపట్టి పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశుసంవర్ధక శాఖ సమస్యలపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపి డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రాధాకృష్ణ, వైద్యులు, పాడి రైతులుపాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/కొడకండ్ల:** కొడకండ్ల మండల కేంద్రంతోపాటు మండలంలోని రామవరం గ్రామాలలో ఇందిరా కాంతి పథకం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులు పండించిన పంటలను పరిశీలించి, కొనుగోలు కేంద్రాల సదుపాయాలను సమీక్షించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రైతులు ఎవరైనా ఇబ్బంది పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి రైతు కష్టం ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, సహకార సంఘం అధ్యక్షులు, వ్యవసాయ మరియు రెవెన్యూ అధికారులు, ఐకేపీ ప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే

బిసి రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్లో చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది..
సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజు సతీష్,
బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్
సిపిఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా




**ప్రజాపక్షం/భూపాలపల్లి:**బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధత కల్పించి ఆమోదించి అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్యాతరాజు సతీష్, బిసిహక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద కమ్యూనిస్టు పార్టీ, బిసిహక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్యాతరాజు సతీష్,బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీకాంత్‌లుసంయుక్తంగా మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉందని స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జిఒతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద నిన్న హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపిప్రభుత్వమేనని,ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు,కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన, సర్వే నిర్వహించి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. బిజెపికులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్, బిసి, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. బిసిల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదవ షెడ్యూలులో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి, ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ళ తరబడి బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏ మాత్రం తగదన్నారు. ఆర్థికంగా ప్రభుత్వం వెనుకబడిన వర్గా (ఇడబ్ల్యూఎస్) రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికే దాటి పోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు.

గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరమితిలోగా ఆమోదం లభించకపోతే, నో టిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండడం వల్లనే ఈ రోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు నేరేళ్ల జోసెఫ్, గోలి లావణ్య, యాకుబ్ పాషా, షబీర్ పాషా, మట్టి కృష్ణ, వాసం రజితతో పాటు పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు చట్టబద్ధ రిజర్వేషన్లు కల్పించాలనిబిసిహక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చొప్పరి శేఖర్ పెరుగు కుమార్ డిమాండ్ చేశారు.బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేష న్లు కల్పించాలని, బిజెపి షెడ్యూల్ 9 చేర్చి చట్టబద్ధ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జి ల్లా కేంద్రంలో బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బిసిహక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చొప్పరి శేఖర్, పెరుగు కుమార్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి సర్కార్ బిసిలకు చట్టబద్ధ 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి పంపించినా ఇంతవరకు పెండింగ్‌లో ఉంచి బిజెపి సర్కార్ పట్టించుకోవడం లేదు వారు ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, కాంగ్రెస్ ఎంపిలు పార్లమెంట్లో ఉద్యమించాని అన్నారు. రాష్ట్రంలో బిజెపి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న ఇంతవరకుబిసిరిజర్వేషన్లపై పట్టించుకోవడం లేదని వెంటనేబిసిలకు చట్టబద్ధ 42% రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

**బిసిల ఆందోళనకు సిపిఐ సంఘీభావం**

బిసి హక్కుల సాధన సమితి చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సిపిఐ శ్రేణులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్ ఖచ్చితంగా కల్పించాల్సిందేనని అన్నారు. స్థానిక సంస్థల్లోనే బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి సర్కార్‌బిసిలకు చట్టబద్ధ రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వారి పెల్లి వెంకన్న, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, మంద శంకర్, తండా శ్రీనాథ్, ఎండి రఫీ, తండ మాధవి, కనకం పద్మ, పులిగుజ్జు అయిలయ్య, బోళ్ల భద్రయ్య, పులి యాకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి భేటీపై సర్వత్రా చర్చ



**ప్రజాపక్షం/నెక్కొండ:** సిఎం రేవంత్‌రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ దశదినకర్మ కార్యక్రమానికి హాజరుకావడంతో రాజకీయ చర్చలకు దాసి తీసింది. ఎక్కడ చూసినా ఈ కలయిక గురించే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఇద్దరు మధ్య అంతరాలు ఉన్నాయనే ప్రచారం సాగింది. సిఎం, స్థానిక ఎమ్మెల్యే కలవపోవడం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని గ్రామీణ స్థాయిలో చర్చనీయాంశమైంది. అయితే తాజా దొంతి రేవంత్ కలయికతో ఆ అనుమాలకు తెర పడినట్లయింది. ఈ పరిణామంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం చేకూరింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసి, జెడ్‌పిటిసి, ఎంపిపి, సర్పంచ్ స్థాయిలో పార్టీ భారీ మెజార్టీ సాధిస్తుందనే నమ్మకం కలిగిందని కార్యకర్తలు చెబుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సిఎం నిధులు సక్రమంగా అందుతాయని ఆశాభావం వ్యక్తవుతోంది. రాజకీయాల్లో శతృత్వం, మైత్రి శాశ్వతం కాదని చెప్పడానికి ఈ రేవంత్‌రెడ్డి దొంతి కలయికే ప్రత్యక్ష ఉదాహరణగా పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

## ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అలసత్వం వహించొద్దు

### అధికారులకు కలెక్టర్ ఆదేశం..మంత్రుల సూచనలు పాటించాలని హెచ్చరిక




**ప్రజాపక్షం/జనగామ:**ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో అధికారులు, ఐకెపి, పిఎసిఎస్ సెంటర్ నిర్వాహకులు ఎలాంటి అలసత్వం వహించొద్దని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అదేశించారు. గురువారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోళ్లలో పాటు రవాణ సమస్య తలెత్తకుండా చూడాలని, కేంద్రాల్లో గీన్న బ్యాగ్‌లు, ఫ్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే మిషన్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు అందుబాటులో ఉండాలన్నారు. కొనుగోళ్లలో ఇబ్బందులు ఉంటే పై అధికారులను సంప్రదించాలని, గతంలో మాదిరిగానే ఈ ఖరీఫ్‌లోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా కొనగోళ్లు జరపాలన్నారు. మిల్లర్లు సమస్య సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఎంఎస్పీ, బోనస్ అందించడానికి సిద్ధంగా ఉన్నందున నిబంధనలకు అనుగుణంగా ధాన్యం తీసుకురావాలని గ్రామాల్లో టాం..టాం వేయించాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎఫ్‌సిఐ గోదాంలతో పాటు అవసరమైతే ప్రైయివేట్ గోడాంలు వాడాలన్నారు. దేశంలోనే ఎక్కువ వరి ధాన్యం దిగుబడి అయ్యేది తెలంగాణ రాష్ట్రంలోనే అని ఇక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా కొనుగోళ్లు జరిగితే మంచిదన్నారు. ఇప్పటి వరకు పద్ధతి ప్రకారమే ధాన్యం కొనుగోళ్లు జరిపామని, ఏ రోజు ధాన్యం ఆ రోజు గోదాంలకు తరలించాలన్నారు. అధికారులు అందరు అప్రమత్తంగా ఉంటేనే ఎలాంటి సమస్య తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ప్రతి కేంద్రంలో మౌళిక వసతులు కల్పించాలని, టార్పాలిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓలు గోపిరాం, వెంకన్న, తహశీర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మార్కెటింగ్ అధజకారులు పాల్గొన్నారు.

## ప్రతీ మహిళా పోషకాహారం తీసుకోవాలి: పరకాల ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ మహిళ మంచి పోషకాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో పరకాల ఐసీడీసీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు సమాజంలో పోషణపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జయంతి, తహసీల్దారు జగన్మోహన్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాస్, డాక్టర్ స్పందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, సునీత, పద్మావతి, పుణ్యవతి, నజీమా పర్వీన్, శ్రీదేవి, రోజారాణి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ బిక్షపతి, అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## యువత చదువుతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** యువత చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని దేశ పురోగతిలో కీలకపాత్ర పోషించాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బతండాలో మహబూబాబాద్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మునుకుంట్ల యాదలక్ష్మి ఆధ్వర్యంలో ఐదవ రోజు ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం శారీరక వ్యాయామ, యోగా కార్యక్రమాలను నెల్లికుదురు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి సహకారంతో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక శిబిరాన్ని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నారాయణ సందర్శించి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక యువత కలిగిన ఏకైక దేశం భారతదేశమని, కావున భారతదేశం ఇతర దేశాలతో పోటీ పడటానికి యువత నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలని వాలంటీర్లకు సూచించారు. మత్తు పదార్థాలు, మొబైల్ ఫోన్ వాడకంతో యువత నిర్వీర్యం అవుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లను వీడి సద్గుణాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం అడ్వకేట్ అశోక్ సహకారంతో వాలంటీర్లకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రతీ పౌరుడు తన హక్కులు, బాధ్యతలు, చట్టపరమైన పరిజ్ఞానం కలిగి ఉండడం ద్వారా మాత్రమే సమాజంలో సమానత్వం, న్యాయం నెలకొంటుందని, రాజ్యాంగం మనందరికి రక్షణగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ మర్సకట్ల అనిల్‌కుమార్, మై భారత్ వరంగల్ కన్వీనర్ చింతల అన్వేష్, ఆఫీస్ సిబ్బంది సతీశ్, సమత డిగ్రీ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ తండా హరీశ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఝాన్సీ, త్రిష, నవ్య, సాగరిక, స్రవంతి, స్పందన, దివ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖకు జిపిఒలు కళ్ళలాంటివారు



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి:**రెవెన్యూ శాఖకు జిపిఒలు కళ్ళు లాంటి వారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం ఐడిఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నూతనంగా నియమితులైన జిపిఒ లకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై విధుల పట్ల జిపిఒలకు మార్గదర్శక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ విధులు అత్యంత కీలకమని, చాలా బాధ్యతాయుతమైనటువంటి జిపిఒలు గ్రామాల్లో ప్రభుత్వానికి కళ్లు, చెవులు లాంటి వారని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం వారి ప్రధాన బాధ్యతని తెలిపారు. భూముల సమస్యలు, రైతుల ఇబ్బందులు, ప్రజల అభ్యర్థనలను మొదటగా గుర్తించేది జిపిఒలేనని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టంను ప్రవేశపెట్టిందని, ప్రతి జి.పి.ఓ ఈ చట్టంపై పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 54 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలనలో జిపిఒలు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అవినీతి లేదా అక్రమాలకు పాల్పడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మన కర్తవ్యమని గుర్తుంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిపిఒలు తమ పనిని సేవా దృక్పథంతో, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వర్తిస్తే, భూ భారతి కార్యక్రమం విజయవంతమవుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్‌డిఒ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, జిపిఒలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## సంజయ్‌ని ఘనంగా సన్మానించిన మాజీ జెడ్‌పిటిసి శ్రీలత

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బుడిదంపాడు గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సంజయ్ ఇటీవల విడుదలైన గ్రూప్ వన్ ఫలితాలలో 249 ర్యాంకు సాధించి డిఎస్‌పిగా ఎంపికైన నేపథ్యంలో మంగళవారం లక్ష్మీ పురం గ్రామంలోని వారి సోదరుడు చగర్లమూడి జగదీష్ నివాసానికి వచ్చారు.మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, స్థానిక యువత వారి మిత్ర బృందం ఆయనను భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి శాలువాతో ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేశారు. తుమ్మలపల్లి సంజయ్ 249 ర్యాంక్ సాధించడం యువతకు ప్రేరణగా నిలుస్తుందని కొనియాడారు.సంజయ్ విజయం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. మాజీ వార్డు సభ్యులు పాలం దివాకర్‌రెడ్డి, స్థానిక యువత యారం పున్నారెడ్డి, కటుకూరి వెంకన్న, పాలం ప్రకాశ్ రెడ్డి, పేరం సంజీవరెడ్డి, దగ్గు శ్రీనివాస్‌రెడ్డి, దగ్గు రాజశేఖర్‌రెడ్డి, ఉమ్మలరెడ్డి బాలశేఖర్‌రెడ్డి, చగర్లమూడి జగదీష్, యారం సర్వేశ్వర్‌రెడ్డి, గోల్డ్ షాప్ సూర్య, చగర్లమూడి వెంకటేశ్వర్లు, స్థానిక యువత వారి మిత్ర బృందం పాల్గొన్నారు.

## కమ్మకట్ల నారాయణకు సిపిఐ నాయకులు నివాళి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం రామాంజవరం మాజీ ఉప సర్పంచ్ కమ్మకట్ల నారాయణ దశదినకర్మ బుధవారం జరిగాయి.సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, కార్యవర్గ సభ్యులు నోముల రవి, మాజీ ఎంపీటీసీ పాయం లక్ష్మి , దొంక రాములు, నిమ్మల భాస్కర్, మదార్ తదితరులు పాల్గొని పులమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గతంలో సిపిఐ పార్టీలో ఉప సర్పంచ్ గా పని చేశారని, పార్టీ లో యాక్టివ్ గా పనిచేశారని వారి సేవలను గుర్తు చేసుకున్నారు.

## 42 శాతం బిసి బిల్లును కేంద్రం ఆమోదించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని బిసి హక్కుల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బిసి రిజర్వేషన్ బిల్లును నిలుపుదల చేస్తూ ఇచ్చిన బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. బిసి వ్యతిరేకిగా బిజెపి వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని నర్సింహారావు స్పష్టం చేశారు. ఈనెల 18న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు.బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి , నూనె శశిధర్, నానబాల రామకృష్ణ, తాటి నిర్మల, మోహన్‌రావు, నాగేశ్వరరావు, బాబు, జ్వాలా నర్సింహారావు, ఉపేందర్, వెంకన్న, యాకయ్య, ప్రసాద్, శ్రీశైలం, రమేష్, ఆనంద్, వీరబాబు, నాగేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

## ఉచిత విద్యా శిక్షణకు దరఖాస్తులు

### డిజిఎం పర్సనల్ ఎస్. రమేష్



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి యాజమాన్యం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, యువతీ యువకులు ఉచిత విద్యా శిక్షణకై దరఖాస్తులు చేసుకోవాలని డిజిఎం పర్సనల్ ఎస్. రమేష్ కోరారు. మణుగూరు ఏరియా పివి కాలనీ నందు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు, యువతీ యువకులకు టైలరింగ్, కంప్యూటర్ డిటిపి, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్ / జ్యూట్ / బంజరా బ్యాగ్స్ / ఫొటో షాప్, మల్టీ మీడియా కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చుటకై యాజమాన్యం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఆశక్తి గల సింగరేణి కుటుంబాలు, మాజీ సింగరేణి కుటుంబాలు, మహిళలు, యువతీ యువకులు, స్థానిక, పరిసర ప్రాంత మహిళలు, యువతులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులకు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతచేసి ది. 30.10.2025లోపు, జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్మెంట్ విభాగంలో అందజేయటం దావరా ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు.

## సృజనను ఘనంగా సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలో గల పాండవుల బస్తీకి చెందిన మేక పున్నం పెద్ద కుమార్తె సజ్జన రాష్ట్ర స్థాయి అండర్ 19 పుట్ బాల్ జట్టుకు ఎంపిక అయింది. ఈసందర్భంగా బూర్గంపాడు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో మేక సృజనను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి భూపల్లి నరసింహారావు, సొసైటీ డైరెక్టర్ బొల్లు రవి, మాజీ ఎంపిటిసి జక్కం సర్వేశ్వరరావు, ఏఎంసి మాజీ డైరెక్టర్ బానోత్ శ్రీను, నాయకులు బొల్లు సాంబశివరావు, చెన్నం రవి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కేవి రమణ, తోకల శ్రీను, కొమ్ము రమణ, జక్కం శ్రీను, బర్ల సత్యనారాయణ, సోషల్ మీడియా అధ్యక్షులు గంగపురి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సిసిఐ కేంద్రాలను ప్రారంభించండి

### రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పత్తి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ ఏడాది మునుపెన్నడు లేని రీతిలో నష్టపోయారని తెలిపారు. రైతు సంఘం సమావేశం బుధవారం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ఈ ఏడాది అతివృష్టి కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎకరాకు క్వింటా, రెండు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. కనీస పెట్టుబడులు రావని వచ్చిన పత్తి కూడా వర్షాలు పడుతుండడంతో అంత నాణ్యతగా లేదని గోవిందరావు తెలిపారు. పత్తి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పరిహారాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలను సిసిఐ ఆధ్వర్యంలో ప్రారంభించాలని ఆయన సూచించారు. క్వింటాకు రూ. 10071 చొప్పున కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

# రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై నిర్లక్ష్యం వీడండి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పట్టణ గ్రామీణ రహదారులు, అంతర్గత రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని, ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే విధానాన్ని మానుకోవాలని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని ముర్రేడువాగు బ్రిడ్జీ రోడ్డులో జరుగుతున్న మరమ్మత్తు పనులను ఆయన బుధవారం మున్సిపల్, ఆర్అండ్‌బి, పోలీస్ శాఖతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గత పాలకులు హయాంలో రోడ్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతి అక్రమాల వల్లే ప్రజలకు ఈ ఇబ్బంది ఎదురైంది. నిర్మాణాల్లో నాణ్యతా లోపం కారణంగా రోడ్లు ధ్వంసం అయ్యాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల పనులు ఇతర అభివృద్ధి పనులు నాణ్యతతో కలకాలం మన్నికగా ఉండేలా నిర్మించాలన్నారు. నాణ్యతా లోపం జరిగితే అధికారులదే పూర్తి బాధ్యత అన్నారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతల విషయంలో రాజకీయాలు తగవని, సమస్య ఉంటే బాధ్యతగల పౌరులుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోస్టాఫీస్ సెంటర్ నుండి హేమచంద్రాపురం వరకు సింగరేణి ప్రధాన కార్యాలయం నుండి సింగరేణిప్రధాన ఆస్పత్రి వరకు, సింగరేణి మెయిన్ స్టోర్స్ వరకు రోడ్ల పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టబోతున్నట్లు చెప్పారు. ఇందు కోసం సింగరేణి రూ.2.80 కోట్లు నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తెస్తామని చెప్పారు. రెండో దఫా బస్టాండ్ సెంటర్ నుండి త్రిమాత ఆల యం వరకు రోడ్డు నిర్మాణం, రోడ్డు వెడల్పు బస్టాండ్ గేట్ సెంటర్లో హైమాస్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మున్సిపల్ కమీషనర్ సుజాత, ఆర్అండ్‌బి అధికారులు, నాయకులు లగడపాటి రమేష్, దేవరగట్టల రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## చివరి గింజ వరకూ కొనుగోలు

### జిల్లా కలెక్టర్ అనదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో రైతులు పండించిన చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ అనదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి వానాకాలం పంటల క నీస మద్దతు ధరపై గోడ ప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025 26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన పంటలకు సంబంధించిన మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. గ్రేడ్ ఎ ధాన్యం రకానికి రూ. 2389 లతో పాటు రూ. 500 బోనస్, సాధారణ రకం ధాన్యానికి రూ. 2369 ప్రకటించిందన్నారు. పత్తి (పొడువు గింజ) రూ. 8110, పత్తి (మధ్యస్థ గింజ) రూ. 7710, మొక్కజొన్నకు రూ.2400, కందులు రూ.8వేలు, పెసర రూ. 8768, వేరుశనగ కు రూ.7263, మినుములు రూ.7800, పొద్దుతిరుగుడు కు రూ.7721, సోయాబీన్‌కు రూ. 5328, నువ్వులకు రూ. 9846, సజ్జలు రూ. 2775, రాగులకు రూ. 4886 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులు స్థానిక మార్కెట్ యార్డులో తమ పంటలను కనీస మద్దతు ధరకు విక్రయించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ కూడా అందిస్తుందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకు రావాలని కోరారు. సిసిఐ కేంద్రాల ద్వారా పత్తిని విక్రయించి మద్దతు ధరను రైతులు పొందాలన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చునన్నా రు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలకై 180 05995779 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## బిఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు మరింత చేరువచేయండి

### కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులు, ప్రజలు, పల్లె లకు బిఎస్ఎన్ఎల్ సేవలు మరింత అందుబాటులోనికి తీసుకురావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఓసిలో ఇండియన్ టెలికమ్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి భాస్కర్ రావు బృంధం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ మరింతగా గ్రామాల్లోకి వెళ్లే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. మండలానికి పంచాయితీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని సేవలు మరింత అందుబాటులోనికి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నెట్ వర్క్ వేగవంతంగా పనిచేస్తే సెల్‌ఫోన్ల ద్వారా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు, కరెంట్ అఫైర్స్, తెలుసుకునే అవకాశం ఉంటుందని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభ్యమవుతాయని చెప్పారు. పంచాయితీలలో బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్‌ను అందజేసి ప్రతీ గ్రామంలో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లే విధంగా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను సంస్థ ప్రతినిధులు షాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటిఎస్ డైరెక్టర్ ఎం అరవింద్, ఐటిఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ గణేష్‌కుమార్, ఏటిఎం జి సుభాష్, ఎస్‌డిఇ సక్రు, ఎంఆర్‌డివి శివరాంజీ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి పోటీలలో స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలకు చెందిన ఒకటవ తరగతి విద్యార్థి పసుపులేటి వీక్ష రెండు విభాగాలలో పతకాలు సాధించిందని తెలిపారు. 400 మీటర్ల రోలర్ స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్, 600 మీటర్ల స్కేటింగ్ సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. డిసెంబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు వీక్ష ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో 600, 400 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. స్కేటింగ్ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు వీక్ష ఎంపికై జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిందన్నారు. అన్ని రంగాలలో శిక్షణనిస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపి పతకాలను సాధించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వీక్షను అభినందించారు. డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ సిపిఐ శతాబ్ది చరిత్ర

### ఆదర్శంగా హవేలీ శాఖ
### నగర కార్యదర్శి జానిమియా

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ఇంటింటికి తెలియజేయాలని ఇందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ప్రతాపనేని ఉపేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జానిమియా శతా బ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని దానికి ముందే కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరాలకు తెలియజేసేవిధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా పార్టీ ఉద్యమ చరిత్రను, అమరులైన వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు జానిమియా తెలిపారు. ఖానాపురం హవేలీ శాఖ సభ్యులు మొత్తం పార్టీ శత వ సంత ముగింపు ఉత్సవాల సందర్భంగా జరిగే కా ర్యక్రమాలకు ప్రతి సభ్యుడు రూ. 500 విరాళంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. హవేలీ శాఖ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. సంబంధించి గడప గడపకు వెళ్లేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, పార్టీ బాధ్యులు జాకీరుద్దీన్, ఆముదాల వెంకన్న, పి.వెంకటేశ్వర్లు, బానోత్ రాములు, అజీమ్, ఉపేందర్ పాల్గొన్నారు.




# అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** ఖమ్మం నగరంలో పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. బుధవారం నగరంలోని 16, 50 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి తుమ్మల సహకారంతో కార్పొరేషన్‌లో అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నామన్నారు.కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సహయ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటేషన్ సూపర్ వైజర్ సాం బయ్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### పారిశుధ్య పనులను పరిశీలించిన మేయర్

ఖమ్మం నగరంలో ప్రత్యేక పారిశుధ్య పనులను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఇల్లందురోడ్డు, రాపర్తి నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది నిబద్ధతతో పని చేయాలన్నారు. నగర ప్రజల ఆరోగ్యం పరిరక్షణకు కార్పోరేషన్ ఆధ్వర్యంలో తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లపై చెత్త లేకుండా, కాలువలను శుభ్రం చేయడంతో పాటు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నట్లు తెలిపారు. డివిజన్లలో చెత్త వాహనాలు సమయపాలన, సిబ్బంది విధులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, మేడారపు వెంకటేశ్వర్లు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సహయ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ ఆదాయాన్ని పెంచాలి



**ప్రజాపక్షం/ వైరా :** వైరా వ్యవసాయ మార్కెట్ ఆదాయాన్ని పెంచేందు కు ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోళ్ల గంగారావు తెలిపారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన పాలక వర్గ సమావేశం ఛైర్మన్ బోళ్ల గంగారావు అధ్యక్షతన జరిగింది. ఛైర్మన్ బోళ్ల గంగారావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్ లు మాట్లాడుతూ మార్కెట్ ఆదాయాన్ని పెంచేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెక్‌పోస్టుల ఆదాయాన్ని పెంచుట, షాపింగ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు, యార్డ్ నందు సిసి రోడ్లు తదితర అంశాలపై పాలక వర్గ సభ్యులతో చర్చించారు. నాగేశ్వరరావు, పొట్టపల్లి గోపి, పూనాటి బాబురావు, బానోత్ మురళికృష్ణ, జాలాది తిరుపతి రావు, కాసిమళ్ల వెంకటేశ్వరరావు, షేక్ మౌలాలి, సత్యం, మోతుకూరి వెంకటేశ్వరరావు, మల్లేశ్వరి, ఏడిఏ కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి, మార్కెట్ సహయ కార్యదర్శి, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 1వ వార్డులో సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో రాహుల్‌గాంధి చేపట్టిన దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీ కార్యక్రమానికి మద్దతుగా ఒకటో వార్డులో వైరా కాంగ్రెస్ పట్టణ నాయకులు వీరంశెట్టి సీతారాములు, ఒకటో వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగె వెంకన్న, ఉపాధ్యక్షులు దురిశెట్టి నర్సింహారావు,ప్రధాన కార్యదర్శి మోరు శ్రీకాంత్ సంతకాల సేకరణ నిర్వహించారు. సీతారాములు మాట్లాడుతూ ఓట్ల చోరీ జరిగిందని, దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధి చేపట్టినమద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమం వైరాలో చేపట్టడం జరిగిందని,ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ సూచనల మేరకు చేపట్టడం జరిగిందని అన్నారు.వార్డు కాంగ్రెస్ నాయకులు జాకోబు, ఏలీషా, దుగ్గిరాల బాలస్వామి, మహేష్, జోజి,దిలీప్, జంపన్న,పద్మ, దుగ్గిరాల మహేష్, కిట్టయ్య, పాల్గొన్నారు.

## రోడ్లు మరమ్మతు చేపట్టాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని దీనివలన రోడ్డుప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని ఆర్అండ్‌బిశాఖ వెంటనే రోడ్లు మరమ్మత్తు చేపట్టాలని భారతీయజనతాపార్టీ తరుపున నిరసనదీక్ష బుధవారం చేపట్టారు అనంతరం వైరా ఆర్అండ్‌బి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు పల్లిపాడునుంచి ఏన్కూర్ వెళ్లే ఆర్అండ్‌బిరోడ్డుపై మోకాలులోతు గుంతలు ఏర్పడి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుమీదుగా నిత్యం వేలాది వాహనాలు తిరుగుతునానయని ప్రమాదాలకు కేరాఫ్‌గా ఈరోడ్డునిలిచిందని అన్నారు. ఆర్అండ్‌బి శాఖ అధికారులు వెంటనే రోడ్డుమరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈకార్యక్రమంలో బిజేపి జిల్లా ఉపాధ్యక్షులు బండారు నరేష్, జిల్లా కార్యదర్శి తొండపు సైదేశ్వరరావు, దుద్దుకూరి కార్తీక్, నరుకుల్లా వెంకటేశ్వరరావు, చింతనిప్పు రామారావు, ఏపూరి శ్రీనివాసరావు, వైరా బిజేపి టౌన్ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ, వైరా రూరల్ మండల అధ్యక్షుడు దోసపాటి కళ్యాణ్, కొణిజర్ల మండల అధ్యక్షుడు కవిడ మురళీకృష్ణ, పల్లెపాటి వెంకటేష్, వల్లెపు అనిల్, వాకదాని నరసింహారావు, దరియా సింగ్, నరేష్, జనార్ధన్, ఓర్సు శ్రీనివాస్, గుప్తా నాగేంద్రబాబు, కూరగాయల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.




## సోలార్ పవర్‌పై ప్రత్యేక దృష్టి

### జిఎం షాలోం రాజు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కంపెనీ భవిష్యత్‌లో నెట్ జీరో కంపెనీగా మారే దిశగా పలు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం సోలార్ పవర్ జనరేషన్ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తగూడెం ఏరియా సింగరేణి జిఎం షాలేం రాజు తెలిపారు. ప్రస్తుతం కంపెనీ 300 మెగా వాట్ల పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయగా, కొత్తగూడెం ఏరియా కింద 102 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం కృషి జరుగుతోందని చెప్పారు. అదేవిధంగా రాజస్థాన్ ప్రభుత్వం తో చర్చలు జరిపి అక్కడ కూడా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని తెలిపారు. అదే విదంగా అదనంగా పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి ప్రాంతంలో మట్టిలో ఖనిజాలు ఉన్నట్లు గుర్తించినందున, వాటిని ప్రాసెస్ చేసి వాటి విలువ ఆధారంగా ఇతర కంపెనీలకు అందించనున్నట్లు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 15 6.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 75.71 లక్షల టన్నుల వెలికితీత జరగిందని తెలిపారు. అదే విధంగా 869 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 391 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 26 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కిష్టారం పిఓ నరసింహారావు, ఎస్ ఓ టూ జిఎం కోటిరెడ్డి, జేవిఆర్ సిహెచ్ పి సోమశేఖర్, ఏరియా ఇంజనీర్ రాజు, మోహన్ రావు ఏరియా పర్సనల్ మేనేజర్, వెల్ఫేర్ ఆపీసర్లు కావ్య, దేవదాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.




## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/పెనుబల్లి:** విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, సివిల్ సప్లై అధికారులు దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పెనుబల్లి మండల కేంద్రానికి చెందిన మహిళ ఇంటిలో అక్రమంగా నిల్వ చేశారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించి 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని బుధవారం రేషన్ షాపుకు తరలించి సివిల్ సప్లై అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీ యాదయ్య, సివిల్ సప్లై ఆర్ఐలు నరేష్, కిరణ్, వంగా ముత్యాల బంజర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రీల్



## చాలా నచ్చింది

### చిట్ చాట్‌లో సిద్ధు జొన్నలగడ్డ

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మించినమ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. నీరజా కోన దర్శకత్వంలోటిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఏడాదిన్నర క్రితమే నీరజ కోన కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అయితే క్యారెక్టరైజేషన్ మీద ఇంకా వర్క్ చేద్దాము అని చెప్పాను. టిల్లు స్క్వేర్ చేసిన తర్వాతసినిమా కాబట్టి క్యారెక్టరైజేషన్ స్ట్రాంగ్‌గా వుండాలని భావించాం. క్యారెక్టరైజేషన్ చాలా సినిమాలు ముందుకు తీసుకెళ్తుంది. అలా స్టోరీ లాక్ చేసుకున్న తర్వాత అనౌన్స్ చేశాం. తెలుసు కదా సినిమాలో నా క్యారెక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉండబోతుంది. కచ్చితంగా ఆడియన్స్‌ని షాక్ చేస్తుందని నమ్ముతున్నాను. ఇందులో మంచి హ్యూమర్ కూడా ఉంటుంది. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత సినిమా మీద అద్భుతమైన బజ్ వచ్చింది. ఇందులో వరుణ్ క్యారెక్టర్ తను మామూలుగా ఉన్నప్పటికీ తన ఆలోచనలు చాలా రాడికల్ గా ఉంటాయి. ఖచ్చితంగా ఆడియన్స్‌కి ఆ క్యారెక్టర్ చాలా కొత్త ఎక్స్పీరియన్స్ ఇస్తుందని నమ్మకం ఉంది.ఇది ఒరిజినల్ ఫిల్మ్.ఇందులో మీరు 80% కొత్త సీన్స్ ఉంటాయి. ఇంతకుముందు చూసిన సీన్స్ లాగ ఉండవు. లవ్ స్టోరీ లవ్ మ్యారేజ్ ఫ్యామిలీ రిలేషన్ షిప్ గురించి డిస్కషన్ ఉంటుంది. కానీ ప్రతి సీను చాలా కొత్తగా ఉంటుంది. నీరజచాలా స్ట్రాంగ్ క్యారెక్టర్స్‌తో వచ్చారు. రాశి, శ్రీనిధి క్యారెక్టర్స్ స్ట్రాంగ్ ఉంటాయి. వాళ్ళకి మించిన స్ట్రాంగ్ క్యారెక్టర్ హీరోది. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత దీని కంటూ ఒక జానెర్ ఏర్పడుతుందని అనిపిస్తుంది. నీరజ ఐడియా చాలా కొత్తగా ఉంది. నాకు నచ్చింది. అయితే క్యారెక్టర్ కుదిరితేనే షూటింగ్‌కి వస్తానని తనకు ముందుగానే చెప్పాను. అలాంటి క్యారెక్టర్ కుదిరిన తర్వాతే షూట్ స్టార్ట్ చేశాము. ట్రైలర్‌లో ఉన్న ప్రతి సీన్ సినిమాలో ఉంటుంది. ట్రైలర్‌లో చివర్లో వైవా హర్ష సీన్ తప్పితే మిగతా అన్ని సీన్లు సినిమాలో వుంటాయి. నాకే నా మీద ఎక్కువ అంచనా ఉంది. ఏ సినిమా చేసిన అందుకే చివరి క్షణం వరకు వదలకుండా కూర్చుంటాను.ఒక క్రేజీ క్యారెక్టర్ చేస్తున్నామని మనకి అనిపించాలి కదా. ఇప్పుడు డిటివిఎస్ చూసి వచ్చిన తర్వాత చాలా ఎక్సైట్ అవుతున్నా. ఇదే ఆడియన్స్ కూడా ఫీల్ అవుతారని భావిస్తాను.కథ లో ఒక యూనిక్ నెస్ ఉంది. తనకి తొలి రోజు నుంచి అదే విషయం చెప్పాను. కథ చాలా బాగుంది. దానికి తగ్గట్టు క్యారెక్టర్జేషన్ డెవలప్ అయితేనే చేద్దామని చెప్పాను. అలాంటి యూనిక్ క్యారెక్టర్ ఇందులో కుదిరింది. ఒక ప్రాజెక్టు కమిట్ అయినప్పుడు నిర్మాత ఎవరిని బేస్ చేసుకుని ఆ ప్రాజెక్ట్ చేస్తున్నారనేది చాలా ఇంపార్టెంట్. తెలుసు కదా విషయానికొస్తే విశ్వమీకు నచ్చింది కాబట్టి సినిమా చేయండి అని చెప్పారు. అలాంటప్పుడు నాకు చాలా రెస్పాన్సిబిలిటీ ఉంటుంది. నేను ఇన్వాల్వ్ అయ్యాను అంటే నాకు ఎవరు కథలు చెప్పలేదు. నాకోసం ఎవరు కథలు రాయలేదు. సినిమా ఎలా తీయాలో నేర్చుకోవాల్సి వచ్చింది. నా ప్రొడ్యూసర్స్ నన్ను నమ్మి సినిమా చేస్తున్నప్పుడు 100% దానికి నేను న్యాయం చేయాలి. సినిమా హిట్ అయితే గ్రేట్ డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, యాక్టింగ్ అంటారు. అదే సినిమా పోతే నేను ఇన్వాల్వ్ అయ్యాను కాబట్టి నా వల్ల పోయింది. హిట్ అయితే అందరికీ క్రెడిట్ పోతే.. నా ఒక్కడికే బ్లేమ్. దానికి తెగించే ఇక్కడ ఉన్నాను. డైలాగ్ చెప్పి కార్వాన్‌లోకి వెళ్లిపోవాలని నాకు ఉంటుంది. నేను ఇన్వాల్వ్ అవ్వకుండా సినిమా చేయడం అనేది నా కల. అయితే నాకు ఆ లగ్జరీ లేదు. ఫిలిం మేకింగ్‌లో ఎక్కువ వుండటంతో ప్రాసెస్ ని ఎంజాయ్ చేయలేకపోతున్నాను. ఆడియన్స్ థియేటర్ ఎక్స్పీరియన్స్‌ని నేను ఎంజాయ్ చేస్తున్నాను. నేను అనుకున్నది వాళ్లు కూడా ఫీలవుతున్నారా లేదా అనేది కిక్ ఇస్తోంది. జాక్ సినిమా తర్వాత ఒకరోజు డైరెక్టర్ కొరటాల శివఫోన్ చేసి' టిల్లుతో ఆల్ టైం హై చూశావు, జాక్‌లో చూశావు.. ఇక నువ్వు ఏం చేసినా ఆ రెండిటి మధ్య చూస్తావు' అన్నారు.ఈ మాట ఇకపై ఎలాంటి సిచువేషన్స్ అయినా ఇలా చూడాలని ఒక థాట్ ని కలిగించింది. కొత్తవారితో కలిసి వర్క్ చేయడం ఒక రిస్క్‌తో కూడుకున్న పనే. అయితే రిస్క్ తో పాటు ఒక రివార్డు కూడా వుంటుంది. నీరజ గారితో వర్క్ చేయాలనుకున్నప్పుడు ఎలాంటి టీంతో వెళ్ళాలనేది ముందుగానే నిర్ణయించుకున్నాం. పీపుల్ మీడియా ప్రొడక్షన్ హౌస్, మ్యూజిక్ తమన్, ఎడిటర్ నవీన్ ఇలా చాలా ఎక్స్పీరియన్స్ టెక్నీషియన్స్ ఈ సినిమాకి పనిచేశారు. మీరు ట్రైలర్ టీజర్ చూస్తే ఎక్కడ కూడా కొత్త సినిమా కొత్త డైరెక్టర్ చేసిన సినిమాలా వుండదు.ఒక పెద్ద సినిమా మేకింగ్ లానే ఉంటుంది. నా క్యారెక్టర్ సినిమాలో 23 నిమిషం తర్వాత ఒక వైల్డ్ టర్న్ తీసుకుంటుంది. ఖచ్చితంగా డైరెక్షన్ చేస్తాను. ఐడియాస్ ఉన్నాయి. అయితే దానికి సమయం కుదరాలి. ఈ కథకైతే ముగింపు ఉంది. టిల్లుకి కూడా మేము సీక్వెల్ చేస్తామని ఎప్పుడు అనుకోలేదు. జనం కోరుకున్నారు కాబట్టి అది జరిగింది. వరుణ్ క్యారెక్టర్‌కి ఆ డిమాండ్ వస్తే చేసే అవకాశం ఉంటుంది.

## ఆ కామెంట్స్ పట్టించుకోను

### చిట్ చాట్‌లో ప్రియదర్శి



ప్రియదర్శి హీరోగా తెలుగు అమ్మాయి నిహారిక హీరోయిన్ గా నటిస్తున్న సినిమా మిత్ర మనాలి. కామెడీ ప్రధానంగా తెరకెక్కిన సినిమా ఇది. మిత్ర మండలి సినిమా నేడు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలోహీరో ప్రియదర్శి మీడియాతో ముచ్చటించారు.

*** జాతి రత్నాలు ఇచ్చిన కాన్ఫిడెంట్‌తోనే ఈ మూవీని ఓకే చేశారా?**

అనుదీప్ ఆ టైంలో 'జాతి రత్నాలు' కథ చెప్పినప్పుడు ఆయన రైటింగ్ నాకు చాలా నచ్చింది. సమాజంలోని కొన్ని సమస్యల్ని సెటైరికల్‌గా చెబుతుంటారు. ఇందులో కుల వ్యవస్థ మీద విజయేందర్ మంచి సెటైరికల్ సీన్లు రాసుకున్నారు. సినిమాల్లో ఇచ్చే సందేశాల ద్వారా సమాజం మారుతుందని నేను నమ్మను.

*** సోషల్ మీడియాలో వచ్చే నెగెటివ్ కామెంట్లు, క్రింజ్ అనే కామెంట్ల మీద మీ అభిప్రాయం ఏంటి?**

అవతలి వాళ్లని నవ్వించే ప్రయత్నం చేయడం తప్పు కాదు. కానీ అవతలి వాళ్లని తక్కువ చేసి కామెడీ చేయడమే నా దృష్టిలో క్రింజ్ అవుతుంది. కొన్ని సార్లు వాదనలు గెలవలేనప్పుడు, మనల్ని ఏమీ చేయలేకపోతోన్నప్పుడు అలాంటి నెగెటివ్ కామెంట్లను చేస్తుంటారు. కొన్ని కొందరికి వర్కౌట్ అవుతుంది.. ఇంకొన్ని కొందరికి వర్కౌట్ కావు.

*** ఇప్పుడు ఏ కామెడీ సినిమా వచ్చినా కూడా 'జాతి రత్నాలు'తో పోల్చుతున్నారు ? ఈ జానర్‌లోనే సినిమా ఎందుకు చేస్తున్నారు?**

'జాతి రత్నాలు', 'మిత్ర మండలి' ఒకేలా ఉండవు. 'జాతి రత్నాలు' తరువాత '35 చిన్న కథ కాదు', 'కోర్ట్' వంటి డిఫరెంట్ చిత్రాలు చేశాను. ఎప్పుడూ ఒకే రకమైన జానర్ చిత్రాల్ని చేయడం నాకు కూడా ఇష్టం ఉండదు. 'జాతి రత్నాలు' టైపులో ఎవరైనా కథ చెబితే కూడా వద్దని అంటాను.

*** మీ 'మిత్ర మండలి' మీద కావాలనే నెగెటివ్ క్యాంపైన్ జరుగుతోందా?**

విమర్శించే హక్కు ఎవరికైనా ఉంటుంది. నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తే బాగుంటుంది. కానీ కావాలనే ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారు. కించ పర్చాలని, కిందకు తొక్కాలని టార్గెటెడ్‌గా హేట్‌ను వ్యాప్తి చేస్తున్నారు. అలాంటి ద్వేషాన్ని వ్యాప్తి చేసే వాళ్ల కోసం మేం నలుగురు కలిసి ఆ ఫన్నీ వీడియోని చేశాం. అలా టార్గెటెడ్ హేట్రెడ్‌ని స్ప్రెడ్ చేసే వాళ్లు కనీసం సొంత పేరు కూడా పెట్టుకోరు. ఏవేవో పేర్లతో, ఫేక్ ఐడీలతో ఇలాంటి పనుల్ని చేసే వారిని మనం ఏం చేయగలం.

***మిత్రమండలి' ఆడియెన్స్‌కి నచ్చకపోతే.. నా నెక్స్ట్ సినిమాని చూడకండి' అని అంత పెద్ద స్టేట్‌మెంట్ ఎందుకు ఇచ్చారు?**

'మిత్ర మండలి' మీద నాకున్న నమ్మకంతోనే అలా అన్నాను. నాని అన్నకి 'కోర్ట్' మీద ఉన్న నమ్మకంతో ఈవెంట్‌లో అలా చెప్పారు. నాక్కూడా నా 'మిత్ర మండలి' మీద అంతే ప్రేమ, నమ్మకం ఉంది. అందుకే అలా అన్నాను. అంతే కానీ మిగతా చిత్రాల్ని తక్కువ చేయాలనే ఉద్దేశం నాకు లేదు.

*** మీ చేతిలో ప్రస్తుతం ఎన్ని ప్రాజెక్ట్‌లు, ఎన్ని డిఫరెంట్ కథలు ఉన్నాయి?**

ప్రస్తుతం నా దగ్గరకు చాలా డిఫరెంట్ కథలు వచ్చాయి. అందులో 'ప్రేమంటే' అనే మూవీ షూటింగ్ జరుగుతోంది. మరో రెండు కథలు నాకెంతో నచ్చాయి. వాటికి సంబంధించిన ప్రకటన త్వరలోనే జరుగుతుంది.

## తొలితరం గాయని రావు బాల సరస్వతి కన్నుమూత



తెలుగు సినిమా తొలి తరం నటి, గాయని రావు బాల సరస్వతి కన్ను మూశారు. తొంభై ఏడు సంవత్సరాల వయసున్న రావు బాల సరస్వతి వృద్ధ్యాప్య సమస్యలతో గత కొద్దిరోజులుగా బాధ పడుతున్నారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో ఆమె తుది శ్వాస విడిచారు. రావు బాలసరస్వతీ దేవి 1928 ఆగష్టు 29న జన్మించారు. .పాతతరం తెలుగు చలనచిత్ర నటి, నేపథ్యగాయని. లలిత సంగీత సామ్రాజ్ఞిగా బాలసరస్వతీ దేవి ప్రసిద్ధి పొందారు.ఆకాశవాణి సంగీత కార్యక్రమాలలో ఆమె కంఠం తెలుగు వారికి సుపరిచితం. సినిమాలలో నేపథ్యగాయనిగా ఆమె తెలుగు వారి హృదయాలను దోచుకున్నారు. మధురమైన కంఠస్వరం బాలసరస్వతీదేవిది. ఆరో ఏట ప్రారంభమైన ఆమె గాత్ర మాధుర్యం అరవయ్యో ఏట వరకు కొనసాగింది. రావు బాల సరస్వతి మద్రాసులో పుట్టి పెరిగినప్పటికీ 1934లో వీరి కుటుంబం గుంటూరు తరలి వచ్చింది. హెచ్.ఎం.వి. ద్వారా ఈవిడ పాటలన్నీ విని సి.పుల్లయ్య 'సతీ అనసూయ' చిత్రంలో అవకాశమిచ్చారు. అప్పుడు ఈవిడ వయసు ఏడేళ్ళు. ఆ విధంగా ఈవిడ 80 యేళ్ళ క్రితం తన మొదటి చిత్రంలో నటించింది. ఈ చిత్రంలో గంగ పాత్రలో పాడుతూ నటించింది. కవి బలిజేపల్లి లక్ష్మీ కాంతం 'ఏది దారి నాకిచట ఈ కలుష భూతములపాలైతిని..' అనేది ఈ సినిమాలో ఈవిడ పాడిన పాట. ఆకుల నరసింహారావు సంగీతం. చిన్న వయసులో సినిమా పాటపాడి గాయనిగా, నటిగా అందరి ప్రశంసలు అందుకున్నది. 1936లో విడుదలైన ఈ చిత్రంలో 60 మంది చిన్నపిల్లలు నటించడమేఈ సినిమాలోని ప్రత్యేకత. భక్తతుకారాం, 'ఇల్లాలు', భక్త కుచేల, బాలయోగిని వంటి సినిమాలో నటించడంతో పాటు ఆమె పాటలు కూడా పాడారు. తెలుగు సినిమా ప్రముఖులు చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నిర్మాత దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ వంటి పలువురు ప్రముఖులు ఆమెకు సంతాపం ప్రకటించారు.

## 'ఎద మాటున' పాట ఆవిష్కరణ



టీఆర్ డ్రీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న క్రైమ్ థ్రిల్లర్ సీమంతం. హీరోగా వజ్రయోగి, హీరోయిన్‌గా శ్రేయ భర్తీ నటిస్తున్నారు. సుధాకర్ పాణి దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమా 'యద మాటున' పాటను ప్రముఖ సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్.పి.పట్నాయక్ మాట్లాడుతూ.. మంచి కాన్సెప్ట్‌తో వస్తోన్న సీమంతం సినిమా విజయం సాధించాలి, అందరికి మంచి పేరు రావాలని, నవంబర్ 14న థియేటర్స్‌లో విడుదల కాబోతున్న ఈ సినిమాను అందరూ ఆధరించాలి, అలాగే యద మాటున సాంగ్ బాగుందని అన్నారు. ఈ చిత్రం ప్రశాంత్ టాటా నిర్మాణంలో, గాయత్రి సౌమ్య గుడిసేవ సహనిర్మాతగా తెరకెక్కుతుంది.









## బిజెపిలో బిసిలు ఎక్కడ?

### కేంద్రమంత్రిని ప్రశ్నించిన రాజాసింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిపై మరోమారు ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్ టికెట్ కేటాయించిన నిమిషాల వ్యవధిలో ఆయన చేసిన వ్యాఖ్యలు చేశారు. 'ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, కిషన్ రెడ్డి రాజ్యం, కిషన్ రెడ్డి రాజ్యం. తెలంగాణలో ఎన్నికలు జరిగినప్పుడల్లా లేదా ప్రముఖ నాయకుడు వచ్చినప్పుడల్లా, భవిష్యత్తు లో ఒక బిసి తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతాడని అందరూ అంటారు. తెలంగాణలో చిన్న ఎన్నికల కానీ, పెద్ద ఎన్నికల కానీ వస్తే బిసిలనే మర్చిపోతారు అని రాజాసింగ్ ఆరోపించారు. 'బిసిలను మన తెలంగాణ భారతీయ జనతా పార్టీ లోపట ఎక్కడున్నారో కొద్ది చెప్తారా కిషన్ రెడ్డి. నేను ఇంతకు ముందు ఎప్పుడూ ఎస్‌సిలు, బిసిలు, ఎస్‌టిలు లేదా ఓబిసిల గురించి మాట్లాడలేదు. నేను హిందూత్వం గురించి మాత్రమే మాట్లాడుతాను. కానీ నేను ఈరోజు దాని గురించి మాట్లాడటానికి కారణం మీరు ప్రతి ఎన్నికల్లో బిసి కార్డును ప్లే చేసి, బిసి సమాజానికి మీరు మోసం చేస్తారు. అందుకే నేను ఈరోజు చెప్పాల్సి వచ్చింది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై రాజాసింగ్ మరోసారి ఘటు విమర్శలు చేశారు. బిసి సమాజాన్ని మోసం చేస్తున్నారంటూ కిషన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## కేంద్రం విముఖత (మొదటి పేజీ తరువాయి)

క్లీనర్లు, టార్పలిన్లు, మున్నగు వాటి జిల్లాల వారిగా లభ్యతపై సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సిసిఐ టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, వెంటనే కలెక్టర్లు జిన్నింగ్ సెంటర్లు గురువారంలోపు నోటిఫై చేసి,పత్తి కొనుగోళ్లు కూడా ఆరంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పంటల కొనుగోళ్లకు ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఒక హెచ్ఒడిని సమన్వయ అధికారిగా నియమించా మని, వీరు ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లతో సమన్వయం చేసుకుని రైతులకు కొనుగోలు కేంద్రాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండాచూడాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి పాల్గొన్నారు.



















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com